thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

## వాయుసేనలో ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

న్యూఢిల్లీ : భారత వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకోక తప్పదని ఉన్నత స్థాయి కమిటీ అభిప్రాయపడింది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో భాగంగా ప్రైవేటు సంస్థల సహకారం తీసుకొని లోటుపాట్లను సరిదిద్దుకో వాల్సి ఉందని తెలిపింది. సకాలంలో యుద్ధ విమానాలు అందక ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు సాక్షాత్తూ వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ బహిరంగంగా చెప్పిన నేపథ్యంలో కమిటీ చేసిన ఈ సూచనకు ప్రాధాన్యం ఏర్పడింది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలోని సాధికారిక కమిటీ రక్షణ మంత్రికి అందజేసిన నివేదికలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రస్తావించింది. యుద్ధ విమానాల తయారీ, ఇతర అంశాల్లో ప్రైవేటు భాగస్వామ్యం తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సు చేసింది.

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 45 కరీంనగర్ శనివారం, 26 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

# మా దేశం విడిచి వెళ్ళండి

హైదరాబాద్ : ఇండియాలో ఉంటున్న పాకిస్థాన్ పౌరులంతా వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలంటూ భారత ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఎంత మంది పాకిస్థానీలు ఉన్నారో వాళ్ల లిస్ట్ రెడీ చేసింది. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో అమిత్ షా మాట్లాడారు. దీంతో సీఎం ఆదేశాల మేరకు తెలంగాణ డీజీపీ కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో ఉన్న పాకిస్థాన్ పౌరులు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలని నోటీస్ జారీ చేశారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా.. పాకిస్థాన్ పౌరులు తమ దేశానికి వెళ్లేందుకు అట్టారి బోర్డర్ ఓపెన్‌గానే ఉందని తెలిపారు. ఎలాంటి సమస్య రాకుండా ఉండాలి అంటే పాకిస్థానీలు వెంటనే వెళ్లిపోవాలని హెచ్చరించారు.

**తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పీపుల్స్ ప్లాజా వద్ద శాంతి ర్యాలీ – పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ...** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ సమీపంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా హైదరాబాద్‌లో శాంతి ర్యాలీ జరిగింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహించారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ ర్యాలీలో పాల్గొని ఉగ్రవాద చర్యలను ఖండించారు. ఈ శాంతి ప్రదర్శన పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమై ట్యాంక్‌బండ్‌పై ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది.

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో బాధితులకు సంఘీభావం తెలపాలని, ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో ఏఐసీసీ ముఖ్య నేతలు సమావేశమై చర్చించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, డివిజన్ కేంద్రాల్లో శాంతియుత నిరసనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఏఐసీసీ ఇచ్చిన పిలుపులో భాగంగానే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఈ శాంతి ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. కాగా, ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్ద కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సహా పలువురు జాతీయ నాయకులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి తమ నిరసనను తెలియజేశారు.




# ఏప్రిల్ 27- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్?

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక తేదీగా ఏప్రిల్ 27 నిలవబోతోంది. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావానికి 25 ఏళ్లు పూర్తయ్యిన సందర్భంగా వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభపై ఇప్పుడు అన్ని దృష్టులు దారితీస్తున్నాయి. అధికారం కోల్పోయిన తర్వాత మొదటిసారిగా బీఆర్ఎస్ చేస్తున్న ఈ భారీ కార్యక్రమం%ౌ% కేవలం సెలబ్రేషన్ మాత్రమే కాదు, ఒక రకంగా కొత్త రాజకీయ శకానికి ఆరంభం కావచ్చు.

ఈ సభ ద్వారా పార్టీ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తిగా ఉన్న నాయకులను తిరిగి తమ పార్టీలోకి ఆహ్వానించేందుకు కేసీఆర్ ప్రయత్నించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే అంశం ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో ఆందోళనకు గురిచేస్తోంది. ఎందుకంటే ఇటీవలే బీఆర్ఎస్ నుంచి వచ్చిన 13 మంది నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంది.




వీరిలో కొందరు బలమైన నాయకులు కాగా, మరికొంత మంది కేసీఆర్ సన్నిహితులు కూడా. అయితే, వీరిని తమ పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్ నేతలకు ఇప్పుడు కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వర్గీయులతో వారి విభేదాలు వెల్లివిరిశాయి. ఈ విభేదాల వల్లే ఇప్పుడు ఆ నాయకులలో కొందరు అసంతృప్తిగా మారినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని గమనించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... తగిన సమయాన్నే ఎంచుకుని మళ్లీ వారిని తనవైపుకు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారన్న మాట బలంగా వినిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఈ పరిస్థితిని తేరుకునే ప్రయత్నాల్లో ఉంది. అసంతృప్త నేతలతో సంబంధం మెరుగుపర్చాలని, వారిని బుజ్జగించాలని యత్నిస్తోంది. అయినప్పటికీ, కొంతమంది మాత్రం తిరిగే అవకాశాలపై ఆసక్తిగా ఉన్నారట. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 27న బీఆర్ఎస్ సభ ఎలా ఉంటుందో, ఎవరు వస్తారో, ఏయే కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయో అన్న ఉత్కంఠ ప్రస్తుతం తెలంగాణ రాజకీయ వర్గాల్లో గట్టిగానే ఉంది.



## ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నా.. పూర్తి మద్దతిస్తాం: రాహుల్ గాంధీ

భారతీయులందరూ ఐక్యంగా ఉండటం అవసరమని.. తద్వారా ఉగ్ర చర్యలను, వారి లక్ష్యాలను దీటుగా ఎదుర్కోవచ్చని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయని, దీనిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తామని స్పష్టం చేశారు. శ్రీనగర్‌లో పర్యటించిన రాహుల్.. లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంతో భేటీ కావడంతోపాటు ఉగ్రదాడి బాధితులను కలిసి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.

"సమాజాన్ని విభజించడం, సోదరుల మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని. ఈ ఉగ్రచర్యను జమ్మూ కశ్మీర్ మొత్తం ఖండించింది. వీరికి యావద్దేశం పూర్తి మద్దతుగా నిలిచింది. భారతీయులంతా ఐక్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. అప్పుడే ఉగ్ర చర్యలను, వారి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోగలం. కశ్మీర్‌తోపాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరం. మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలి.

లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితోనూ భేటీ అయ్యా. ఏం జరిగిందో వారు వివరించారు. మా పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని వారిద్దరికీ హామీ ఇచ్చా" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.






# భారత ఆర్మీ హంటింగ్ స్టార్ట్..

## లష్కరే తోయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతం

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడికి భారత సైన్యం అంతకంతకు ప్రతీకారం తీర్చుకుంటుంది. 26 మంది అమాయక ప్రజలను పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకలను వెటాడి వెంటాడి మరీ చంపుతోంది. ఈ క్రమంలోనే పహల్గాం ఉగ్రదాడితో ప్రమేయమున్న లష్కరే తోయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. బందిపోరాలో శుక్రవారం (ఏప్రిల్ 25) జరిగిన ఎన్ కౌంటర్లో అల్తాఫ్ లల్లీని అంతమొందించారు జవాన్లు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత టెర్రరిస్టుల కోసం భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే శుక్రవారం (ఏప్రిల్ 25) కుల్నార్, బందిపోరాలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారని భద్రతా దళాలకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు, జమ్మూ కాశ్మీర్ పోలీసులు.. బందిపోరాలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. జవాన్ల రాకను గమనించిన ఉగ్రమూకలు ఒక్కసారిగా వారిపై కాల్పులకు తెగబడ్డారు. వెంటనే తేరుకున్న భద్రతా దళాలు తిరిగి ఎదురు కాల్పులు జరిపారు. భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య భీకరంగా ఫైరింగ్ జరిగింది. భద్రతా దళాల కాల్పుల్లో ఎల్ఈటీ టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఇద్దరు జవాన్లు కూడా గాయపడగా.. చికిత్స నిమిత్తం వారిని వెంటనే అధికారులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందనే విషయం తెలియాల్సి ఉంది. ఇప్పటి వరకైతే ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. అంతకముందు.. పుల్వామా జిల్లా త్రాల్‌లోని మోంఘమా ప్రాంతంలో పహల్గాం ఉగ్రదాడిలో కీలక పాత్ర పోషించిన టెర్రరిస్టులు ఆదిల్ షేక్, ఆసిఫ్ షేక్ ఇళ్లను ఐఈడీ బాంబులతో భద్రతా దళాలు ఇంటిని నేలమట్టం చేశాయి. వీరితో పాటు మరికొం దరు లోకల్ టెర్రరిస్టుల స్థావరాలను కూడా జవాన్లు ధ్వంసం చేశారు. మరికొందరు ముష్కరుల కోసం జమ్మూ కాశ్మీర్ వ్యాప్తంగా భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. కాగా, జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాం ఏరియా బైసారన్ మైదాన ప్రాంతంలో మంగళవారం (ఏప్రిల్ 22) ఉగ్రవాదులు మారణహోమం సృష్టించిన విషయం తెలిసిందే. మినీ స్విట్జర్లాండ్‌గా పిలిచే పహల్గాంకు కుటుంబంతో కలిసి సరదాగా టైమ్ స్పెండ్ చేసేందుకు వచ్చిన పర్యాటకులపై ఉగ్రమూకలు విచక్షణరహితంగా కాల్పులు జరిపాయి. ముష్కరుల పాశవిక దాడిలో 26 మంది అమాయక ప్రజలు మృతి చెందగా.. మరికొందరు పర్యాటకులు బుల్లెట్ గాయాలకు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో పహల్గాంలో దాడికి పాల్పడిన ముష్కరుల కోసం భారత దళాలు జమ్మూ కాశ్మీర్‌ను అణువణువునా శోధిస్తున్నారు.

**వేగంగా మారుతున్న పరిణామాలు!** : సరిహద్దులో ఆయుధాలు కదులుతున్నాయి. ఇరు దేశాల మధ్య ఒప్పందాలు రద్దైపోతున్నాయి. పాక్, భారత్‌ల మధ్య దౌత్య సంబంధాలు తెగిపోయాయి. అటు పాక్ ఇండియా బార్డర్‌లో మిస్సేల్ టెస్ట్ చేస్తోంది. ఈ పరిస్థితులు అన్నీ చూస్తోంటే ఇరు దేశాల మధ్య యుద్ధం తప్పదేమో అనిపిస్తోంది. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు నుంచి భారత్‌తో ఖయ్యానికి పాక్ సరైన సమయం కోసం ఎదురు చూస్తోంది. ఆ సమయం ఇప్పుడు రానే వచ్చిందన్నట్టు ఇరు దేశాలు వ్యవహరిస్తున్నాయి. పహల్గామ్‌లో 26 మంది టూరిస్టులను ఏప్రిల్ 22న TRF ఉగ్రవాదులు కాల్చి చంపారు. బీహార్ పర్యటనలో మోదీ ఉగ్రదాడిపై స్పందించారు. మరణించిన బాధితులకు నివాళులర్పించారు. తన ప్రసంగానికి ముందు రెండు నిమిషాలు మౌనం పాటించారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాదులను భూమిలోకి తొక్కేస్తామని మోదీ అన్నారు. కలలో కూడా ఊహించని శిక్షలు విధిస్తాం. పహల్గాం ఘటనతో దేశమంతా దుఃఖంలో మునిగిపోయింది. మృతుల కుటుంబాలకు దేశమంతా అండగా ఉంటుంది. ఇది కేవలం పర్యాటకులపై జరిగిన దాడి కాదు. భారత ఆత్మపై జరిగింది. ఉగ్రవాదుల వేట కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. చనిపోయిన వాళ్లలో అన్న రాష్ట్రాలకు చెందిన వాళ్లు ఉన్నారు. ఉగ్రవాదులకు సహకరించిన సూత్రధారులను కూడా వదలిపెట్టమని" ప్రధాని మోదీ అన్నారు.

**భారత్ సంచలన నిర్ణయాలు...** ప్రధాని మోదీ రక్షణ శాఖ, హోం శాఖ, విదేశాంగ మంత్రులు, సెక్యూరిటీ ఆఫీసర్లతో సీసీఎస్ సమావేశమైయ్యారు. ఈ మీటింగ్‌లో భారత ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. 1960 నాటి సింధు జల ఒప్పందం తక్షణమే నిలిపివేయబడుతుందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. 72 గంటల్లోగా భారత్‌లో ఉన్న పాకిస్తాన్ హై కమాండ్ ఆఫీస్ కూడా ఖాళీ చేశాలని కేంద్రం ఆదేశించింది. పాకిస్తాన్‌కు ఇచ్చే స్పెషల్ వీసాలను కూడా రద్దు చేసింది. బిసిసిఐ పాకిస్తాన్ దేశంలో ద్వైపాక్షి సిరీస్ క్రికెట్ మ్యాచ్‌లు కూడా రద్దు చేసింది. అలాగే పాక్ సినిమాలను, నటులను కూడా ఇండియాలో రద్దు చేశారు. వాఘా-అట్టారి సరిహద్దు క్రాసింగ్‌ను వెంటనే మూసివేస్తామని మిస్రీ ప్రకటించారు. అలాగే పాకిస్థాన్ జాతీయులు ఇండియాకు రాకుండా నిషేధించడంతో పాటు ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాకిస్థానీలు దేశం విడిచి వెళ్లడానికి 48 గంటల సమయం ఇవ్వబడిందని మిస్రీ తెలిపారు.




## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎం గెలుపు

హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎం గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ విజయం సాధించారు. ఆయనకు 63 ఓట్లు వచ్చాయి. భాజపా అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికలో భాజపా, ఎంఐఎం మాత్రమే పోటీ చేశాయి.

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి 22 ఏళ్ల తర్వాత ఎన్నిక జరిగింది. భాజపా అనూహ్యంగా అభ్యర్థిని బరిలో దింపడంతో ఈ ఎన్నిక చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 23న ఎన్నిక జరిగింది. ఇక్కడ మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధిక ఓట్లు ఎంఐఎంకు ఉండగా.. తర్వాత స్థానంలో భాజపా ఉంది. ఎంఐఎంకు 49 ఓట్లుండగా ఇతర పార్టీల మద్దతు లభించింది. మొత్తం ఓటర్లలో 81 మంది కార్పొరేటర్లు కాగా, 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు. ఎక్స్ అఫీషియో సభ్యుల్లో 9 మంది ఎంపీలు, 15 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎంఐఎం, భారాసలకు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు 9 చొప్పున ఉండగా.. కాంగ్రెస్‌కు ఏడు, భాజపాకు ఆరు ఉన్నాయి.



## లష్కరే టాప్ కమాండర్ హతం..!

బందిపొరాలో ఎన్‌కౌంటర్.. లష్కరే టాప్ కమాండర్ హతం..!

జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర మూకలపై భద్రతా దళాలు తుపాకులు గర్జిస్తున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారి కోసం జల్లెడపడుతున్న భద్రతా దళాలకు బందీపొరాలో అల్తాఫ్ ఆచూకీ తెలిసింది. శుక్రవారం ఉదయం ఆర్మీ–పోలీసు దళాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఓ ఉగ్రవాది గాయపడ్డాడు. ఆ తర్వాత భద్రతా దళాల్లోని అధికారి బాడీగార్డులకు తూటాలు తాకాయి. ఈక్రమంలో అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం.

**పహల్గాం ఉగ్రమూకకు నేరుగా హఫీజ్ సయీద్‌తో లింకులు..** పహల్గాంలో ఉగ్రదాడి వెనక లష్కరే చీఫ్ హఫీజ్ సయీద్ పాత్ర నేరుగా ఉన్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కశ్మీర్‌లో చురుగ్గా పనిచేస్తున్న మాడ్యూల్‌ను అతడే స్వయంగా నియంత్రిస్తున్నట్లు గుర్తించారు. దీనిలో అత్యధిక మంది విదేశీ ఉగ్రవాదులు, కొందరు మాత్రమే స్థానికులు ఉండేటట్లు చూసుకొన్నారు. వీరికి అండగా క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, లాజిస్టిక్స్, దాక్కొనేందుకు ప్రదేశాలు ఏర్పాటుచేసేందుకు కొందరు స్థానికులు పనిచేసేవారు. ఈ ఉగ్రబృందం కొన్నేళ్ల నుంచి ఇక్కడ చాలా దాడుల్లో పాల్గొంది. గత రెండేళ్లలో జరిగిన సోనమార్గ్, బూటపత్రి, గందర్బాల్ జరిగిన హైప్రొఫైల్ దాడుల్లో కూడా ఇవి పాల్గొన్నాయి. గతేడాది అక్టోబర్‌లో బూటపత్రిలో ఇద్దరు ఆర్మీ సిబ్బందిని హత్య చేసింది. అదే నెలలో సోనమార్గ్ సొరంగంలో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను కాల్చిచంపింది. ఈ ఉగ్ర బృందంలో కీలక సభ్యుడైన జునైద్ అహ్మద్ భట్ డిసెంబర్‌లో భద్రతా దళాలు దాచిగామ్ వద్ద ఎన్‌కౌంటర్ చేశాయి. మిగిలిన ఉగ్రవాదులు పారిపోయారు. ఆ తర్వాత ఈ బృందం చాలాకాలం అడవుల్లో ఎవరి కంటా పడకుండా గడిపింది. ఈ బృందం నేరుగా హఫీజ్ సయీద్, అతడి డిప్యూటీ సైఫుల్లా నుంచే ఆర్డర్లు తీసుకొనేది. ఇంటెలిజెన్స్ బృందాల అంచనాల ప్రకారం వీరికి భావజాలంతోపాటు ఇతర ఏర్పాట్లు వ్యూహాత్మకంగా సలహాలు, సూచనలు పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, మిలిటరీ నుంచి వచ్చేవని తెలిపారు. ఈ ఉగ్ర మూక పహల్గాంలో మూడు ప్రదేశాల్లో అత్యధికమందిని చంపారు. తొలుత ఒకచోట ఐదుగురిని కాల్చగా.. మైదాన ప్రాంతంలో ఇద్దరిని.. పారిపోయేందుకు యత్నించిన వారిలో చాలామందిని కంచె వద్ద హత్య చేశారు. ఈ ఉగ్రమూకలో హషీమ్ ముసా, అలిభాయ్ పాక్ జాతీయులు. ఈ మొత్తం బృందంలో ప్రతి సభ్యుడిపైనా ప్రభుత్వం రూ.20 లక్షల రివార్డ్‌ను ప్రకటించింది.




## పెద్దల జేబులు నింపుకోవడానికి కాళేశ్వరం కట్టారు

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహిస్తోన్న 'భారత్ సమ్మిట్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై మాట్లాడారు. ఈ నివేదిక చూసిన తర్వాతైనా భారాస నేతలు సిగ్గు పడాలని అన్నారు. కాళేశ్వరం నిర్మాణం చేసినవారు, చేయించిన వారు రైతులకు ద్రోహం చేశారని చెప్పారు. రైతులకు భారాస నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి భారాస నేతలు రూ.లక్షల కోట్ల ప్రాజెక్టు కట్టారు. వారే డిజైన్ చేశారు.. వారే కట్టారు. ఇప్పుడు మేడిగడ్డ, సుందిళ్ల నిరుపయోకరంగా మారాయి. అబద్ధాలు, తప్పులపై బతకాలని భారాస అనుకుంటోంది. అది కుదరదు. ఎన్‌డీఎస్‌ఏని రేవంత్‌రెడ్డినో.. నేనో వేసింది కాదు.. దేశంలో అత్యుత్తమ నిపుణులు ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నారు. ఈ నివేదికపై అధ్యయనం చేస్తాం. వచ్చే క్యాబినెట్ భేటీలో దీనిపై చర్చించి చర్యలు తీసుకుంటాం"అని మంత్రి తెలిపారు.



## టెర్రరిస్టు కుక్కలను చంపేయండి

### పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోండి

పహల్గాంపై దాడి చేసి.. 26 మంది ప్రాణాలను తీసిన టెర్రరిస్ట కుక్కలను చంపేయాలని.. ఇండియా నుంచి ఏరిపారేయాలన్నారు ఎంఐఎం పార్టీ చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ. ఉగ్రవాదం అంతం చేయటానికి మోదీ ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికి అయినా.. భేషరతుగా మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు ఓవైసీ. జాతీయ ప్రయోజనాల కోసం.. ఇండియా భవిష్యత్ కోసం ప్రధానమంత్రి మోదీ తీసుకునే ఓ నిర్ణయానికి అయినా మద్దతు ఉంటుందని వెల్లడించారు ఓవైసీ. భారతదేశాన్ని జాగ్రత్తగా చూసుకోవాల్సిన సమయం ఇది.. భద్రత విషయంలో రాజీ లేదన్నారు. కాశ్మీర్ ప్రజల రక్షణ కోసం మోదీ ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు ఎంఐఎం పార్టీ అండగా ఉంటుందన్నారు అసదుద్దీన్ ఓవైసీ. మన మధ్య ఎన్ని విబేధాలు అయినా ఉండొచ్చు.. వాటి అన్నింటినీ తర్వాత చూసుకుందాం.. ఇలాంటి కీలకమైన సమయంలో ఐక్యంగా ఉండాలని కోరారు ఓవైసీ. పాకిస్తాన్ తో సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేయడాన్ని స్వాగతించిన ఆయన.. ఈ విషయాన్ని రాజకీయం చేయకూడదన్నారు. టెర్రరిస్టులను పెంచిపోషిస్తూ.. ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్తాన్ దేశంపై చర్యలు తీసుకోవాలని.. ఇందులో ఏ విధంగా రాజీ పడేది లేదన్నారు ఓవైసీ. పాక్ ఆక్రమణలో ఉన్న కాశ్మీర్ భాగాన్ని తిరిగి తెచ్చుకోవాలని.. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను స్వాధీనం చేసుకునే సమయం ఆసన్నమైందని.. ఆత్మ రక్షణ కోసం ముందుకు వెళ్లే సమయం ఇదేనని.. అంతర్జాతీయ చట్టం కూడా ఇదే చెబుతుందన్నారు అసదుద్దీన్ ఓవైసీ. పాకిస్తాన్ పై ఆంక్షలు విధిస్తూ.. సైనిక దాడి ద్వారా పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను తిరిగి స్వాధీనం చేసుకోవాలంటూ మోదీ ప్రభుత్వాన్ని కోరారు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ.



## కాంగ్రెస్ పాలనలో పల్లెలు కన్నీళ్లు పెడుతున్నయ్

హైదరాబాద్ : పదేండ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేకాకుండా.. గ్రామస్వరాజ్యం కోసం మహాత్ముడు కన్న కలల్ని మాజీ సీఎం కేసీఆర్ సాకారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్?ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సమైక్యపాలనలో దశాబ్దాలపాటు దగాపడ్డ పల్లెలను.. దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వమని గురువారం ఎక్స్?లో పేర్కొన్నారు. కేసీఆర్? హయాంలో పదేండ్లు మురిసిన పల్లెలు.. కాంగ్రెస్ పాలనలో కన్నీళు పెడుతున్నాయన్నారు. గ్రామ స్వరాజ్యం పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవని, 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదని, గ్రామాల్లో కనీస వసతులు, గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేకుండా పోయాయని విమర్శించారు. పంచాయతీ సిబ్బందికి జీతాలు, ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవని, మాజీ సర్పంచుల బిల్లులకూ మోక్షం రావడం లేదని అన్నారు. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రుగాల్చి వాతపెడతారన్నారు.




## యాదాద్రిలో భక్తుల రద్దీ

## యాదాద్రిలో రద్దీ.. స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు


**యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేసవి సెలవుల దృష్ట్యా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. ప్రసాద విక్రయశాల, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండకింద విష్ణు పుష్కరిణి, కారు పార్కింగ్, బస్టాండ్ ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. మరోవైపు జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తుగా దేవస్థానం తమ భద్రతా బలగాలను అప్రమత్తం చేసినట్లు ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.**

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ



హైదరాబాద్: తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐజీ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఆయన తరఫున ప్రముఖ న్యాయవాది సి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ముందస్తు బెయిల్ ఇస్తే వెంటనే హైదరాబాద్ వస్తారని కోర్టుకు వివరించారు. ఆయన 30 ఏళ్లకు పైగా వివిధ హోదాల్లో పని చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారని వివరించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు ముందస్తు బెయిల్ పొందారని, అందువల్ల ప్రభాకర్‌రావుకు కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బెయిల్ ఇస్తే దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని, రాజకీయ కక్ష సాధింపు చర్యగా ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సాక్ష్యాలను ధ్వంసం చేశారన్నది నిజం కాదని వాదించారు. పోలీసుల తరఫున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. 65 ఏళ్ల వయసుందన్న సాకుతో ప్రభాకర్‌రావు దర్యాప్తు నుంచి తప్పించుకోలేరన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు పూర్తి ఆధారాలు ఉన్నాయని, హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసి నీళ్లలో పడేసినట్లు దర్యాప్తులో తేలిందని లూథ్రా న్యాయస్థానానికి వివరించారు. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం.. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

## పహల్గాం ఉగ్రదాడి.. మక్కా మసీదులో నల్ల రిబ్బన్లు ధరించి ముస్లింల ప్రార్థనలు




హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మక్కా మసీదులో ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉగ్రదాడిపై నిరసనలకు ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపుతో పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ప్రార్థనల అనంతరం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొంత దూరం ర్యాలీ నిర్వహించారు. హిందుస్థాన్ జిందాబాద్ అంటూ నినదించారు. మరోవైపు శాస్త్రిపురంలోని మసీదు వద్ద నమాజ్‌కు ముందు అసదుద్దీన్ ఒవైసీ నల్ల రిబ్బన్లు పంపిణీ చేశారు. ఆయన తన చేతికి నల్లరిబ్బను ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింల ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో చార్మినార్, మక్కా మసీదు పరిసర ప్రాంతాల్లో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సీబీఐ పేరుతో బెదిరింపు.. మహిళ నుంచి రూ.30లక్షలు కొట్టేసిన సైబర్ కేటుగాళ్లు



కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సైబర్ నేరగాళ్లు ఘరానా మోసానికి పాల్పడ్డారు. ఓ విశ్రాంత ఉద్యోగినిని బెదిరించి ఆమె నుంచి భారీ మొత్తంలో డబ్బు కాజేశారు. బాధితురాలు రూ.30లక్షల నగదును బ్యాంకులో జమ చేయడాన్ని కేటుగాళ్లు గమనించారు. ఆ తర్వాత ఆమె వివరాలు తీసుకొని సీబీఐ అధికారులమంటూ ఫోన్ చేశారు. డబ్బు ఇవ్వకుంటే కుమారులను చంపేస్తామని వీడియోకాల్ చేసి బెదిరించారు. దీంతో భయపడిన ఆమె ఆన్‌లైన్ ద్వారా నగదును బదిలీ చేశారు. ఆ తర్వాత అది మోసమని గ్రహించిన బాధితురాలు.. కొత్తపేట పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి కాకాని చక్రపాణి - ఏప్రిల్ 26... కాకాని చక్రపాణి జయంతి



ఆధునిక తెలుగు కథా, నవలా సాహిత్యంలో తనదైన శైలిలో ప్రత్యేకతను సంతరించుకున్న రచయిత కాకాని చక్రపాణి. కథ, నవల, పరిశోధన, వ్యాసరచన అన్ని ప్రక్రియలలో అరుదైన, అసమాన ప్రావీణ్యం ఉన్న అతి తక్కువ మంది రచయితలలో కాకాని చక్రపాణి ఒకరు. ఆయన ఎన్నో నవలలు, వందలాది కథలు, విమర్శనా వ్యాసాలు రాశారు. కథలు, నవలలు, చరిత్ర గ్రంథాలు, ఇంగ్లీషు నుండి తెలుగులోకి, తెలుగు నుండి ఇంగ్లీషులోకి అలవోకగా అనువదించారు. మానవతే ప్రధాన ఇతివృత్తంగా... వ్యక్తుల మధ్య స్నేహం, దాంపత్య, కుటుంబ సభ్యుల మధ్య సంబం ధాలు, చక్రపాణి లాగా చిత్రించిన రచయితలు బహు అరుదు. హాస్యం, వ్యంగ్యం, వాస్తవికత, మానవతా వాదంతో కూడుకొని ఉంటాయి ఆయన సృజనాత్మకత రచనలు. ఆధునిక తెలుగు కథా, నవలా సాహిత్యంలో చక్రపాణి పాత్రలు నేల విడిచి సాము చేయక, ఎంతో సుపరిచితాలనిపిస్తాయి. కాకాని చక్రపాణి గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం చినకాకాని గ్రామంలో 1942, ఏప్రిల్ 26వ తేదీన శ్రీరాములు, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. మంగళ గిరి సి.కె.ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం ముగించి, ఉన్నత విద్యను గుంటూరులో కొనసాగించారు. హైదరాబాద్ లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో సుదీర్ఘ కాలం ఆంగ్ల భాషా బోధకుకులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తెలుగు నవలా సాహిత్యంపై 'సోమర్సెట్ మామ్ ప్రభావం' అన్న అంశంపై పరిశోధన చేసి పిహెచ్.డి పట్టా పొందారు. రాజశేఖర చరిత్ర, అల్ప జీవి, మైదానం, చివరికి మిగిలేది, అసమర్థుని జీవయాత్ర వంటి గొప్ప తెలుగు నవలల్ని కాకాని చక్రపాణి ఆంగ్లంలోకి అనువదించారు. భారతీయ కథాభారతి అనే గ్రంథంలో కాకాని చక్రపాణి అస్సామీ, ఉర్దూ, ఒడియా, కన్నడం, కశ్మీరీ, కొంకిణి, గుజరాతీ, డోగ్రీ, తమిళం, నేపాలీ, పంజాబీ, బెంగాలీ, భారతీయ ఆంగ్లం, మణిపురి, మరాఠీ, మలయాళం, మైథిలీ, రాజస్థానీ, సంస్కృతం, సింధీ, హిందీ భారతీయ భాషల్లోని ప్రముఖ కథకుల కథలకు తెలుగు అనువాదం చేశారు. పోలీసు పంచాయితీ, పిచ్చివాళ్ళు ఇదీ స్నేహమే, గుమ్మటం, శానటోరి యం, సంస్కరణ, ఓ హెన్రీ కానుకలు, ఆపద్బాంధవుడు, తాడుముక్క, నేరం చేసినవాడు, నౌకాయానం, అద్భుతం తదితర అనువాద రచనలు వివిధ పత్రికలలో ప్రచురింప జేశారు. వేగుచుక్క, ఏడడుగులు, గోరంత దీపం, నూరు శిశిరాలు ది ఘోస్ట్, నువ్వు నాకొద్దు, నిప్పు, జోధలో శీల పరీక్ష, మహానగరంలో మాఫియా, కాటేసిన అన్నృతం, అగ్నితీర్థం తదితర నవలలు రాశారు. థ్రిల్లింత, పతిత పావని, మనిషి, నివురు లాంటి కథా సంపుటాలు వెలువరించారు. రాజశేఖర చరిత్ర, చివరికి మిగిలేది, మైదానం, అల్పజీవి ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. ఆయన సిద్ధాంత గ్రంథం ... సాహిత్య ప్రభావం. సాహిత్య ప్రభావపు భిన్నకోణాలపై తెలుగులో వెలువడిన తొలి సిద్ధాంత గ్రంథం. "తెలుగు నవలా సాహిత్యంపై సోమర్‌సెట్ మామ్ ప్రభావం" అన్నఅంశంపై పరిశోధన చేసారు. ఆ పరిశోధనలో భాగంగానే మామ్ రాసిన "ఆఫ్ హ్యూమన్ బాండేజ్" నవలను అనువదించారు. కాకాణి చక్రపాణి, అత్యుత్తమ పరిశోధకులలో ఒకరు. మధ్య యుగ ఆంధ్ర దేశం, గాంధీ అనంతర భారత దేశం, కుతుబ్ షాహీలు వంటి గ్రంధాలకు సహ రచయితగా వ్యవహరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య చరిత్రను అద్భుతంగా చెప్పిన గ్రంథం 'గాంధీ అనంతర భారతదేశం'. కుతుబ్ షాహీల గ్రంథంలో 16, 17 శతాబ్దా లలో గోల్కొండ రాజధానిగా ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన కుతుబ్ షాహీ చక్రవర్తుల కాలపు రాజకీయ ఆర్థిక, సాంస్కృతిక వర్ణచిత్రాన్ని చక్రపాణి అద్భుతంగా చిత్రించారు. ఆంధ్రభూమి దినపత్రికలో చాలా సంవత్సారాలు "కథలు - కాకర కాయలు" అనే శీర్షిక నిర్వహిం చారు. క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ తమ 75వ యేట 2017, జనవరి 2వ తేదీన మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9449595494**

# తెలుగువారు గర్వించదగ్గ వాగ్గేయకారుడు శ్యామశాస్త్రి - ఏప్రిల్ 26...శ్యామశాస్త్రి జయంతి

సంగీత త్రిమూర్తులలో మూడవ వాడైన శ్యామశాస్త్రి (ఏప్రిల్ 26, 1763 - ఫిబ్రవరి 6, 1827) ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులు. దాక్షిణాత్య కర్ణాటక సంగీత రత్న త్రయంలో వయసురీత్యా పెద్దవారు శ్యామశాస్త్రి (క్రీ. శ. 1763 -1827). శ్యామ శాస్త్రి కన్నా త్యాగరాజు కొద్దిగా చిన్నవారు (క్రీ.శ.1767-1847). వీరు ఇరువురి కన్నా చిన్నవారు ముత్తుస్వామి దీక్షితులు (క్రీ. శ. 1776-1835). శ్యామశాస్త్రి తండ్రి విశ్వనాథ శాస్త్రి. ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని గిద్దలూరుకు సమీపంలోగల కంభం ప్రాంతీయులు. మహమ్మదీయుల దండయాత్రలకు బెదిరి వారి కుటుంబీకులు 17వ శతాబ్దంలో తమిళనాడుకు వలస వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. శ్యామశాస్త్రి అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యము. అయితే, చిన్నతనంలో ముద్దుపేరుగా శ్యామకృష్ణ గా పిలుస్తూ, ఆ పేరే చివరకు వ్యవహారికంలో సార్థకమైందని ఆయన శిష్యులు పేర్కొంటారు. పుత్రుడు కలుగునని" చెప్పినట్లే ఇతనితల్లి గర్భవతిఅయి క్రీ.శ1763లో చిత్రభాను సంవత్సరంలో మేష రవి కృత్తికా నక్షత్రమునందు శ్రీనగరమను తిరువారూరిలో శ్యామశాస్త్రిలు జన్మించినట్లు పేర్కొంటారు. తండ్రి విశ్వనాథ శాస్త్రి సంస్కృత, తెలుగు భాషలలో పండితుడు కావడంతో- శ్యామశాస్త్రి చిన్నతనంలో తండ్రి దగ్గరే సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించాడు. సంగీతంలో తన మేనమామ దగ్గర స్వరపరిచయం కల్గినా, ఆ పిదప తంజావూరులో 'సంగీత స్వామి' అనబడే ప్రముఖ తెలుగు సంగీత విద్వాంసుని దగ్గర, తంజావూరులోని రాజాస్థానంలో సంగీత విద్వాంసుడైన శ్రీ పచ్చిమిరియము ఆది అప్పయ్య సహకారంతో సంగీత శాస్త్రాలలో మర్మములు ఎన్నో అధ్యయనం చేశాడు. శ్యామశాస్త్రి రచించిన అనేక కీర్తనలు ఉల్లాసం కలిగించేవి, చక్కని లయ, తాళ ప్రదర్శనలకు అనుగుణంగా ఉండేవి. నాదోపాసన ద్వారా ఆత్మానందం సాధించ వచ్చని ఆయన అభిప్రాయ పడేవారు. శ్యామశాస్త్రి తెలుగు, తమిళ, సంస్కృత భాషలలో అనేక కృతులు, కీర్తనలు రచించినా అధికభాగం తెలుగులోనే వ్రాశారు. అయితే, త్యాగరాజు తన కీర్తనలలో భావ రాగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన 'తాళ' రచన చేసినట్లు సంగీతాభిమానులు అంటారు. శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన రచనతోపాటు, ఆయనకు శిష్యులు అధిక సంఖ్యలో లేకపోవడం వల్ల కూడా, ఈయన కీర్తనలు అధిక ప్రాచుర్యం పొందలేదని వారు భావిస్తారు. శ్యామశాస్త్రి రచించిన "ప్రోవవమ్మ" , "మాంజిరాగం" అలాగే 'కల్లడ '(కలగడ ), 'చింతామణి ' రాగాలు, "హిమాద్రిసుతీ " అనే కీర్తన, ఒకే స్వరంతో సంస్కృతం,తెలుగు భాషలలో వేరు వేరుగా రాసిన ఆయన కీర్తనలు సంగీత కళాకారు లందరికి సుపరిచతమే.. త్యాగరాజాదులచే కొనియాడ బడిన ఆయన లయజ్ఞానము శ్లాఘనీయమైనది. ఆనంద భైరవి రాగమన్న ఆయనకు చాల యిష్టమని చెప్తారు. ఆయన మదురైకు వెళ్లినపుడు మీనాక్షి దేవిని స్తుతించుచూ తొమ్మిది కృతులు ("నవరత్నమాలిక") గానం చేశాడు. శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన ఆనంద భైరవీ, ధన్యాసి, కల్గడ, కళ్యాణి, కాంభోజి, కాపి, చింతామణి వంటి రాగాల్లో కృతులు స్వర పరిచాడు. సంగీత పాఠాల్లో సరళీ స్వరాలు, జంట స్వరాలు, గీతాలు, స్వరజతులు, వర్ణాలు, కృతులు అనేవి ఒక పద్ధతిలో నేర్పుతారు. వీటిలో స్వరజతి రూపకర్త శ్యామశాస్త్రి. తోడి రాగంలో "రావే హిమగిరి కుమారి", భైరవి రాగంలో 'కామాక్షీ



అనుదినము'వంటివి కొన్ని ప్రసిద్ధి జెందిన స్వరజతులు. ఈ స్వరజతులే కాకుండా విలోమ చాపు తాళాన్ని కూడా శ్యామశాస్త్రి బహుళ ప్రాచుర్యం లోకి తెచ్చాడు. సాధారణంగా చాపు తాళం గతి 3 ం 4 పద్ధతిలో ఉంటుంది. ఇలా కాకుండా 4 ం 3 రీతిలో తాళ గతిని మార్చి కొన్ని కీర్తనలు స్వర పరిచాడు. పూర్వి కళ్యాణి రాగంలో 'నిన్ను వినగ మరి', ఫరజ్ రాగంలో 'త్రిలోకమాత నన్ను' అనేవి ఈ విలోమ చాపు తాళంలో ప్రసిద్ధి చెందిన కీర్తనలు. తంజావూరు జిల్లాలో తిరువాయూరులో ఉన్న కామాక్షి దేవాలయ అర్చకత్వం చేసుకుంటూ, తన గాన కళా పాండిత్యంలో కామాక్షి అమ్మవారి సేవలో, ఆమె సన్నిధానంలోనే ' శ్యామకృష్ణ' అనే ముద్రతో అనేక కీర్తనలు, కృతులు రచించాడయన. శ్యామశాస్త్రి ఇంటి ఇలవేల్పుగా కామాక్షిదేవిని కీర్తిస్తూ, తమ ఇంటి 'ఆడపడుచుగా' అమ్మవారిని భావిస్తూ %-% అపూర్వం, అనన్య సామాన్య కృతులెన్నింటినో శ్యామశాస్త్రి రచించాడని ఆయన శిష్యులు, సంగీత కళారాధకులు పేర్కొంటారు. అందువల్లనే, శ్యామశాస్త్రి తన కీర్తనలలో కొన్నింటిని "శ్యామకృష్ణ - సహోదరి" అని పేర్కొన్నట్లు వారు చెపుతారు. శ్యామశాస్త్రి కుమారుడు సుబ్బరాయశాస్త్రి కూడా ప్రముఖ వాగ్గేయకారిడిగా ప్రసిద్ధి చెందాడు. శ్రీ అలసూరు కృష్ణయ్య , శ్రీ తలగంబాడి పంచనాదయ్య తదితరులు శ్యామశాస్త్రి శిష్యులలో ప్రముఖులు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9449595494**

# అసమాన శిల్పి గణపతి స్థపతి - ఏప్రిల్ 26.... గణపతి స్థపతి జయంతి




ఆధునిక కాలంలో పలు దేవాలయాలు, అపురూప నిర్మాణాలు చూసినపుడు శిల్ప కళకు ప్రతిరూపం అయిన గణపతి స్థపతి వెంటనే స్ఫురణకు రాక మానరు. ఉలి చప్పుళ్ల మధ్య ప్రపంచంలో కళ్లు తెరిచి, ఉలి చప్పుళ్లకే జీవితాన్ని అంకితం చేసి, ఉలి చప్పుళ్ల మధ్యే కళ్లుమూసిన వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన, శిల్పీకరించిన గణపతి స్థపతి అసమాన శిల్పి. దేశం గర్వించదగ్గ శిల్పకళా నిపుణులు. హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై బుద్ధ విగ్రహం, హైదరాబాద్‌లో బిర్లా మందిర్, చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో మహానంది ఆలయ గోపురాలు, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయం, కంచి సమీప 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటపం, బద్రీనాథ్ దేవాలయ మహామండపం, తిరుమలలో వసంతరాయ మంటపం, ఇలా ఒక్కొక్క నిర్మాణంలో గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. గణపతి స్థపతి (26 ఏప్రిల్ 1931 - 7 ఏప్రిల్ 2017) ప్రముఖ స్థపతి, వాస్తు శిల్పి. పూర్తిపేరు సత్తయ్య ముత్తయ్య గణపతి. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో గణపతి స్థపతి పేరు తెర మీదకు వచ్చింది. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చేత బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించప బడి, సత్కరింప బడిన గొప్పతనం ఆయనది. తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్న ప్రతిభ ఆయనది. నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కోరిక మేరకు హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠింప చేసిన ఘనత ఆయనది. 1931, ఏప్రిల్ 26న ముత్తు స్థపతి, గౌరీ అమ్మాన్ లకు సంతానంగా జన్మించిన గణపతి, ఆరేళ్ల చిరుత ప్రాయంలోనే ఉలిని చేతబట్టి అలవోకగా చెక్కడం అభ్యాసం చేశారు. సాంప్రదాయ ఆలయ, వాస్తు, శిల్ప శాస్త్రాలను, కుటుంబ పెద్దల దగ్గర 17 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. శిల్పాలు చెక్కడం లోనూ, ఆలయాలను నిర్మించటం లోనూ కొత్త ఒరవడిని సృష్టించి, ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్న గణపతి తమిళనాడు వదిలి, తెలుగునాట కాలు మోపారు. శ్రీశైలం దేవస్థాన పునరుద్ధరణ, భద్రాచలం రామాలయ మహామండప గోపురాల నిర్మాణంతో పేరు తెచ్చుకొన్న గణపతి స్థపతి నైపుణ్యం గురించి, విన్న నాటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ, బద్రీనాథ్ దేవాలయ మహామండప పని అప్పగించారు. మండప భాగాలను హైదరాబాద్‌లో తీర్చిదిద్ది, బద్రీనాథ్‌కు తరలించి నిర్మించిన తీరుకు అచ్చెరువొందిన ఆమె, ఒక బంగారు గొలుసు, 60 తులాల డాలర్‌ను బహూకరించి సత్కరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పిలుపునందుకొని, తిరుమలలో వసంతరాయ మంటపాన్ని పునర్నిర్మించి, ఆస్థాన స్థపతి పదవిని దక్కించుకొన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా చేరిన గణపతి స్థపతి, ఉమ్మడి రాష్ట్రంలో వందల, వేల ఆలయాలను నిర్మించి, ప్రధాన స్థపతిగా ఎదిగారు. తరతరాల ప్రాచీన వాస్తుశిల్ప సంప్రదాయం, నిరంతరం కొనసాగాలన్న తపనతో, తన ఆధ్వర్యంలో దేవాదాయ శాఖలో ఒక శిల్ప కళాశాలను స్థాపించి, కొన్ని వందల మంది శిల్పుల్ని తయారుచేసి, కొరతను తీర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా, శిథిలాలయాలను పదిలం చేస్తూ, లేనిచోట కొత్త వాటిని కడుతూ తలమునకలై ఉన్న గణపతి స్థపతికి శ్రీశైలం జలాశయ నీటి ముంపు దేవాలయాల తరలింపు ఒక సవాలుగా మారింది. కర్నూలు, మహబూబ్ నగర్ జిల్లాల్లోని 102 గ్రామాల్లో ముంపునకు గురైన దాదాపు 108 దేవాలయాలను ఊడదీసి ఎగువన1978%-%89 మధ్య చారిత్రక కార్యక్రమం చేపట్టి, పునర్నిర్మించిన ఘనతను దక్కించుకొన్నారు. వాస్తు, శిల్ప విద్యను అందుబాటు లోకి తేవడానికి పూనుకుని, తమిళ, సంస్కృత భాషల్లోనున్న వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాలను తెలుగులోకి అనువదించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెదపాటి నాగేశ్వరరావు సహకారంతో రూపధ్యాన రత్నావళి, కాశ్యప శిల్ప శాస్త్రాలను వెలువరించారు. నిరంతర అధ్యయనంతో పాటు, పరిశోధనలపై దృష్టి సారించిన గణపతి స్థపతి, తెలుగు విశ్వవిద్యాలయం, సచివాలయం భవనాల్లో ఆధునికతకు, సాంప్రదాయ వాస్తును జోడించి, కొత్త ఒరవడిని సృష్టించారు. ఒకసారి అమెరికా వెళ్లిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు, న్యూయార్క్‌లో గణపతి స్థపతి తారస పడిన సందర్భంలో, లిబర్టీ స్టాట్యూ లాంటి పెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో నెలకొల్పే ప్రయత్నం చేయాలి అన్న ఎన్టీఆర్ కోరికను సాకారం చేసి, హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై 58 అడుగుల ఎత్తు, 350 టన్నుల బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆ విగ్రహం కోసం యాదగిరి గుట్టకు సమీపంలోని రాయగిరి నుంచి 100 అడుగుల రాయిని, 100 చక్రాల వాహనంపై హైదరాబాద్‌కు తరలించి, గణపతి స్థపతి ప్రపంచ ఖ్యాతిని సంపాదించారు. హైదరాబాద్‌లో బిర్లా మందిర్ రూప శిల్పి ఆయనే. సింహాచలం, కాళేశ్వరం, వేములవాడ లాంటి అనేక ప్రాంతాల్లో పలు ఆలయాలకు కొత్త సొగసులు అద్దారు. శ్రీశైలం, మహానంది ఆలయ గోపురాలను చోళ, విజయనగర శిల్పకళారీతుల కలయికతో నిర్మింప చేశారు. విదేశాల్లో సైతం ఆలయాలను నిర్మించి, తెలుగు శిల్పుల కీర్తిని దశదిశలా విస్తరింప చేయటలో భాగంగా, పిట్స్‌బర్గ్‌లోని బాలాజీ దేవాలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం అమెరికా తిరుపతిగా ప్రసిద్ధి చెంది, రోజూ వేల మంది భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. గణపతి స్థపతి శిల్పకళా చాతుర్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం, 1990లో అత్యున్నత పురస్కారమైన పద్మశ్రీ ద్వారా గౌరవించింది. ఆయన ప్రతిభకు గుర్తింపుగా, శిల్పకళానిధి, కళైమామణి, శిల్పకళా రత్న వంటి బిరుదులెన్నో వరించాయి. వందలాది దేవుళ్లకు వేలాది ఆలయాలను నిర్మించిన గణపతి స్థపతి కంచి కామకోటి పీఠ పరంపరలోని 68వ పీఠాపతులైన శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామికి పరమ భక్తులు. శంకరాచార్య ఆకాంక్ష మేరకు, కంచి సమీపంలో నున్న ఒరుక్కై గ్రామంలో తన అద్భుత శిల్పకల్పనా చాతుర్యంతో మలచిన 100 స్తంభాలతో నిర్మించిన మణి మంటప నిర్మాణం, తన చిరకాల వాంఛగా తరచూ పేర్కొనేవారు గణపతి స్థపతి. శంకరాచార్య ప్రమాచార్య శుభాశీస్సులతో అక్కడే శంకర శిల్పశాలను స్థాపించి, వాస్తు, శిల్ప, ఆగమ శాస్త్రాల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ గణపతి స్థపతి, ఏప్రిల్ 7న, ఈ పార్థివ దేహాన్ని వదిలి వెళ్లారు. ఆ మహాశిల్పి ఈ నేలను వదిలినా, ఆయన సృష్టించిన అపురూప, అపూర్వ శిల్పాలు, నిర్మించిన ఆలయాలు, ఆయన శిల్పకళా ప్రతిబింబాలై కళ్లముందు సజీవంగా కదలాడుతూనే ఉన్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9449595494**

# జుగులార్ నరం నొక్కిన భారత్... చీకట్లో పాక్ గొంతు ఎండుతుంది!


జుగులార్ నరం అనేది మెడలో ఓ ప్రధాన సిర. ఇది తల నుంచి రక్తాన్ని గుండె వైపు మళ్లిస్తుంది. దీన్ని గట్టిగా నొక్కితే తీవ్రమైన హాని కలిగిస్తుంది. ఇది పగిలిపోతే ప్రాణాలు కూడా పోయే అవకాశం ఉంది. అయితే.. పాకిస్థాన్ లోని పొలిటికల్ డాక్టర్లు ఉద్దేశ్యపూర్వకంగా ఈ తప్పు పదే పదే చేస్తున్నారు. దీంతో.. భారత్ ఆ నరాన్ని గట్టిగా నొక్కాల్సి వచ్చింది. అవును... పాకిస్థాన్ నాయకులు, అధికారులు తమ తమ ప్రసంగాల్లో కాశ్మీర్ ను పాకిస్థాన్ జుగులార్ నరంగా అభివర్ణిస్తుంటారు. ఇందులో భాగంగా ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ కశ్మీర్ పై స్పందిస్తూ... అది మా జుగులార్ సిర.. దాన్ని మేము మర్చిపోము.. మా కాశ్మీర్ సోదరులను వీరోచిత పోరాటంలో వదిలిపెట్టము అని వ్యాఖ్యానించారు. ఆ ప్రసంగం చేసిన కొద్ది రోజుల్లోనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగింది. సుమారు 5 - 6 మంది ఉగ్రవాదులు బైసరన్ లోయలో కాల్పులు జరిపారు. ఈ భీకర దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సమయంలో పాకిస్థాన్ తన జుగులార్ నరంగా పిలిచే కశ్మీర్, ఆ ప్రాంతం గుండా ప్రవహించే ఆ దేశానికి ప్రాణదాత నీరును నొక్కి పట్టింది. ఇందులో భాగంగా... సింధు జలాల ఒప్పందాన్ని భారత్ సస్పెండ్ చేసింది.



దీంతో.. ఆ దేశంలో సుమారు 23.7 కోట్ల మంది ప్రజలు తాగునీటి అవసరాలకు స్ట్రోక్ ఇచ్చినట్లయ్యింది. పాకిస్థాన్ లో ప్రధానంగా లాహోర్, కరాచీ, ముల్తాన్ నగరాలు నేరుగా ఈ నీటినే ప్రజలకు అందిస్తున్నాయి. ఇక పాకిస్థాన్లో సుమారు 16 లక్షల హెక్టార్లలో వ్యవసాయం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అందుకు వాడే నీటిలో సుమారు 80శాతం ఈ సింధూ జలాల ఒప్పందం నుంచే లభిస్తోంది. ఈ నదుల నుంచి వచ్చే నీరే... పంజాబ్ ప్రావిన్స్ కు జీవనాడి. మరోపక్క గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 68 శాతం ప్రజలు ఈ నదీ జలాలపైనే ఆధారపడి బ్రతుకుతున్న పరిస్థితి. విద్యుత్ విషయానికొస్తే... సింధూ నదిపై నిర్మించిన తర్బెల డ్యామ్.. పాక్ వినియోగంలో 16శాతానికి సమానమైన కరెంట్ ను తయారు చేస్తుంది. అదే విధంగా... జీలం నదిపై ఉన్న మంగల డ్యామ్ ఏటా ఆ దేశ విద్యుత్ ఉత్పత్తిలో 8 శాతం అందిస్తుంది. అంటే... భారత్ తాజా నిర్ణయంతో సుమారు 24% విద్యుత్ పై ప్రతికూల ప్రభావం పడనుందన్నమాట. ఇలా పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ యొక్క ఈ నరాన్ని నొక్కిన భారత్... 1960 నాటి సింధు జల ఒప్పందాన్ని నిలిపేసింది. భారతదేశం తీసుకున్న ఈ చర్య తర్వాత.. 40 డిగ్రీల ఉష్ణోగ్రతను ఎదుర్కోంటున్న పాకిస్థాన్ గొంతు ఎండగొట్టడం త్వరలో ప్రారంభించే అవకాశాలున్నాయనే కామెంట్లు వినిపిస్తున్నాయి.

# పహల్గాం దాడి... ట్రావెల్ బుక్కింగ్స్ ఏ స్థాయిలో క్యాన్సిల్ అంటే..?

జమ్ముకశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా టూరిజం ఎంతో అభివృద్ధి చెందుతూ, స్థానికులకు అద్భుతమైన ఆదాయాన్ని అందిస్తూ, జమ్మూకశ్మీర్ జీడీపీలో కీలక భూమిక పోషిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో తాజా ఉగ్రదాడి ఒక్కసారిగా లెక్కలు మార్చేసింది. అవును... కాశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి ఆ ప్రాంత టూరిజం ఆదాయంపైనా, స్థానికుల ఉపాధి అవకాశాలపైనా భారీ దెబ్బే కొట్టింది. ఈ సమయంలో వచ్చే నెలలో లోయను సందర్శించాలని ప్లాన్ చేసుకున్న అనేక



మంది పర్యాటకులు తమ షెడ్యూల్ ను రద్దు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జమ్మూకాశ్మీర్ కు వెళ్లాలని ప్లాన్ చేసుకున్న పర్యాటకులు భద్రతా సమస్యల కారణంగా సుమారు 90 శాతం బుకింగ్ లు రద్దు చేసుకున్నట్లు ట్రావెల్ ఏజెన్సీలు తెలిపాయి. ఇది జమ్మూకశ్మీర్ టూరిజంపై ఏ స్థాయిలో దెబ్బ తగిలిందో చెప్పకనే చెబుతుందని అంటున్నారు పరిశీలకులు. ఇదే సమయంలో ఇప్పటికే హొటల్ బుక్కింగ్స్ ను రద్దు చేసుకున్నారని చెబుతున్నారు. వాస్తవానికి ఉగ్రవాద దాడి అనంతరం జమ్మూకశ్మీర్ లో భద్రతపై ఆందోళనలు రేకెత్తుతున్నాయి. ఇది పర్యాటకంతో పాటు స్థానిక వ్యాపారాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది. ఈ క్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఫర్ టూర్ ఆపరేటర్స్.. జమ్మూకాశ్మీర్ కు షెడ్యూల్ చేసిన ట్రిప్ లలో 35% బుకింగ్ లు రద్దు చేయబడినట్లు తెలిపింది.

చురకలు

# సంపాదకీయం

## భయంతో నిలువెల్లా వణుకుతున్న పాక్

భారత్ ని చూసి పాక్ నిలువెల్లా వణుకుతోంది. బయటకు మాత్రం బడాయి కబుర్లు చెబుతోంది. నిజానికి భారత్ ముందు పాక్ ఎంత అన్నది ఆ దేశానికి బాగా తెలుసు. గతంలో ఉన్న పరిస్థితులు ఇపుడు లేవు. భారత్ ప్రపంచ దేశాలకు అత్యంత కీలకంగా ఉంది. ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. భారత్ తో ప్రపంచానికి ఎన్నో అవసరాలు ఉన్నాయి. అలాగే భారత్ కూడా ప్రపంచానికి కరోనా సమయంలో అండగా నిలబడింది. గుడ్డి విద్వేషం తో భారత్ మీద కక్షతో పాక్ ఒక్కతే అలా ఊగిపోతోంది. ఇకా ఎర్లీ ఐటీస్, నైంటీస్ నాటి సీమాంతర ఉగ్రవాదాన్ని రొటీన్ హింసను నమ్ముకుని పాక్ భారత్ మీద పగ సాధించాలని చూస్తోంది. కానీ భారత్ కి మొత్తంగా మద్దతుగా నిలిచిన అంతరజాతీయ సమాజం పాక్ ని ఒంటరిని చేసింది. పైగా పాక్ కుట్రలు కుతంత్రాలు తమకు బాగా తెలుసు అని చెబుతోంది. ఈ రోజున పాక్ తాను మిత్రురాలిగా నమ్ముతున్న చైనా అయితే ఎలాంటి స్పందన పాక్ కి అనుకూలంగా ఇవ్వడం లేదు. మరో వైపు చూస్తే ఇతర దేశాలు అన్నీ భారత్ వైపే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ ఏమి చేసినా అంతర్జాతీయ సమాజం ఓకే అంటుంది. ఎందుకంటే బాధిత దేశంగా భారత్ ఉంది భారత్ పాక్ ని ఊచకోత కోసినా ఇదేమని అడిగేవారు లేరు. అయ్యో అని సానుభూతి చూపించేవారు ఉండరు. అందుకే పాక్ వెన్ను లో పూర్తిగా వణుకు పుడుతోంది. మేకపోతు గాంభీర్యంతో బయటకు ఉంటోంది. కరాచీ నుంచి లాహోర్ కి రావల్పిండికి యుద్ధ విమానాలు తరలింపు అయినా తన క్షిపణులను పరీక్షిస్తామని చెప్పడం అయినా భారత్ ని ఏదో విధంగా వెనక్కి తగ్గేలా చేయడం కోసమే అంటున్నారు. నిజంగా భారత్ మూడవ కన్ను తెరిస్తే పాక్ భస్మీపటలం అవడం ఖాయం. ఈ నేపథ్యంలో పాక్ కి ఆయుధ సాయం కాదు కదా మాట సాయం చేయడానికి కూడా ఏ దేశమూ రాదని పాక్ కి బాగా అర్థం అవుతోంది. పాక్ కళ్ళ ముందు గతంలో జరిగిన సర్జికల్ స్ట్రైక్స్ గుర్తుకు వచ్చి చిగురుటాకులా భయకంపితం అవుతోంది. ఈ నేపథ్యంలో పాక్ మాజీ మంత్రి చౌదరి ఫవాద్ హుస్సేన్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా ఉన్నాయి. భారత్ బెదిరించినా లేక దాడి చేసినా రాజకీయ విభేదాలు పక్కన పెట్టి దేశం కోసం ఒక్కటి అవుతామని ప్రకటించారు. అంతే కాదు మాతృ భూమిని కాపాడుకోవడానికి పా జెండా కింద అంతా ఐక్యంగా ఉంటామని స్పష్టం చేశారు. ఇదంతా ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేసిన దాని సారాంశం. అదే సమయంలో ఆయన నరేంద్ర మోడీ ప్రభుత్వం నుంచి సంయమనం ఆశిస్తున్నట్లుగా పేర్కొన్నారు. మోడీ మంత్రివర్గం తన మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణాయలను ఆయన ప్రస్తావిస్తూ యుద్ధానికి దారి తీసే చర్యలు వద్దని కోరారు యుద్ధానికి ఆజ్యం పోసేలా మీడియా కథనాలకు లొంగి లక్షలాది మంది ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆశిస్తున్నట్లు ఆయన పోస్ట్ చేసిన మరో ట్వీట్ లో పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తే పాక్ కి తెలుసు. భారత్ కచ్చితంగా దాడి చేస్తుందని, దానిని తాము ఏ విధంగానూ తట్టుకోలేమని కూడా తెలుసు అని అంటున్నారు. అయితే భారత్ ఢీ కొడితే మాత్రం తాము పూర్తిగా ఇబ్బందులో పడతామని తెలిసినా పాక్ ఉగ్ర దాడులకు తెగబడుతోంది. అయితే భారత్ మాత్రం తగ్గేది లేదని అంటోంది. దాంతో పాక్ కి మూడిందనే అంతా అంటున్నారు.

# ప్రపంచ పశు వైద్య దినోత్సవం: ఆరోగ్య రక్షణలో పశు వైద్యుల అవినాభావ పాత్ర - ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా




ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో పశు వైద్యుల పాత్రను గుర్తించేందుకు ప్రతి ఏటా ఏప్రిల్ నెల చివరి శనివారం ప్రపంచ పశు వైద్య దినోత్సవం జరుపు కుంటారు. పశువుల ఆరోగ్య సంరక్షణతో పాటు, మానవ ఆరోగ్యానికి, ఆహార భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు వారిచ్చే కృషిని గౌరవించడమే ఈ దినోత్సవ లక్ష్యం. 2000వ సంవత్సరం నుండి విశ్వ పశు వైద్య సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహింప బడుతోంది. పశు వైద్యుల సేవలు కేవలం జంతువులకు చికిత్స చేయడానికే పరిమితం కావు. వారు సమాజానికి బహు ముఖాల నుంచి సహాయ పడుతున్నారు. రేబీస్, బర్డ్ ఫ్లూ, కొవిడ్–19 వంటి వైరస్‌లు పశువుల నుంచే మానవుల్లోకి వ్యాపించాయి. వీటిని గుర్తించి నియంత్రించడంలో పశు వైద్యుల కృషి అపారమైనది. పాడి పరిశ్రమ, మాంస పరిశ్రమల విజయవంతం పశువుల ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. వ్యాధులు వ్యాపిస్తే రైతులకు భారీ నష్టం కలుగుతుంది. అడవులలో నివసించే జంతువులకు వైద్య సేవలు అందించడంతో పాటు, జీవవైవిధ్యం పరిరక్షణలో పశు వైద్యుల పాత్ర కీలకం. పర్యావరణ మార్పుల నేపథ్యంలో పశు ఆరోగ్యం ప్రభావితమవుతోంది. దీనిని గమనించి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడంలో వారు ముందున్నారు. పశువైద్య రంగంలో కృషిచేసిన ప్రముఖులలో... అంతర్జాతీయంగా: డాక్టర్ జేమ్స్ హెరియట్ లేదా అల్ఫ్రెడ్ విట్ . ఆయన రచించిన పుస్తకాల ద్వారా పశు వైద్యుల జీవితం ప్రపంచానికి పరిచయం అయ్యింది – “All Creatures Great and Small” వంటి రచనలు ఎంతో ప్రజాదరణ పొందాయి. డాక్టర్ బెర్నార్డ్ వాల్ష్ ... OIE (World Organisation for Animal Health) డైరెక్టర్ జనరల్‌గా పదకొండేళ్లు పనిచేసి, ప్రపంచ వ్యాప్తంగా జంతు ఆరోగ్య విధానాలను బలోపేతం చేశారు. డాక్టర్ రోబర్ట్ అన్‌డ్రేహామ్మర్ ... పశు సంక్షేమానికి నూతన ప్రమాణాలు ఏర్పరిచిన వారిలో ప్రముఖుడు. యూరోపియన్ యూనియన్ పశు సంరక్షణ విధానాలకు ఆయన ప్రేరణ. భారతదేశంకు సంబంధించి డాక్టర్ బలరాం ముల్లా – తెలంగాణ: వైజాగ్ పశువైద్య కళాశాలలో విద్యనభ్యసించి, పశు వైద్య విద్యా రంగంలో అధ్యాపకుడిగా పని చేసిన ముల్లా గారు తెలంగాణ పశు సంరక్షణ శాఖలో అనేక బాధ్యతలు నిర్వర్తించారు. మొబైల్ వెటర్నరీ సర్వీసులకు, గ్రామీణ సేవలకు మార్గదర్శకులుగా నిలిచారు. డాక్టర్ టి.ఎస్. బ్రహ్మానందం – ఆంధ్రప్రదేశ్: పశుసంరక్షణ శాఖలో డైరెక్టర్‌గా పనిచేసి, రాష్ట్రవ్యాప్తంగా వందలాది పశువైద్య కేంద్రాలను స్థాపించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి గణనీయంగా కృషి చేశారు. డాక్టర్ ఓం ప్రకాశ్ లల్వానీ – పంజాబ్: పశువైద్య విద్యను ప్రాచుర్యం కల్పించడంలో, డైరీ పరిశ్రమతో అనుసంధానంలో కీలక పాత్ర పోషించారు. ఆయన అభివృద్ధి చేసిన టీకాలు, పాల పరిశ్రమకు మేలు చేశాయి. భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. ఇక్కడ రైతుల జీవనోపాధిలో పశుసంపద ముఖ్య పాత్ర పోషిస్తోంది. ప్రతి కుటుంబానికి కనీసం ఒకటి లేదా రెండు పశువులు ఉండడం సామాన్యమే. ఈ నేపథ్యంలో పశు వైద్యుల అవసరం మరింత తీవ్రంగా ఉంటుంది. దేశవ్యాప్తంగా ICAR ఆధ్వర్యంలో పశు వైద్య విద్యా సంస్థలు పని చేస్తున్నాయి. కామారెడ్డి, పంజాబ్, కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు పశు వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. మొబైల్ వెటర్నరీ యూనిట్లు, టెలీమెడిసిన్ సౌకర్యాలు, గ్రామీణ పశు వైద్య కేంద్రాల వృద్ధి వంటి చర్యలు చోటు చేసుకుంటున్నాయి. పశు వైద్యుల కృషికి అడ్డంకులు లేకపోలేదు: గ్రామీణ ప్రాంతాల్లో నిపుణుల కొరత, తగిన వేతనాలు, భద్రతలు లేకపోవడం, అత్యాధునిక ఔషధాల ప్రాప్యత లోపించడం, అవగాహన లోపం వల్ల సేవల వినియోగం తక్కువగా ఉండటం తదితరాలు. పశు వైద్యులు కేవలం వైద్యులే కాదు %–% వారు పరిశోధకులు కూడా. కొత్త వైరస్‌లపై అధ్యయనం చేయడం, టీకాలు అభివృద్ధి చేయడం, వ్యాధుల వ్యాప్తిని అంచనా వేయడం వంటి పలు రంగాల్లో వారు పాల్గొంటున్నారు. ఈ కృషి వలన జంతువులే కాకుండా మానవుల ఆరోగ్యానికి కూడా ప్రయోజనం కలుగుతోంది. పశు వైద్యులు మానవతా భావంతో పని చేస్తారు. జంతువుల సంక్షేమం కోసం వారు: శస్త్రచికిత్సలు, టీకాల కార్యక్రమాలు, పోషకాహారం గురించి అవగాహన, హింస నివారణ చర్యలు చేపడుతున్నారు. వారి సేవల వల్ల పశువుల జీవిత కాలం పెరుగుతుంది, బాధ తగ్గుతుంది, ఉత్పాదకత మెరుగ వుతుంది. ఒక పశువు చివరి దశలో ఉన్నప్పుడు, ఒక రైతు తల్లడిల్లు తున్నప్పుడు, పక్కన నిలిచే చేతులు పశు వైద్యుడివే. ఆ కృషిని ఎంత అభినందించినా తక్కువే. ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా మనం పశు వైద్యుల సేవలను గుర్తించి, వారికి కృతజ్ఞతలు తెలియ జేయాలి. వారికి కావలసిన వనరులు, గౌరవం, ప్రోత్సాహం కల్పిస్తే %–% అది జంతువులకు మాత్రమే కాదు, సమాజానికి కూడా నూతన ఊపిరిని అందించడమే అవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# విలక్షణ వ్యక్తిత్వం... ఎం ఎస్ ఆర్ కే సొంతం. - ఏప్రిల్ 26.. ఎం.సత్యనారాయణ రావు వర్ధంతి



విచిత్ర మనస్తత్వం....నిక్కచ్చిగా వ్యవహరించే నైజం. కుండలు బద్దలు కొట్టినట్లు మాట్లాడే ముక్కుసూటి తనం, నిండైన అమాయకత్వం, మచ్చలేని రాజకీయ జీవితం... వెరసి ఎం.సత్యనారాయణ రావు వ్యక్తిత్వం. మాచినేని సత్యనారాయణ రావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. ఎం ఎస్ ఆర్ అంటే తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెదిర గ్రామంలో ఎంఎస్ఆర్ జనవరి 14, 1934న జన్మించారు. విద్యార్థి దశ నుండే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై స్పందించే వారు. హైదరాబాద్ లో వి.వి. కళాశాలలో చదువు తున్నపుడు తన గొంతు వినిపించే వారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమంలో ఆయన చెన్నారెడ్డి లాంటి నాయకులతో కలిసి చురుకుగా పాల్గొన్నారు. 1971లో తెలంగాణ ప్రజా సమితి ఎంపీగా ఎంఎస్ఆర్ గెలుపొందారు. అనంతరం మరో రెండు పర్యాయాలు కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు. 14 ఏళ్ల పాటు ఎంపీగా కొనసాగారు. 1980 నుండి 1983 వరకు ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన పార్టీ వ్యవహారాల్లో ఇందిరా గాంధీతో సన్నిహితంగా ఉన్నారు. 1990–94 వరకు ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2000 నుంచి 2004 వరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంఎస్ఆర్ పనిచేశారు. 2004–07 వరకు దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి మంత్రివర్గంలో దేవాదాయ, క్రీడ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేశారు. 2007 తర్వాత ఆర్టీసీ చైర్మన్‌గా ఎం.సత్యనారాయణ రావు తిరిగి సేవలందించారు. 77–79 లోక సభ సభ్యుడుగా, హౌస్ కమిటీ బాధ్యునిగా ఆస్ట్రేలియా మరియు ఇతర దేశాలకు పార్లమెంటరీ ప్రతినిధి సభ్యునిగా వెళ్లారు. ఇందిరాగాంధీతో పాటు నెహ్రూ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఆయనకు పేరుంది. చాలా సందర్భాల్లో ఆయన హైకమాండ్‌కి ఎదురు తిరిగేవారు కూడా. ఆయన ఎప్పుడు ఎలా స్పందిస్తారో అని హైకమాండ్ ఒక్కోసారి ఆందోళన చెందేది. తన పర భేదం లేకుండా వ్యాఖ్యానాలు చేసేవారు. అవి అప్పుడప్పుడు సంచలనాలుగా మారేవి. రాజకీయాలు వేడెక్కేవి. అలా ముఖ్యమంత్రిగా వైఎస్ ఉన్న సమయంలో సహచర మంత్రిగా 2006 లో, టిఆర్ఎస్ చీఫ్ కెసిఆర్ ను సవాలు విసిరి కరీంనగర్ లోక్ సభ ఉప ఎన్నికకు కారణమై, కేసిఆర్ గెలుపుకు బాధ్యులుగా, రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడిగా ఎంఎస్ఆర్ విసిరిన సవాలుకు ప్రతిస్పందనగా కెసిఆర్ 2006 లో తెలంగాణకు ఎంపి పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ వాదిగా, ఎంపీగా, మంత్రిగా ఎమ్మెస్సార్ ప్రత్యేక శైలి కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు రాజీనామాలు చేసిన నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగిన ఆయన అందరికీ పరిచయమే. ముఖ్యంగా ఢిల్లీ పెద్దలతో ఆయన బాగా సత్సంబంధాలు కొనసాగించేవారు. చాలా వ్యవహారాల్లో ఢిల్లీ పెద్దలు ఆయన అభిప్రాయాల్ని లెక్కలోకి తీసుకునేవారు. నాగర్జున సాగర్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సమయంలో రావు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కలిశారు. తెలంగాణ రాజకీయాలపై చర్చించారు. తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌తో విలీనం చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. జహర్‌లాల్ నెహ్రూతో నిజామా బాద్‌ను సందర్శించినప్పుడు ఆయన తన భావాలను వ్యక్తం చేసినట్లు చెప్పేవారు. రాజశేఖర రెడ్డి మరణం తర్వాత... ఉమ్మడి రాష్ట్రం... ఆంధ్రప్రదేశ్, తెలంగాణగా విభజించిన తర్వాత... ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరం అయ్యారు. ఇందిరా గాంధీ తో సన్నిహితంగా మెలిగిన ఆయన... రాజకీయాలు బహు దూరంగా పైలెట్ గా ఉన్న రాజీవ్ గాంధీని, ఇందిర కోరిక మేరకు తానే రాజీవ్ ను మెప్పించి ఒప్పించి రాజకీయాల్లోకి తెచ్చానని చెపుతుండే వారు. పలు రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ఉన్న సమయంలో ఒక సందర్భంలో ఉత్తర ప్రదేశ్ వెళ్ళినపుడు, నాటి యు. పి. కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ దయాళ్ శర్మ, తనకోసం గంటల కొద్దీ వేచి ఉండి, స్వాగతం పలికి, దండ వేసిన అపూర్వ సంఘటనను గుర్తు చేసుకునే వారు. రాష్ట్ర రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న ఎం.ఎస్. ఆర్. కు కరోనా సోకి, తీవ్రత అధికం కావడంతో, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించింబడి, చికిత్స పొందుతూ, 2021 ఏప్రిల్ 26న తుదిశ్వాస విడిచారు. తెలంగాణ వాదిగా, ఎంపీగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, ఆర్టీసీ చైర్మన్ గా ఎమ్మెస్సార్ ప్రత్యేక శైలి కనబరిచి, రాజకీయాల్లో ముక్కుసూటి మనిషిగా పేరొందిన ఎం ఎస్ ఆర్ మృతితో తెలంగాణ ఒక నిబద్ధత కలిగిన రాజకీయ నాయకున్ని కోల్పోయింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9449595494**

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు రామానుజుడు - ఏప్రిల్ 26... శ్రీనివాస రామానుజన్ వర్ధంతి



ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ‘గణిత’ మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం. అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఆయనకు పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు. 1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నపుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుము కోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. (1729 R 1^3 + 12^3 R 9^3 + 10^3 ). ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం.. 15ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్‌సిడ్జ్‌కార్ రాసిన ‘సినాప్సిస్’. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. చిత్తు కాగితాలను కూడా బహు జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వ విద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877–1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్ధులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9449595494**

# తవ్వేస్తున్నా.. నవ్వేస్తున్నారు..

కామారెడ్డి : జిల్లాలో బోరుబావుల తవ్వకాలు ఇష్టానుసారంగా కొనసాగుతున్నాయి. వాల్టా నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. లెక్కకు మించి బోరుబావులు తవ్వకోవడంతో ఆ ప్రభావం భూగర్భజలాలపై పడుతోంది. నిత్యం గృహవసరాలకు, వ్యవసాయానికి బోరుబావులను ఇష్టం వచ్చినట్లు తవ్వకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా నిత్యం సుమారు 50కి పైగా బోరుబావులు తవ్వుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. భూగర్భజలాలను విపరీతంగా వాడుకోవడంతో జిల్లా వ్యాప్తంగా నీటి మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. గడిచిన మూడు నెలల్లో 4.34 మీటర్లు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

**అనుమతులేవి..?**

బోరుబావి తవ్వాలనుకుంటే వాల్టా ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాలి. గృహవసరాలకైనా, సాగుకైనా ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు జారీ చేస్తారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బోరుబావి తవ్వుకోవడానికి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఒక బోరుబావికి మరొక బావికి మధ్య దూరం పాటిస్తే అందరికి మంచిది. ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వకూడదని చట్టం చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. పది మీటర్ల దూరంలోనే బోర్లు వేస్తున్నారు. ఇక గృహాల మధ్య అయితే చెప్పక్కర్లేదు.



ఎవరికి ఇష్టం వచ్చిన విధంగా వారు బోర్లు తవ్విస్తున్నారు. గృహాలు నిర్మించినప్పుడు ఇంకుడుగుంతలు నిర్మించాలంటే మాత్రం ఆసక్తి చూపడం లేదు.

**పొదుపే బాట** ప్రతి ఒక్కరు నీటి పొదుపు చర్యలు తప్పకుండా పాటించాలి. రైతులు వరి సాగు కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటిని భూమిలోకి పంపించడానికి కందకాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టాలి. వర్షకాలంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను అందజేయాలి. ఆరుతడి పంటల సాగుకు ముందుకు రావాలి. వ్యవసాయక్షేత్రాల వద్ద నీటి కుంటల నిర్మాణాలు చేపట్టాలి. ఉపాధిహామీ పథకం ద్వారా ఫాంపాండ్ నిర్మించుకోవడానికి అవకాశం ఉంది. ప్రతీ రైతు పొలంలో ఒక ఫాంఫాండ్ ఉంటే వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండదు. గ్రామాల్లో ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. బోరుబావులు తవ్వుకోవడానికి ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకోవాలని జిల్లా భూగర్భజలశాఖ అధికారి సతీష్‌యాదవ్ తెలిపారు.

# పుస్తకం.. విజ్ఞాన నేస్తం

సిద్దిపేట : పుస్తకం.. విజ్ఞాన నేత్రం. వెలకట్టలేని జ్ఞాన భాండాగారం. వ్యక్తిని.. సమున్నత స్థాయిలో నిలబెట్టే ఆయుధం. పదుగురిలో ప్రత్యేకత చాటేలా ప్రోత్సాహన్ని అందిస్తుంది. అజ్ఞానాన్ని పటాపంచలు చేసి, విజ్ఞాన జ్యోతి వెలిగేలా చేస్తుంది. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో విశేషాలు ఉన్నాయి. ఇలాంటి పుస్తకం ద్వారా అందే మాధుర్యానికి నేటి తరం దూరం అవుతోంది. దీని పఠనంతో కలిగే లాభాలను వారికి వివరించి ఆ దిశగా అడుగేయించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా కథనం.

**పారదర్శకత..**

'పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంద'న్నారు మహాత్మా గాంధీ సూచించారు. ఈ విషయాన్ని గ్రహించాల్సిన అవసరం ఎంతో ఉంది. మంచి ఆలోచనా సరళి, దూరదృష్టి కలిగి ఉండటంతో ఎంతో అవసరం. అన్నింటిలో పారదర్శకత పాటించాలి.

**వంద మంది మిత్రులతో..** ఒక మంచి పుస్తకం.. వందమంది మిత్రులతో సమానం. ఒక మంచి స్నేహితుడు గ్రంథాలయంతో సమానం.. అని డా. ఏపీజే అబ్దుల్ కలాం పేర్కొన్నారు. ఈ విషయాన్ని నేటితరం గ్రహించాలి. చరవాణి మోజులో పడి పుస్తకాన్ని విస్మరిస్తున్నాం. పరోక్షంగా మంచీచెడులు బోధిస్తుంది. సాధారణ మనుషులను మహనీయులుగా మార్చిన.. విజ్ఞాన వీచికల ప్రాధాన్యాన్ని నేటి యువత గుర్తించాలి.

**జ్ఞాన నేత్రం..** పుస్తక పఠనంతో ఎంతో మంది జ్ఞానాన్ని సముపార్జించారు. నిండైన వ్యక్తిత్వం పెంచుకునేందుకు, జీవితాన్ని మార్చుకునేందుకు ఉపయోగపడుతుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికీ సగానికి పైగా జనాభా నిరక్షరాస్యులుగా ఉండటం శోచనీయం. యువత విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే క్రతువు చేపట్టాలి. అది కేవలం పుస్తక పరిచయంతోనే సాధ్యం.

నారాయణఖేడ్ మండలం పీర్ల తండాకు చెందిన ఐఆర్ఎస్ అధికారి సుధాకర్‌నాయక్ నేతృత్వంలోని సర్వోదయ ఫౌండేషన్ పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 110 ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటుచేసింది. సిర్గాపూర్‌లో గ్రామస్తులందరి కోసం లైబ్రరీని నెలకొల్పారు. అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నారు. రానున్న విద్యాసంవత్సరంలో మరిన్ని చోట్ల ఏర్పాటు చేయనున్నారు.

**6వేలకు పైగా భద్రపరిచి..**

తూప్రాన్‌కు చెందిన మనోవిజ్ఞాన శాస్త్ర అధ్యాపకుడు కె.శ్రీనివాస్‌చారి.. తన ఇంటినే గ్రంథాలయంగా మార్చుకోవడం విశేషం. ఐదో తరగతి చదువుతున్న సమయంలో పుస్తకాల సేకరణ అలవాటు కాగా.. ఇప్పటికీ దాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు 6000కు పైగా పుస్తకాలను రెండు గదుల్లో భద్రపరిచారు. తన మిత్రులు సైతం ఇక్కడికి వచ్చి చదువుకుంటుంటారు. ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లినప్పుడు పుస్తకాలు కొనుగోలు చేసి తీసుకొస్తారు. పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు, నిరుద్యోగులకు ఉపయోగపడే 2800కు పైగా వీడియోలు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

**అవగాహన కల్పిస్తూ..** మెదక్‌కు చెందిన బుర్ర సంతోష్ వృత్తిపరంగా, ప్రవృత్తి పరంగా పుస్తకాలకు దగ్గరగా ఉంటుండటం విశేషం. పిల్లలకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించి చదువుకునేలా తన ఇంట్లో లైబ్రరీని ఏర్పాటుచేశారు. మహనీయుల జీవిత చరిత్ర, నైపుణ్య సాధనకు దోహదపడేవి అందుబాటులో ఉంచారు. మరోవైపు తనకిష్టమైన మెదక్ జిల్లా చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రాంతాలపై పరిశోధన చేస్తున్నారు.

# నట్టేట ముంచుతున్న నకిలీ



పరిగి : వానాకాలం సాగుకోసం రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు నకిలీ విత్తనాలు విపణిలోకి వస్తున్నాయి. వీటిని కట్టడి చేసేందుకు అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నా.. కొందరు అక్రమార్కులకు అది రెండు చేతులా సంపాదనగా మారింది. దీంతో మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అన్నదాతల అమాయకత్వం, నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుంటూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. గత సీజన్ ప్రారంభంలో అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృత దాడులు నిర్వహించారు. నకిలీ విత్తనాలు పట్టుకొని, కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈసారి కూడా పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తు తనిఖీలు చేపడుతుండగా.. అక్కడక్కడ పట్టుబడుతుండటం రైతలన్నలను కలవరపెడుతోంది. తక్కువ ధరకు తీసుకొచ్చి నాణ్యమైనవని చెబుతూ రైతులను మోసం చేస్తున్నారు. మొలకెత్తక పోవడంతో బోరున విలపిసున్నారు. ఈ నేపథ్యంలో కథనం.

**కర్ణాటక, పాలమూరు జిల్లా నుంచి**

తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో ఈ ఏడాది 5.95లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా. అందులో ప్రధానంగా పత్తి 2.5లక్షలు, కంది 2.25లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అధికారులు యోచిస్తున్నారు. తెల్లబంగారానికి అనూహ్య రీతిలో ధరలు పెరగడంతో రైతులు సైతం సాగుకు ఆసక్తి చూపనున్నారు. దీంతో అక్రమార్కులు ఈ రెండు రకాల విత్తనాలపైనే కన్నేశారు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా మహబూబ్‌నగర్ జిల్లా, కర్ణాటక నుంచి తెచ్చి పల్లెల్లో విక్రయాలు జరిగాయి. మరికొందరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా తీసుకొచ్చి విక్రయాలు చేశారు. నమ్మకమైన వ్యక్తులను ఏజెంట్లుగా నియమించుకొని ప్రచారానికి పాల్పడుతున్నారు. ధర తక్కువని తీసుకొని రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నారు.

మండలాలు: 20

రైతులు: 2,95,797వానాకాలం సాధారణ సాగు: 5,78,874 ఎకరాలు ప్రధాన పంటలు: పత్తి, కంది, వరి, మొక్కజొన్న, పెసర, మినుము, **పల్లెల్లో ప్రత్యేక నిఘా – మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.** విత్తనాల కొరత రాకుండా పక్కా ప్రణాళికను తయారు చేస్తున్నాం. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని విత్తనాలు అందుబాటులో ఉండేలా చూస్తాం. గ్రామాల్లో ఏఈఓలు, రైతుల సహకారంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి కల్తీ విత్తనాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తాం. జిల్లా, మండల స్థాయిలో తరచూ ఆకస్మిక తనిఖీలు చేపడతాం. రైతులు ధ్రువీకరించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు భద్రపర్చుకోవాలి.

# ఎల్ఆర్ఎస్ సిబ్బందికి జీతాల్లేవ్



హైదరాబాద్: క్షేత్రస్థాయిలో పరిశీలించి...అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం నివేదికలు ఇచ్చే సిబ్బందికి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా వీరు జీతాలకు నోచుకోవడం లేదు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన...పరిష్కారం కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) దాదాపు 55 మంది జూనియర్ ప్లానింగ్ పర్సన్స్ (జేపీపీ)లను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో విధుల్లోకి తీసుకొంది. మూడు నెలలుగా హెచ్ఎండీఏ కోసం సేవలందిస్తున్నారు. జేపీపీల్లో చాలామంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లతోపాటు పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారు. నగరంలో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఇంతలో హెచ్ఎండీఏ జేపీపీ ఉద్యోగ కోసం నోటిఫికేషన్ రావడంతో.. కుటుంబ సభ్యులపై ఆధారపకుండా వచ్చిన జీతంతో గడిచిపోతుందనే ఉద్దేశంతో చాలామంది విధుల్లో చేరారు. తీరా ఇక్కడ జీతం లేకపోవడంతో లబోదిబోమంటున్నారు.

**వీరిదే ముఖ్య భూమిక..**

హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల్లో 2.62 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులున్నాయి. వీటిలో 2.04 లక్షలకు ఫీజు నోటీసులిచ్చారు. మరో 58,500 మంది దరఖాస్తుదారులు ఇప్పటికే ఫీజులు చెల్లించారు. 2,150మందికి మాత్రమే ఇప్పటివరకు ప్రొసిడింగ్ జారీ చేశారు. వాస్తవానికి మార్చి 31తో ఎల్ఆర్ఎస్ గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వం ఏప్రిల్ 30వరకు పొడిగించింది. తాజాగా పెంచిన గడువు సైతం 7రోజుల్లో ముగియనుంది. ఫీజు చెల్లించిన వారందరికీ ప్రొసీడింగ్స్ జారీ చేయాలంటే ఆయా లేఅవుట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ ప్రక్రియలో జేపీపీలదే కీలకపాత్ర. ఎల్1 క్లియరెన్సు కింద తొలుత రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంబంధిత లేఅవుట్‌ను పరిశీలించి నీటివనరులు, ఇతర వివాదాలు లేవని ధ్రువీకరించాక..జేపీపీ మరోసారి వాటిని పరిశీలించి...ఎల్2 అనుమతుల కోసం నివేదిక పంపిస్తారు.

**ఉద్యోగినుల అవస్థలు..**


జేపీపీలో కొంతమంది మహిళా ఉద్యోగులున్నారు. చాలావరకు అక్రమ లేఅవుట్లు నగర శివార్లలో ఉన్నాయి. అక్కడ వరకు వెళ్లి పరిశీలించి నివేదిక అందించాల్సి ఉంటుంది. సొంత వాహనాల్లో వెళ్తున్నారు. వాహనాలు లేని వారు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి అక్కడ నుంచి ఆటోలు లేదంటే కాలినడక చేరుకుంటున్నారు. కొన్నిసార్లు దరఖాస్తుదారులే లేఅవుట్ల వద్దకు తీసుకెళ్తున్నారు. ఇలా క్షేత్రస్థాయిలో పరిశీలనకు మహిళా ఉద్యోగులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు లేఅవుట్ వద్దకు వెళ్లినా సరే... ఆ సమయంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రాకపోతే వెనుతిరగాల్సి వస్తోంది. దీంతో ప్రొసీడింగ్స్ జారీపై ఆ ప్రభావం పడుతోంది.

# పుట్టగొడుగుల్లా అనుమతిలేని వెంచర్లు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో లేఅవుట్ లేని ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ భూములను వెంచర్లు, ప్లాట్లుగా చేసి, విక్రయించాలంటే తొలుత వ్యవసాయేతర భూములుగా మార్చాలి. నిబంధనల మేరకు లేఅవుట్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటే డీటీసీపీవోకు పంపిస్తారు. అక్కడి నుంచి సాంకేతిక మంజూరు తర్వాత గ్రామపంచాయతీ, మున్సిపల్ అనుమతులు తీసుకోవాలి. రోడ్లు, భూగర్భ మురుగుకాల్వలు, తాగునీటి పైపులైన్లు, నీటి ట్యాంకులు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. ఏర్పాటు చేసే ప్లాట్లలో రోడ్లు, మురుగుకాల్వలకు సంబంధించిన 33 శాతంతోపాటు మొత్తం విస్తీర్ణంలోని 10 శాతం స్థలాన్ని గ్రామపంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి. గ్రామపంచాయతీ వారు డీటీసీపీవోకు పంపిస్తే అక్కడి నుంచి చివరి ఆమోదం లభిస్తుంది. లే అవుట్ చేసిన ప్లాట్లకు పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు ఒక బ్లాక్ కేటాయించి, ఆ కాలనీకి ఓ పేరు పెడతారు. స్థల విస్తీర్ణాన్ని నిర్ధారిస్తూ పంచాయతీ కార్యదర్శులు ధ్రువీకరణ పత్రం జారీ చేస్తే అప్పుడు అది చట్టపరమైన లేఅవుట్ కింద పరిగణిస్తారు. ఇలా పూర్తిస్థాయి అనుమతులతో జిల్లాలో తంగళ్లపల్లిలో ఒక్క వెంచర్ మాత్రమే ఉండడం కొసమెరుపు.

**45 ఎకరాల విస్తీర్ణంలో..**

ఎల్లారెడ్డిపేట మండలంలో 26 గ్రామపంచాయతీలుండగా పట్టణాలకు దీటుగా భూ క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో అనుమతి లేని వెంచర్లు పుట్టగొడుగుల్లా ఏర్పాటవుతున్నాయి. అనేక చోట్ల నిబంధనలకు తిలోదకాలిస్తుండటంతో ప్రభుత్వ ఖజానాతోపాటు గ్రామపంచాయతీల ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మండలకేంద్రంతోపాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, దుమాల గ్రామాల్లో వివిధ సర్వేనంబర్లలోని 45 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సుమారు 1146 లేఅవుట్ లేని ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని చోట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) కోసం భూముల యజమానులు దరఖాస్తు చేసుకుంటున్నారు. గతంలోని లే అవుట్ లేని స్థలాలను ఇప్పుడు అధికారులు అనుమతించడం లేదు. రిజిస్ట్రేషన్లు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. హద్దురాళ్లను తొలగిస్తుండడంతో కొనుగోలు దారులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పొడవాటి హద్దురాళ్లున్న ఈ ప్రాంతం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోనిది.



వెంకటాపూర్ నుంచి రగుడు మీదుగా సిరిసిల్ల వరకు డివైడర్‌తో కూడిన రెండు వరుసల బైపాస్ రహదారి సౌకర్యంతో ఆ రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ వ్యాపారులు రంగంలోకి దిగి లేఅవుట్ లేకుండానే ప్లాట్లుగా మార్చి, విక్రయించడం ప్రారంభించారు. దీనిపై అధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. పలు సర్వే నంబర్లలోని ప్లాట్లు అనధికారికమని గుర్తించారు. హద్దురాళ్లను తొలగించి, లే అవుట్ లేని ఈ ప్లాట్లను ఎవరూ కొనవద్దంటూ అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు.

**పలుచోట్ల గుర్తించాం**

జోగం రాజు, ఎంపీవో, ఎల్లారెడ్డిపేట

అనుమతి లేని లేఅవుట్‌లను గుర్తించాం. వాటి వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపించాం. దీనిపై ఓ కమిటీ వేసి, వాటికి రిజిస్ట్రేషన్ కాకుండా జిల్లా కలెక్టర్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. వారు ఇళ్ల నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే జీవో నంబరు 131, 135 ప్రకారం క్రమబద్ధీకరించి, అనుమతి జారీ చేస్తారు.

# ప్లాస్టిక్ నిషేధంపై చర్యలేవి?

కాగజ్‌నగర్ : ఏ చిన్న కార్యమైనా.. ప్లాస్టిక్ పేపర్, గ్లాసులు, ప్లేట్లు, కప్పులు, ఐక్రీం స్టిక్‌లు, స్ట్రాలు, ట్రేలు, తదితర వాటి వినియోగం విచ్చలవిడిగా పెరుగుతోంది. ఆయా వ్యర్థాలు రోడ్డుపై, అటు నుంచి మురుగు కాలువల్లోకి చేరి పేరుకుపోతున్నాయి. అధికారుల పట్టింపులేనితనంతో విక్రేతల్లో భయం లేకుండా పోయి బాహాటంగానే అమ్మకాలు సాగిస్తున్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయదారులకు రూ.1000 నుంచి రూ.25000 వరకు జరిమానా విధించే ఆస్కారం ఉన్నా.. అధికారులు అటువైపు చూడటం లేదు.

పండ్లు కొనేందుకు వెళ్లినా, కూరగాయలు కొనుగోలు చేసినా, బయట ఏ దుకాణానికి వెళ్లినా.. ఇబ్బడిముబ్బడిగా ప్లాస్టిక్ సంచులే దర్శనమిస్తున్నాయి. ఒకసారి వాడి పారేసే ఉత్పత్తుల వినియోగంపై కాగజ్‌నగర్ పురపాలికలో నియంత్రణ లేకుండా పోతోంది. ఈ ఏడాది ప్రారంభమై నాలుగు నెలలైనా కనీసం నామమాత్ర తనిఖీలు సైతం చేపట్టలేని దుస్థితి. ఫలితంగా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతూ పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్నాయి. మరోవైపు ఇష్టానుసారంగా రోడ్లపై పడేస్తుండటంతో.. మూగజీవాలు వాటిని తింటూ అనారోగ్యం, మృత్యువాత పడుతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు కొనసాగుతున్నాయి. కనీసం ఈ సందర్భంగానైనా అధికారులు మేల్కోవాలి. ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాల కట్టడికి యత్నిస్తూనే, వాటి అనర్థాలపై ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి.

కాగజ్‌నగర్ బల్దియాలో నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయం, వాడకం యథేచ్ఛగా జరుగుతోంది. ఒకసారి వాడి పడేసే వాటిని రెండున్నరేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. అయితే ఈ నిబంధనలు ఇక్కడ అమలు కావడం లేదు. కొందరు స్థానిక డీలర్లు ప్లాస్టిక్ ఉత్పత్తులను హైదరాబాద్‌తోపాటు జిల్లాకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర నుంచి అక్రమ మార్గంలో టన్నుల కొద్దీ దిగుమతి చేసుకుంటున్నారు. వ్యాపారులకు గుట్టుగా విక్రయిస్తున్నారు. ఫలితంగా రోడ్ల పక్కన చిరు వ్యాపారుల నుంచి కిరాణా దుకాణాల వరకు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగమే కనిపిస్తోంది. అవన్నీ 120 మైక్రాన్లలోపు మందం ఉన్న నిషేధిత ఉత్పత్తులే.

**మార్పు మనలోనూ రావాల్సిందే..**

ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లోనూ స్పష్టమైన మార్పు రావాల్సి ఉంది. కేవలం అధికారులు తనిఖీలు చేస్తేనో, అవగాహన సదస్సులు నిర్వహిస్తే నో.. వాటి ఉత్పత్తుల విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. కొన్ని రోజుల తర్వాత తిరిగి వాటిని యథేచ్ఛగా వినియోగిస్తుంటారు. అలా కాకుండా అందరూ ఒక ఉద్యమంలా పాటిస్తేనే ప్లాస్టిక్ నిషేధం అమలవుతుంది.

**జరిమానాలు విధిస్తాం**

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకంపై చర్యలు తీసుకుంటాం. నిబంధనల్ని అతిక్రమించే వారికి జరిమానాలు విధిస్తాం. ప్రజలు, వేడుకల నిర్వాహకులు పేపరు, జనపనార సంచులు, తదితర ప్లాస్టిక్ రహిత వాటిని వినియోగించాలి. ప్రజా భాగస్వామ్యంతో ప్లాస్టిక్ రహిత పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు యత్నిస్తాం.

సోమిడి అంజయ్య, పుర కమిషనర్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ బల్దియా స్వరూపం

వార్డులు : 30

జనాభా 66,293

రోజు సేకరిస్తున్న చెత్త : 27 మె.ట.

ప్లాస్టిక్ వ్యర్థాలు దాదాపు : 10 మె.ట.

# పందెంలో చిక్కి.. ఆర్థికంగా చితికి

సిర్పూరు : (టి) మండలంలోని టోంకిని గ్రామానికి చెందిన జయేందర్ ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా పోలీసులు యువకుడి మృతిపై విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. విద్యుత్తు తీగలకు తగిలి మృతిచెందిన కుమారుడిని తండ్రి పెన్‌గంగ నదిలో పడేసి అదృశ్యమైనట్లు నమ్మించాడు. అదేవిధంగా మృతుడి చరవాణిని పరిశీలించిన పోలీసులు పలు బెట్టింగ్ యాప్‌లను గుర్తించారు. తెలంగాణకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్రలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు సిర్పూరు నియోజకవర్గంలోని కొందరు యువకులను బెట్టింగ్ ముగ్గులోకి దించుతున్నట్లుగా సమాచారం. సదరు వ్యక్తి గ్రామాల్లోని కొందరిని ఈ దందాలోకి దింపి వాట్సాప్‌లలో లింకులను పంపిస్తున్నాడు. ఈ వ్యవహారంలో ఇక్కడి బెట్టింగ్‌కు పాల్పడి తీవ్ర నష్టాల పాలవుతున్నట్లు సమాచారం.

పోలీసులు ఎన్ని నియంత్రణ చర్యలు చేపడుతున్నా.. బెట్టింగ్ భూతం చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో.. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడికక్కడ పందేలు సాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, సిర్పూరు, బెజ్జూరు, పెంచికల్‌పేట, చింతలమానెపల్లి, తదితర మండలాలకు చెందిన యువత బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పుల పాలవుతున్నారు. అత్యాశకు పోయి కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

**వారికి కాసులు.. వీరికి చీకట్లు!**

వాస్తవానికి క్రికెట్ బెట్టింగ్ కూడా ఒక జూదమే. ఈ ఐపీఎల్ పందెం క్రికెటర్లకు, బీసీసీఐకి, బెట్టింగులు నిర్వహిస్తున్న యాప్‌ల నిర్వాహకులకు కాసులు కురిపిస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా.. వీటిపై బెట్టింగుల కారణంగా కొన్ని కుటుంబాల్లో చీకట్లు మిగులుతున్నాయి. ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి నిండా మునిగిపోతున్నారు. ఇంట్లోని బంగారం, భూములను సైతం కుదువ పెట్టి తీవ్రంగా నష్టపోతున్నారు. కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

**దారి మార్చిన జూదరులు..**

గతంలో టీ దుకాణాలు, దాబాలలో బెట్టింగ్ శిబిరాలు సాగేవి. ప్రస్తుతం పోలీసుల నిఘా పెరగడంతో జూదరులు రూటు మార్చారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ద్వారా ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ యాప్‌లపై తెలంగాణ రాష్ట్రంలో నిషేధం ఉండడంతో.. చరవాణిలో ఫేక్ జీపీఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాలకు లొకేషన్ మార్చి యాప్‌లు ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ దందా ఇప్పుడు జిల్లాలోని మారుమూల పల్లెలకు పాకడం కలవరపెడుతోంది. సెల్‌ఫోన్‌లలో యూపీఐ ఐడీలతో తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలు సైతం అనుసంధానం చేసి వారిని సైతం సమస్యల్లోకి నెడుతున్నారు.

**తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి**

పిల్లలు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులే జాగ్రత్తపడాలి. వారి ప్రవర్తనపై కన్నేసి ఉంచాలి. విచ్చలవిడిగా వారికి డబ్బులు అందకుండా చూడాలి. వారి వ్యవహారశైలిలో మార్పు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ఇప్పటికే క్రికెట్ బెట్టింగ్‌పై నిఘా పటిష్ఠం చేశాం. గతంలో పలువురిపై కేసులు కూడా నమోదు చేశాం. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం.

మధుకర్, ఎస్సై, కౌటాల

చురకలు



# పెరుగుతున్న పచ్చ 'బంగారం' ధరలు

మెట్‌పల్లి: పసుపు ధరలు రోజురోజుకి పెరుగుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్లో మంగళవారం పసుపు(కాడిరకం) క్వింటాకు రూ.16,001 ధర పలికింది. జిల్లా రైతులే కాకుండా నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని వివిధ గ్రామాల రైతులు మెట్‌పల్లి మార్కెట్‌కు పసుపు అమ్మకానికి తీసుకువస్తున్నారు. ఈ ఏడాది జనవరి 31న పసుపు కొనుగోళ్లు ప్రారంభించగా మొదట్లో సుమారు రూ.13 వేలకుపైనే ధర వచ్చింది. గతేడాది కంటే ఈసంవత్సరం ధరలు పెరుగుతుండడంతో పసుపు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మెట్‌పల్లి మార్కెట్లో క్వింటా కాడి రకానికి రూ.16,001, గోళ రూ.13,511, చూర రూ.11,144



ధర పలికింది. కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 48,826 క్వింటాళ్లు సేకరించినట్లు తెలిపారు.

**రూ.16 వేలు పలికింది..**

పసుపు క్వింటాకు రూ.16,001 ధర రావడంతో సంతోషంగా ఉంది. మా మామయ్య గడ్డం చిన్నయ్యకు సంబంధించిన పసుపును అమ్మకానికి తెస్తే సుమారు రెండున్నర క్వింటాళ్ల పసుపునకు రూ.16,001 ధర పలికింది. ధరలు ఇలా ఉంటే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి.

కంతి ప్రమోద్, ఇబ్రహీంపట్నం

**నాణ్యమైన ఉత్పత్తులు తేవాలి**

నాణ్యమైన పసుపునకు మంచి ధరలు వస్తాయి. నేను తెచ్చిన సుమారు మూడున్నర క్వింటాళ్ల పసుపుకు క్వింటాకు రూ.15,255 ధర పలికింది. అవుల రాంరెడ్డి, రైతు

# ఉన్నత విద్యకు ప్రోత్సాహకం పెంపు

గోదావరిఖని: ఎంసెట్, నీట్, బిట్‌శాట్, జేఈఈ వంటి అర్హత పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు అందించే నగదు ప్రోత్సాహకాన్ని యాజమాన్యం పెంచింది. ర్యాంకులను సైతం పెంచటంతో ఎక్కువ మంది పిల్లలు అర్హత పొందే అవకాశం ఉంది. ఉన్నత విద్యలో ఉద్యోగుల పిల్లలను ప్రోత్సహించేందుకు ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి సింగరేణి ఏటా నగదు ప్రోత్సాహకం అందిస్తోంది. కోర్సు పూర్తయ్యే వరకు ఈ ప్రోత్సాహకం ఇస్తుంది. **రూ.16 వేలకు..**

సింగరేణి సంస్థ ఉద్యోగుల పిల్లలను ఉన్న చదువుల్లో ప్రోత్సహించేందుకు 1998లో ఈ మెరిట్ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ సమయంలో ఎంసెట్‌లో రూ.2వేల లోపు ర్యాంకు సాధించిన వారికి రూ.6 వేల ప్రోత్సాహకాన్ని అందించేది. మరింత పెంచాలని వచ్చిన



విజ్ఞప్తుల మేరకు 2010లో రూ.10 వేలకు సవరించారు. దీన్ని కూడా పెంచాలని గుర్తింపు సంఘం నిర్మాణాత్మక సమావేశంలో యాజమాన్యంతో చర్చించి తాజాగా రూ.16 వేలు చేశారు.

**జూన్ 15 లోపు దరఖాస్తు గడువు**

యాజమాన్యం అందించే నగదు ప్రోత్సాహకానికి ర్యాంకును కూడా సవరించారు. ప్రస్తుతం ఎంసెట్‌లో 2000లోపు ర్యాంకు వారికే నగదు ప్రోత్సాహకం అందించగా.. దానిని 8000కు పెంచారు. అదే విధంగా జేఈఈ, ఎయిమ్స్, బిట్‌శాట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన ఉద్యోగుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారు. ఈ నగదు ప్రోత్సాహకం పెంపును 2024-25 విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్నట్లు.. జూన్ 15 లోపు దరఖాస్తులు చేసుకోవాలని డైరెక్టర్(పా) సూచించారు.

# నిధుల గ్రహణం.. నిలిచిన నిర్మాణం

ఉట్నూరు : ఆదిమ గిరిజనులు (పీవీటీజీ)ల ఆత్మగౌరవానికి గుర్తింపుగా ప్రధాన మంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్‌మన్)పథకంలో మంజూరు చేసిన బహుళార్థ భవనాల నిర్మాణానికి నిధులగ్రహణం పట్టుకుంది. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా పెద్దసంఖ్యలో పనులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలలో తీవ్రజాప్యం చేస్తోంది. ఈ పథకంలో చేపట్టిన పనుల్లో కొన్నిచోట్ల మాత్రమే పనులు పూర్తికాగా మరికొన్నిచోట్ల అసంపూర్తిగా, కొన్నిచోట్ల పనులే ప్రారంభానికి నోచుకోలేదు.సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ఉట్నూరు పరిధిలోకి వచ్చే ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలో నివసిస్తున్న కోలాం ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో పీఎం జన్‌మన్ పథకంలో మూడు జిల్లాలను కలిపి 47 బహుళార్థ భవనాలను మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణం అంచనా వ్యయం రూ.60 లక్షలు కాగా మొత్తం రూ.28.20 కోట్ల నిధులను కేటాయించింది. నిధుల విడుదలలో కేంద్రం తీవ్రజాప్యం చేస్తోంది. ఇప్పటి వరకు కేవలం రూ.2.49 కోట్ల నిధులను మాత్రమే విడుదల చేసింది. చేసిన పనులకు బిల్లులు అందక గుత్తేదారులు పనులు చేయడంపై సుముఖత వ్యక్తం చేయడం లేదు. మొత్తం 47 భవనాలలో ఇప్పటికీ పూర్తైనవి కేవలం 5 మాత్రమే.

**ఇదీ పరిస్థితి..**కుమురం భీం జిల్లాలోని లింగాపూర్, రాగాపూర్‌లో మంజూరు చేసిన బహుళార్థ భవనాల నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరం చెప్పడంతో పనులు పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం శాంతిగూడలో నిర్మించాల్సిన భవనానికి కోలాంల ఇళ్ల స్థలాల సమస్య కారణంగా ప్రారంభం కాలేదు.

నార్నూరు మండలం సుంగాపూర్‌లో చేపట్టిన నిర్మాణం పునాది దశలో దర్శనమిస్తోంది.మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండలం కోలాంగూడలో నిర్మాణం స్లాబ్ దశలో ఉండగా.. హాజీపూర్ మండలం ర్యాలీలో చేపట్టిన భవనం రూఫ్‌దశలో ఉంది.

ఉపయోగాలివే..ఆదివాసీ కోలాంలు తమ సంఘానికి సంబంధించిన సమావేశాలు ఇందులో నిర్వహించుకోవాలి. వారి సంస్కృతి, సంప్రదాయ ఉత్సవాలు, పండగలు ఈ భవనాలలో జరుపుకొంటారు. అంగన్‌వాడీ కేంద్రం ఈ భవనంలోనే నిర్వహిస్తూ మాతా, శిశువుల సంరక్షణకు ఉపయోగపడేలా అవసరమైన పౌష్టికాహారం ఇందులో భద్రపర్చి లబ్ధిదారులకు అందజేస్తారు.ఈ భవనాలలోనే పూర్వ ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తారు. వీటిలోనే ఒక ఏఎన్ఎం గదిని ఏర్పాటుచేసి ప్రాథమిక చికిత్స అందేలా చర్యలు తీసుకుంటారు.

# యాప్‌రే.. రక్షణ భళారే



హైదరాబాద్: రాజధానిలో ప్రభుత్వ భూముల రక్షణకు హైడ్రా నడుం బిగించింది. రూ.వేలకోట్ల విలువైన స్థలాలను కాపాడటమే లక్ష్యంగా ముందుకెళ్తోంది. బుల్డోజర్లు, పొక్లెయినర్లతో విరుచుకుపడుతోంది. మొన్నటి వరకు చెరువులు, నాలాల ఆక్రమణలకే పరిమితమైన హైడ్రా ఇప్పుడు స్థిరాస్తి ఆక్రమణలపైకి దూకుతోంది.

శేరిలింగంపల్లి హఫీజ్‌పేటలో సర్వే నంబరు 78లో ప్రభుత్వ మిగులు భూమి 39 ఎకరాల వరకు ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమి అని అధికారులు అంటున్నారు. దీని విలువ ఎకరం రూ.50 కోట్ల చొప్పున రూ.1950 కోట్ల వరకు ఉంటుంది. ఈ భూములను ఏపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సంస్థ వసంత హోమ్స్ కొనుగోలు చేసింది. దీనిలో దాదాపు సగం విస్తీర్ణంలో వెంచర్లు వేసి విల్లాలు, అపార్టుమెంట్లు కట్టి విక్రయించింది. ప్రస్తుతం సుమారు 20 ఎకరాలు ఉంది. దీన్ని నివేశన స్థలాలుగా మార్చి విక్రయిస్తోంది. ఇంకా నిర్మాణాలు జరగలేదు. కానీ సంస్థ కార్యాలయం, ఇతర నిర్మాణాలను ఇటీవల హైడ్రా కూల్చివేసి సంచలనం సృష్టించింది. ఈ భూములను 79/1గా పేర్కొంటూ నిషేధిత జాబితాలో లేవని తప్పుడు సమాచారం ఇస్తున్నారని హైడ్రా అధికారులు పేర్కొంటున్నారు. నిషేధిత జాబితాలోనూ న్యాయ వివాదంలో ఉన్నాయని కమిషనర్ వెల్లడించారు.

షేక్‌పేట మండలం రాయదుర్గం సమీపంలో సర్వే నంబరు 5/2లో 39 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గుర్తించింది. ప్రముఖ నిర్మాణ సంస్థ నార్నే ఎస్టేట్స్ అందులో వెంచర్లు వేసినట్లు గుర్తించింది. ఇక్కడ ఎకరా రూ.వంద కోట్లకు పైగా ఉంది. దీనిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నడుస్తుండగానే విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించింది. ఆ స్థలంలో 'ప్రభుత్వ భూమి' అంటూ హైడ్రా బోర్డు ఏర్పాటు చేసింది.

గాజులరామారం పరిధిలో గతంలో క్వారీల కోసం 78 ఎకరాలు లీజుకు ఇచ్చారు. గడువు ముగిసినా ఆ భూములను వదిలిపెట్టకుండా ఆక్రమించే ప్రయత్నం సాగింది. దీనిపై ఫిర్యాదులు రావడంతో వెంటనే చర్యలు తీసుకుని అక్కడి నుంచి క్వారీ యజమానులు వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశారు.

నారపల్లి గ్రామ పరిధిలో నల్ల మల్లారెడ్డి స్థిరాస్తి వ్యాపారం చేసి స్థలాలు విక్రయించారు. ఆ ప్రాంతంలోని కాలనీలకు దారి లేకుండా ప్రహరీ నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో కమిషనర్ దాన్ని కూల్చివేయించారు. ఆక్రమణలను తొలగించారు.

అల్వాల్ మండలం మచ్చబొల్లారంలో రాంకీ సంస్థ 15.19 ఎకరాల హిందూ శ్మశాన వాటికను ఆక్రమించి చెత్త డంపింగ్ చేస్తుండగా.. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా అడ్డుకుంది. ఐదారెకరాల్లో నిర్మాణాలు చేస్తున్న విషయాన్ని గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించింది.

**ఆక్రమణకు గురికాకుండా..**

ఓఆర్‌ఆర్ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా యాప్ తీసుకొచ్చేందుకు హైడ్రా ఎన్‌ఆర్‌ఎస్‌సీతో ఒప్పందం కుదుర్చుకుంది. సర్వే ఆఫ్ ఇండియా వివరాలు, రెవెన్యూ రికార్డులు, చెరువుల సమాచారం, ఉపగ్రహ చిత్రాలన్నీ ఈ యాప్‌లో ప్రజలకు అందుబాటుతో ఉండేలా రూపొందిస్తున్నట్లు కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. నగరంలో ఆరు చెరువుల్లో కబ్జాలను తొలగించి రూ.59 కోట్లు వెచ్చించి రక్షణ చర్యలు చేపట్టింది. దాదాపు 50 చెరువులను పరిశీలించి ఆక్రమణల తొలగించేందుకు చర్యలు చేపట్టింది.

# మేడ్చల్ మెరిసింది.. రంగారెడ్డి మురిసింది



హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు విజయకేతనం ఎగురవేశాయి. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విడుదల చేసిన ఫలితాల్లో శివారు జిల్లాలు సత్తా చాటాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలు నిలిచాయి. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ జిల్లా మూడోస్థానం దక్కించుకోగా.. నాలుగో స్థానంలో రంగారెడ్డి జిల్లా నిలిచింది. హైదరాబాద్ జిల్లా ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో తొలి పదిస్థానాల్లో చోటు దక్కించుకోలేదు. గతనెల మార్చి తొలివారంలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో మూడు జిల్లాల నుంచి 4,42,735 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 3,25,712 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 73.41శాతం, సెకండియర్‌లో 73.79శాతం మంది విద్యార్థులు పాసయ్యారని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

**మేడ్చల్ ఒకటి, మూడు..**

ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ జిల్లా 77.21శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే అగ్రస్థానం దక్కించుకుంది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లోనూ రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత పెంచేందుకు ఇంటర్‌బోర్డు అధికారులు, అధ్యాపకులు కృషి చేయడం, జిల్లా కలెక్టర్ గౌతమ్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. చర్యలు చేపట్టడంతో ఉత్తీర్ణత శాతం పెరిగింది. కార్పొరేట్ కళాశాలల క్యాంపస్‌లు మేడ్చల్ జిల్లాలో ఎక్కువగా ఉండడం ఇందుకు దోహదపడింది. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే చర్యలు చేపట్టినందుకు ఫలితం దక్కిందని మేడ్చల్ జిల్లా ఇంటర్‌బోర్డు అధికారి కిషన్ వివరించారు. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రెండోస్థానంలో నిలవడం సంతృప్తికరంగా ఉందని, వచ్చే ఏడాది అగ్రస్థానం సాధించేందుకు కృషి చేస్తామని రంగారెడ్డి ఇంటర్‌బోర్డు అధికారి వెంక్యా నాయక్ వివరించారు.

**బాలికలదే హవా..**

ఇంటర్ ఫలితాల్లో బాలురతో పోలిస్తే.. బాలికలు అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణులయ్యారు. మేడ్చల్ జిల్లాలో ప్రథమ సంవత్సరంలో బాలికలు 82.40శాతం ఉత్తీర్ణులు కాగా.. బాలురు 73.54శాతం మంది పాసయ్యారు.

రంగారెడ్డి జిల్లాలో 81.92 శాతం బాలికలు, 72.24 శాతం బాలురు ఉత్తీర్ణులయ్యారు. హైదరాబాద్‌లో 74.65 శాతం బాలికలు, 60.47శాతం బాలురు పాసయ్యారు.

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మేడ్చల్ జిల్లాలో 82.21శాతం బాలికలు, 74.56 శాతం మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు.

రంగారెడ్డి జిల్లాలో 82శాతం బాలికలు, 73.70శాతం బాలురు, హైదరాబాద్‌లో 74.81శాతం బాలికలు, బాలురు 59.50శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

గ్రేటర్ మూడు జిల్లాల్లో ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు: 4,42,735

ఉత్తీర్ణులైన వారు: 3,25,712

మొదటి సంవత్సరం ఉత్తీర్ణత శాతం 73.41

ద్వితీయ సంవత్సరం: 73.79

# నిధులు కొరవడి.. పనులు తడబడి

కామారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు కల్పించేందుకు గత ప్రభుత్వం మన ఊరు-మన బడి పథకం ప్రవేశపెట్టి పనులు చేపట్టింది. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తికాగా.. మరికొన్నింటిలో నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట పాఠశాలల్లో చేపట్టిన పనులకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ప్రభుత్వం నిధుల కేటాయించి వేసవి సెలవుల్లోనే పెండింగ్ పనులు పూర్తిచేస్తే వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.


**క్షేత్రస్థాయి పరిస్థితి**

జిల్లాలోని 352 పాఠశాలల్లో మన ఊరు-మన బడి కింద రూ.175 కోట్లతో అదనపు తరగతి గదులు, ఇతర మరమ్మతు పనులు ప్రారంభించారు. నిర్దేశిత నిధుల్లోంచి కేవలం రూ.27 కోట్ల నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మిగతావి కాకపోవడంతో 62 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో పాఠశాల గదులకు తాళాలు వేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా రూ.22.80 కోట్లతో 973 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. నిధుల కొరత, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇప్పటివరకు 240 బడుల్లో మాత్రమే పనులు పూర్తిచేశారు. రూ.9.66 కోట్లు విడుదల చేస్తేనే మిగిలిన 733 పాఠశాలల్లో ప్రతిపాదించిన పనులు పూర్తవుతాయి. ఇవి కాకుండా మరో 148 బడుల్లో అత్యవసరంగా మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ.16 కోట్ల నిధులు అవసరం ఉన్నట్లు గుర్తించారు.

**యంత్రాంగం తీరిలా..**

ఎమ్మెల్యేలకు కేటాయించిన ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి అమ్మ ఆదర్శ కమిటీలకు



ఒక్కో ఎమ్మెల్యే రూ.2 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విద్యాశాఖ జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలకు లేఖలు రాసింది. స్పందించిన బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.1.66 కోట్లు కేటాయించారు. ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు తమకు కేటాయించిన నిధులను ఇతర పనులకు కేటాయించామని వెల్లడించారు. కామారెడ్డి ఎమ్మెల్యే తనకు ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. దీంతో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పలు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు, తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.రాజుతో పేర్కొన్నారు.

# ఆస్తి పన్ను.. ఇంటి నుంచే కట్టొచ్చు

నిజామాబాద్ : నగరపాలక సంస్థ, పురపాలికల్లో ఆసి పన్ను వసూళ్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు పురపాలిక శాఖ ప్రత్యేక వాట్సప్ నంబరును ప్రకటించింది. దీని ద్వారా ఇంటి నుంచే క్షణాల్లో బకాయిలు చెల్లించే వీలుంది. ప్రస్తుతం సిబ్బంది ఇంటింటికీ తిరుతూ పన్ను వసూలు చేస్తున్నారు. లేదంటే యజమానులు మున్సిపల్ కార్యాలయాలకు వెళాల్సి వస్తోంది. ఒకవేళ సకాలంలో చెల్లించకుంటే అపరాధ రుసుం కట్టాలి. ఈ తరుణంలో ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. దీనిపై క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేక ఎవరూ ఉపయోగించడం లేదు.

**ఏం చేయాలంటే?**9000253342 నంబరును వాట్సప్‌నకు అనుసంధానం చేసుకోవాలి. ఈ నంబరుకు హాయ్ అని సందేశం



పంపగానే వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. తర్వాత భాష ఎంపిక చేసుకోగానే మరో సందేశం వస్తుంది. అనంతరం పన్ను వివరాలు తెలుసుకునేందుకు రెండు ఆప్షన్లు ఉంటాయి. ఆస్తి పన్ను సంఖ్య(పీటీఐఎన్)/ ఇంటి నంబరు ఇందులో ఏదో ఒకటి ఎంటర్ చేసి సందేశం పంపితే రాష్ట్రంలోని 141 పుర, నరపాలక సంస్థలు, విలీన గ్రామాల వివరాలు ప్రత్యక్షమవుతాయి.

1-141 అంకెల్లో మీరుండే పట్టణం ఏ సంఖ్య ఉందో అది ఎంటర్ చేయాలి. ఇది పూర్తికాగానే పట్టణం, నగరం పేరు సూచిస్తూ మరో సందేశం వస్తుంది. ఇంటి నంబరు నమోదు చేస్తే పన్ను వివరాలు వస్తాయి.అక్కడ చూపించే పేమెంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే నెట్ బ్యాకింగ్, క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు, మిగతా ఆన్‌లైన్ సర్వీసులు వస్తాయి. ఇందులో ఏదైనా ఒక ఆప్షన్ ఎంపిక చేసుకొని చెల్లించొచ్చు.

**సమస్య తలెత్తితే..**వాట్సప్ చాట్‌లో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా, సందేహాలు ఉన్నా 9140-23120410 నంబరుకు ఫోన్ చేయొచ్చు. %https://cdma.cgg.gov.in% వెబ్‌సైట్‌లోనూ వివరాలు ఉంటాయి.

నిజామాబాద్ నగరంలో ఇళ్లు: 73,051

వ్యాపార సముదాయాలు: 6,845

ఇళ్లు, వ్యాపార సముదాయాలు కలిపి: 4,686

ప్రభుత్వ భవనాలు: 206

# సేంద్రియ సేద్యం.. ఉత్పత్తుల్లో వైవిధ్యం

నిజామాబాద్ : రసాయనాల స్థానంలో సేంద్రియ ఎరువులతో పండించే ఉత్పత్తులతో ఫలితాలు ఎలా ఉంటాయో రైతులు, విద్యార్థులు తమ అనుభవాలు వివరిస్తున్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి రైతు మహోత్సవం రెండో రోజైన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కర్షకులు ప్రకృతి, సేంద్రియ సేద్యం స్టాళ్లు ఏర్పాటు చేయగా ఆకట్టుకున్నాయి. సహజసిద్ధంగా పండించిన, తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు ప్రదర్శనను వేదిక చేసుకున్నారు.

**ఉసిరి సాగు.. ఉపాధి బాగు**

రైతు మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఆయిల్‌పాంతో పాటు ఉసిరి సాగు చేయండి.. అద్భుత ఫలితాలుంటాయన్నారు. అదే ఉసిరికాయలను దశాబ్దాల తరబడి పండిస్తూ వాటితో తయారు చేస్తున్న నల్గొండ జిల్లాకు చెందిన లోకసాని పద్మారెడ్డి ఆర్గానిక్స్ ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. రైస్ షాంపు, డిష్ వాష్, ఫ్లోర్ క్లీనర్, కేరమిక్ కేర్ వంటి వాటిని వినియోగంలోకి తెచ్చారు. వీటిని నమూనాలుగా స్టాళ్లలో పెట్టారు.

**ఆకు రసాలతో కాస్మోటిక్స్**

శరీరాకృతి, అందం పెంపొందించే టాల్కం పౌడర్, హేర్ ఆయిల్, మల్టీపర్పస్ జెల్, సబ్బులు, సుగంధ పరిమళం వెదజల్లే బాడీ స్ప్రే, కీళ్లు, ఒళ్లు నొప్పులను తగ్గించే రసాయనాలు తదితర ఉత్పత్తులను ఆకు రసాల నుంచి ఉత్పత్తి చేసి ఔరా! అనిపిస్తున్నారు వరంగల్ జిల్లా మోజెర్లకు చెందిన శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు. తమ ఆలోచనలతో తయారుచేసిన సేంద్రియ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. తాము వీటి తయారీకి పడిన శ్రమ, రసాయనిక మిశ్రమాలతో తయారు చేసినవి వినియోగిస్తే ఏర్పడే దుష్ఫలితాలను వివరిస్తున్నారు.

**మిద్దె తోటలకు జీవ ఎరువులు**

ఇటీవలి కాలంలో మిద్దె తోటలు, పెరటి సాగుకు విపరీతమైన క్రేజ్ వచ్చింది. చిన్నపాటి స్థలంలో కూరగాయలు, పూల మొక్కలు, ఆకుకూరలు, పండ్ల తోటలు పెంచుకోవాంటే బయట ఎరువులు కొనే పరిస్థితి ఉండదు. బయట కొనుగోలు చేస్తే రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడుతున్నారనే పెరటి సాగుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. వినియోగించే ఎరువు సైతం సేంద్రియమే ఉండాలంటున్నారు. అలాంటి వారికి మన జిల్లా రాంపూర్‌లోని విశ్వ అగ్రిటెక్ సంస్థ గొర్రెలు, మేకలు, పశువుల పేడ, మూత్రం, పిండి, వ్యవసాయ వ్యర్థాలను వినియోగించి చేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో పెట్టి వివరిస్తున్నారు.

**విత్తనాలు ఆర్గానిక్‌వే..**

చిన్నపాటి విస్తీర్ణంలో పండించే ఆకుకూరలు, కూరగాయల విత్తనాలూ ఆర్గానికే వినియోగించాలనే లక్ష్యంతో భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన ఆర్‌ఆర్ ఆర్గనిక్ సీడ్స్ తమ విత్తనాలను ప్రదర్శనకు పెట్టింది. ఇందులో పుల్ల దోస, పొడువు దోస, బోడకాకర, ఎర్ర తోటకూరతో పాటు అనేక కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను చిన్న ప్యాకెట్లలో ప్రదర్శనకు పెట్టి విక్రయిస్తున్నారు.

**నల్లమల తేనె..**

సాధారణంగా తేనె అంటే తియ్యగా ఉంటుంది. కానీ వాము, నేరేడు, తులసి, కానుగ, తుమ్మ, బెర్రి, నువ్వులు, పొద్దు తిరుగుడు.. ఇలా ఏ చెట్టు ప్రాంతంలో తేనె తెట్టె ఉంటుందో అదే వాసనతో సహజసిద్ధంగా తయారుచేసే విధానాలతో స్టాళ్లు దర్శనమిస్తున్నాయి. ఒక్కో సంస్థ ఒక్కో విధంగా కల్తీ లేకుండా అందిస్తున్న విధానాన్ని వివరిస్తూ విక్రయాలు చేస్తున్నారు. నల్లమల హనీ బీ పార్కు పేరుతో అక్కడ తయారు చేసిన తేనె కూడా ఉంది.

చురకలు



# అక్రమార్కుల చెరలో మార్కెట్ దుకాణాలు

గుంతకల్లు : కళ్ల ముందే కొందరు పురపాలక ఆదాయానికి గండికొడుతూ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటు అధికారులు అటు మున్సిపల్ కౌన్సిల్ మౌనంగా ఉంటోంది. ఇదంతా గుంతకల్లు పట్టణం నడిబొడ్డునున్న మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో జరుగుతున్న తంతు. ఫలితంగా ఏటా దాదాపు రూ.34 లక్షల ఆదాయాన్ని కోల్పోతోంది.

**ఇదీ పరిస్థితి...**

ఇరవై ఏళ్ల కిందట మార్కెట్‌లో కూరగాయల వ్యాపారాలు చేసుకునే వారికోసం రూ.కోటికి పైగా వ్యయం చేసి 12 పెద్ద షెడ్లను నిర్మించారు. వీటిని 72 భాగాలు చేశారు. అన్నింటిని కూరగాయల వ్యాపారులకు అద్దెలకు ఇవ్వాల్సి ఉంది. దీన్నిపట్టించుకోకపోవడంతో కొందరు షెడ్లను స్వాధీనం చేసుకుని మున్సిపాలిటీకి ఒక్క పైసా అద్దె చెల్లించకుండా



కూరగాయల వ్యాపారులకే అనధికారికంగా అద్దెలకు ఇచ్చారు. నెలకు రూ. 8 వేల నుంచి రూ. 12 వేల వరకు వసూలు చేశారు. మరికొందరైతే గుడ్‌విల్ కింద ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. షెడ్లలో కూరగాయలను అమ్ముకోవాల్సిన వారు మార్కెట్‌కు చెందిన ఇరుకైన రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీనిపై కమిషనర్ నయీం అహమ్మద్ స్పందిస్తూ వస్తున్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. షెడ్లను స్వాధీనం చేసుకొని వేలాలు వేసి, మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

# వైద్య సిబ్బంది నిర్లక్ష్యం.. గడువు తీరిన ఔషధం

ధర్మవరం: ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విలువైన మందులు వృథా అయ్యేలా ఉన్నాయి. చిన్న పిల్లలకు శారీరక ఎదుగుదల జింక్ లోపం నివారించేందుకు, రోగ నిరోధక శక్తి మెరుగుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జింక్‌సల్ఫేట్ మందు (సిరప్)ను ఉచితంగా అందజేస్తారు. ఆసుపత్రికి రోజూ 40 మంది వరకు చిన్న పిల్లలు వైద్యం కోసం వస్తున్నారు.

మూలన పెట్టేశారు..గతేడాది నవంబరులో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి జింక్‌సల్ఫేట్ సిరప్ సీసాల అట్టపెట్టెలు 15 జిల్లా డ్రగ్ స్టోర్స్‌ను వచ్చాయని సిబ్బంది చెబుతున్నారు. ఒక్కొక్క అట్టపెట్టెలో వంద ఉన్నాయి.. అంటే 1500 దాకా సరఫరా చేశారు. అవసరమైన రోగులకు వాటిని ఇవ్వడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించారు. దీంతో ఔషధం కాల పరిమితి ఈ నెల 31కి ముగుస్తోంది. ఆసుపత్రిలో ఈ మందుల బాక్సులు గుట్టలుగా పేరుకున్నాయి. దాదాపు 1300 సీసాల



వరకు (13 పెట్టెలు) మూలకు పెట్టారు. వీటితోపాటు పలు రకాల మందులు కూడా ఇలానే ఉన్నాయి. ఈ సీజన్‌లో డయేరియా కేసులు ఎక్కువగా వస్తుంటాయి.. ఇలాంటి తరుణంలో జింక్ సల్ఫేట్ అందుబాటులో లేకపోతే రోగులకు ఇబ్బందులే. ఈ విషయాన్ని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి దృష్టికి తీసుకెళ్లగా ఈ సిరప్ ఎక్కువగా ఖర్చు కాకపోవడంతో బాక్సుల్లో ఉంచాం.. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌కు వెనక్కు పంపించమని ఆదేశాలిచ్చామన్నారు.

# గుంత పూడింది.. చింత తీరింది

గోరంట్ల : గత వైకాపా ప్రభుత్వ పాలనలో గోరంట్ల–కదిరి, గోరంట్ల–హిందూపురం ఆర్‌అండ్‌బీ రహదారులపై (ప్రస్తుతం జాతీయ రహదారుల విభాగంలోకి వెళ్లాయి) పలుచోట్ల గుంతలు ఏర్పడి ప్రజలు నరకయాతన అనుభవించారు. వాహన ప్రమాదాలతో ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో స్థానికులే తాత్కాలికంగా మట్టివేసి మరమ్మతులు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులకు మరమ్మతులు చేయించింది. దీంతో ప్రజలు సాఫీగా ప్రయాణం సాగించడానికి మార్గం ఏర్పడినట్లైంది. ప్రధానంగా హిందూపురం రహదారిలో





పాలసముద్రంలో ప్రతిభ పాఠశాల సమీపంలో, ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డుపై చెరువును తలపించేలా నీరు నిలిచేవి. ఇటీవల ఆ మార్గంపై బీటీ లేయర్ వేయడంతో సుందరంగా తయారైంది. గోరంట్ల పట్టణంలో స్టేట్‌బ్యాంకు వద్ద, ఆసుపత్రి ఎదురుగా, కెంపుల కన్వెన్షన్‌హాల్ సమీపంలో, కసిరెడ్డిపల్లి వద్ద, పులేరు పెద్దవంద మీద ఏర్పడిన గుంతలతో ప్రజలు పడిన బాధలు అన్నీఇన్నీ కావు. పెద్దవంక మీద ప్రమాదాలు జరిగి ఒకరు మృతిచెందారు. మరికొంతమంది గాయాల పాలయ్యారు. వారం కిందట తిప్పరాజుపల్లి వరకు రహదారిపై బీటీ వేయడంతో ప్రయాణం సాఫీగా సాగడానికి వీలు కల్గినట్లైంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# యువతపై బెట్టింగ్ పంజా!



అనంతపురం : అనంతపురం చెందిన ఓ యువకుడు ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులే. యువకుడు బెట్టింగ్‌కు ఆకర్షితుడయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న స్నేహితుడి ద్వారా రూ.2 లక్షలు ఒకసారి, రూ.2.50 లక్షలు మరోసారి ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌పై బెట్టింగ్ వేసి డబ్బులు పోగొట్టుకున్నాడు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంటి నుంచి పనిచేస్తున్నాడు. బెంగళూరుకు చెందిన కొందరు బుకీలను పరిచయం చేసుకుని బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. స్థానిక యువతను ఈ ఊబిలోకి లాగాడు. మధ్యవర్తిగా ఉంటూ ఇతరుల ద్వారా బెట్టింగ్ ఆడిస్తున్నాడు. హిందూపురం, మడకశిర ప్రాంతాల్లో కొందరు బెంగళూరు, తుమకూరుకు చెందిన బుకీలకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి వారితో బెట్టింగ్ వేయిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. ప్రభుత్వ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని బుకీలతో అనుసంధానం చేస్తున్నారు. ధర్మవరంలో పలువురు వ్యాపారులు బెట్టింగ్‌కు బానిసలుగా మారిపోయారు. ప్రొద్దుటూరుకు చెందిన బుకీలతో దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో మ్యాచ్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బెట్టింగ్ వేస్తున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. మాదకద్రవ్యాలు, మద్యం మాదిరే బెట్టింగ్ ఓ వ్యసనంలా మారుతోంది. బెట్టింగ్ యాప్‌ల్లో డబ్బులు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటుండం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ మొదలుకావడంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దందామళ్లీ రెక్కలు విప్పుతోంది. అనంత నగరంతో పాటు కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, ధర్మవరంలో దందా జోరుగా సాగుతోంది. ఇందులో ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువగా ఉంటున్నారు.

**అంతా ఆన్‌లైన్‌లోనే..**

గతంలో బుకీలకు నేరుగా ఫోన్‌చేసి బెట్టింగ్ కాసేవారు. పోలీసుల నిఘా పెరిగిపోవడంతో బుకీలు సైతం ఆన్‌లైన్‌లోకి మారిపోయారు. గతేడాది తాడిపత్రికి చెందిన ఒకరు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి బెట్టింగ్ నడిపించాడు. ఆన్‌లైన్‌లో ప్రస్తుతం 20కిపైగా బెట్టింగ్ యాప్‌లు ఉన్నాయి. పెద్దమొత్తంలో ఆఫర్లు ప్రకటించి యువతను ఆకర్షిస్తున్నారు. రూ.500తో మొదలుపెట్టి రూ.10 వేలు, రూ.50 వేల వరకు బెట్టింగ్ వేస్తున్నారు. రెండు జిల్లాలో నిత్యం రూ.2 కోట్లల్లో బెట్టింగ్ జరుగుతోందని నిఘా వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకు స్నేహితులు, బంధువుల వద్ద అప్పు చేస్తున్నారు. మరికొందరు రుణ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. వాటిని చెల్లించలేక కొందరు ఇంటికి దూరంగా ఉండటం..మరికొందరు ఒత్తిడి భరించలేక తనువు చాలిస్తున్నారు.

**కుటుంబ సభ్యులదే బాధ్యత!**

బెట్టింగ్ మహమ్మారి బారిన పడకుండా కుటుంబ సభ్యులే కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐపీఎల్ సీజన్‌లో పిల్లలు సాయంత్రానికే ఇంటికి చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మ్యాచ్ జరుగుతున్న సమయంలో పదేపదే ఫోన్ చూసినా.. మాట్లాడినా అప్రమత్తం కావాలి. ముఖ్యంగా వారి ఖాతాల్లో అవసరానికి మించి డబ్బులు లేకుండా చూసుకోవాలి. బెట్టింగ్ యాప్స్ ఉంటే వెంటనే తొలగించి కౌన్సెలింగ్ ఇవ్వాలి.

# పల్లె పండగకు వారం రోజులే గడువు!



పుట్టపర్తి : ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు మార్చి 31వ తేదీ చివరి గడువు. అప్పట్లోగా పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కివెళ్లిపోతాయి. ‘పల్లె పండగ’ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది జనవరిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.126 కోట్లు మంజూరయ్యాయి. ఒక్కో మండలంలో సుమారు 30 నుంచి 80 వరకు పనులు గుర్తించి సుమారు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు నిధులు కేటాయించారు. రోడ్లు నిర్మించేందుకు మరో వారం రోజులు మాత్రమే గడువున్నా కొన్ని మండలాల్లో 20 నుంచి 30 శాతం వరకు పనులు ప్రారంభమేకాలేదు. నేటికీ 124 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పనులు ప్రారంభమవుతాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా రూ.10.41 కోట్ల నిధులు ఇంకా ఖర్చు చేయలేదు. గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో గడువులోపు రోడ్లు నిర్మించడం అధికారులకు గగనంగా మారింది. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో సకాలంలో పనులు పూర్తి చేయకపోతే అభివృద్ధికి కేటాయించిన నిధులు నిష్ప్రయోజనంగా మారనున్నాయి.

**వెనుకబడిన ధర్మవరం...**

ధర్మవరం నియోజకవర్గంలో మొత్తం 314 పనులకుగాను నేటికీ 74 పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అత్యధికంగా ముదిగుబ్బ మండలంలో 30 పనులు ప్రారంభమేకాలేదు. తాడిమర్రిలో 20, బత్తలపల్లిలో 18, ధర్మవరంలో 6 పనులు నిధులున్నా పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడ ప్రధానంగా నాయకుల మధ్య విభేదాలతో పనులు ప్రారంభానికి నోచుకోవడంలేదు. ఒకే పనికోసం ఇరువురు పోటీ పడటంతో గుత్తేదారులను ఎంపిక చేయడం అధికారులకు కష్టంగా మారుతోంది. ఫలితంగా రోడ్డు నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. అలాగే హిందూపురంలో 4, చిలమత్తూరులో 11, అమడగూరులో 2, బుక్కపట్నం 2, ఓడీసీ 6, కదిరి 12, నల్లచెరువు 6, రొళ్ల 4, కనగానపల్లి 1, రామగిరి 2 పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. జిల్లాలోని నియోజకవర్గాల్లో అత్యధికంగా పెనుకొండలో వందశాతం పూర్తికాగా, రాప్తాడు 98 శాతం, మడకశిర 98, పుట్టపర్తి 97 శాతం, కదిరి 94 శాతం, హిందూపురం 91 శాతం రోడ్లు నిర్మాణాలు పూర్తయ్యాయి. ధర్మవరం 76 శాతంతో వెనుకబడింది.

గడువులోపు పూర్తి చేయిస్తాం

మురళి, పీఆర్ ఈఈ

మార్చి నెలాఖరులోపు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కువగా పెండింగ్ ఉన్న మండలాల్లో ఇప్పటికే అధికారులకు, గుత్తేదారులకు త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించాం.

# పంట భూముల్లో సౌరకాంతులు



తిరుపతి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పథకం కింద వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో వీటిని ఏర్పాటు చేయించేలా అధికారులు యత్నిస్తున్నారు. జిల్లాలోని 11 మండలాల్లో గుర్తించిన భూముల్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి 28 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. పిచ్చాటూరు, ఓజిలి, కోట మండలాల్లో ఇప్పటికే 80 ఎకరాల భూములు గుర్తించారు. వీటిలో ప్లాంట్ల ఏర్పాటుతో 16 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయనున్నారు.

**వినియోగం.. విక్రయం..**

సౌర ప్లాంటు ఏర్పాటుకు ముందుకొచ్చే రైతులకు అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఎకరా భూమిలో ప్లాంట్ ఏర్పాటు చేసుకునే వారికి ఏటా కనీసం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం లభించనుంది. మిగులు విద్యుత్తును డిస్కంల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయిస్తుంది. సహకార, మహిళా సంఘాల ద్వారా కూడా ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు ఉంది.

**వ్యయమిలా...**

మెగావాట్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు ఖర్చుకానుంది. ఈ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా భరించనున్నాయి. పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎస్పీడీసీఎల్‌కు ప్రభుత్వం అప్పగించనుంది.

**టెండర్ల దశలోనే..**

జిల్లాలో సోలార్ విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు ప్రక్రియ టెండర్ల దశలోనే ఉంది. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పి.సురేంద్రనాయుడు, ఎస్ఈ, తిరుపతి సర్కిల్

# గుట్టుగా.. కబ్జా

శ్రీకాళహస్తి : కైలాసగిరి ప్రదక్షిణ కోసం దేవుడిబాటను అభివృద్ధి చేశారు. ఐదేళ్ల వైకాపా హయాంలో దీని చుట్టూ అడ్డూ అదుపు లేకుండా అక్రమాలు జరిగాయి. ప్రస్తుతం మరోసారి అదను చూసుకొని అక్రమార్కులు కైలాసగిరి అటవీ భూములను గుట్టుగా కబ్జా చేస్తున్నారు. ఆక్రమణలు అని తెలిసినా పట్టించుకునే వారు లేకపోవడంతో యథేచ్ఛగా ఆక్రమణల పర్వం సాగిస్తున్నారు.

వైకాపా హయాంలో దేవుని బాట ఆనుకొని గుట్టుగా స్థలాలు కబ్జా చేయడం, పునాదులు వేయడం, మళ్లీ విక్రయించడం పరిపాటిగా మారింది. అప్పట్లో విమర్శలు వచ్చినా దీనిపై ఎవరూ శ్రద్ధ చూపని కారణంగా ఆక్రమణలు సాగిపోయాయి. ప్రధానంగా రాజీవ్‌నగర్, హరహరతీర్థం, టిడ్కో గృహ సముదాయం సమీపంలో ఇప్పటికీ



అడ్డగోలుగా ఆక్రమణలు జరుగుతున్నాయి. అప్పట్లో నియంత్రించాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో ఆక్రమణల పరంపర కొనసాగుతూ వచ్చింది.

**ఖాళీ భూములు లక్ష్యంగా..**

తాజాగా వేడాం, వేడాం బీసీ కాలనీ, ఓటిగుంట, తుఫాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో అక్రమార్కులు ఖాళీ భూములపై కన్నేశారు. దేవుడి బాటను ఆనుకుని పొలాలకు సమీపంలోని భూములను రాత్రి వేళల్లో జేసీబీలతో చదును చేసి ఆక్రమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్రమిత భూముల విలువ రూ.కోట్లలోనే ఉంటుంది. వేడాం బీసీ కాలనీ ఆనుకుని జరుగుతున్న ఆక్రమణలపై అక్కడి గ్రామస్థులు అడ్డు చెప్పినా అక్రమార్కులు నిలుపుదల చేయడం లేదు. ఇప్పటికైనా ఆలయ అధికారులు వాళ్ల హద్దుల మేరకు సిమెంటుతో చిన్నపాటి గోడలు నిర్మించకుంటే రానున్న రోజుల్లో కబ్జాల నియంత్రణ కష్ట సాధ్యం అయ్యే అవకాశముంది. ఇకనైనా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

# మహిళకు ఆర్థిక చేయూత

విజయనగరం : స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. స్త్రీనిధి కో–ఆపరేటివ్ సంస్థ ద్వారా మహిళలకు తక్కువ వడ్డీకి వివిధ రకాల రుణాలను అందిస్తోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరులో జాప్యమైంది. 2025–26 సంవత్సరానికి మహిళలకు ఏప్రిల్ 1నుంచే కొత్త రుణాలు ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో 21,289 మంది మహిళలకు రూ.179.66 కోట్లు అందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 21,131 మందికి రూ.163.33 కోట్లు మంజూరు చేశారు. బీమా సౌకర్యం ఉన్నందున సభ్యురాలు ప్రమాదవశాత్తు మరణిస్తే రుణం చెల్లించాల్సి అవసరం లేదు.

**కొత్త విధానంలో..**గతంలో జరిగిన అవకతవకలను దృష్టిలో పెట్టుకుని కొత్త నిబంధనలు అమలు చేస్తున్నారు. రుణం కోరిన సభ్యులను మండల వెలుగు కార్యాల యానికి పిలిపించి, ఎందుకోసం రుణం కోరుతున్నారు.. ఎటువంటి వ్యాపారం చేస్తారనే వివరాలు తెలుసుకున్న తర్వాత.. బయోమెట్రిక్ తీసుకుని మంజూరుకు సిఫార్సు చేస్తారు. గతంలో సభ్యులు కోరినట్లు వీవోఏ చెప్పడంతో మంజూరు చేయగా కొన్ని(చోట్ల రుణలు పక్కదారి పట్టాయి.

**రికవరీ 99.14 శాతం..**

రుణాల వసూళ్లలో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. స్త్రీనిధి డబ్బులు బ్యాంకుకు చెల్లించే సమయంలో వీవోఏలు చేతివాటం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఏడాది నుంచి పేటీఎం చెల్లింపులు తీసుకువచ్చింది. జిల్లాలో 121 క్లస్టర్లకు 190 ఎస్‌బీఐ పేటీఎం యంత్రాలు అందజేశారు. ఈ ఏడాది పట్టణంలోనూ రుణాలు ఇవ్వడానికి రూ.11 కోట్ల వరకు బడ్జెట్‌లో కేటాయించారు. సంఘానికి రూ.5 లక్షలు, సభ్యులు కనీసం రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.లక్ష వరకు పొందవచ్చు. 23 వాయిదాలు చెల్లిస్తే చాలు.. స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా 23 వాయిదాలు చెల్లిస్తే సరిపోతుంది. వీవోఏలు సభ్యులకు అన్ని విషయాలు సమగ్రంగా తెలియజేయాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేస్తాం. 125 రకాల జీవనోపాధులకు ఈ రుణాలను మంజూరు చేస్తున్నాం. ఉమా మహేశ్వరరావు, ఏజీఎం, స్త్రీనిధి సంస్థ, విజయనగరం

# ఒట్టు ఉంటేనే నీటి బొట్టు

విజయనగరం : డెంకాడ, భోగాపురం మండలాల్లోని 5,200 ఎకరాలకు సాగునీరు అందించే డెంకాడ ఆనకట్ట ఛానల్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఫలితంగా సాగునీరు ప్రశ్నార్థకంగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డి.కొల్లాం వద్ద చంపావతి నదిలో నిర్మించిన ఈ ఆనకట్టను 1968లో అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి ప్రారంభించారు. గత అయిదేళ్లూ ఎటువంటి నిర్వహణ పనులు చేపట్టలేదు. దేవుని కొల్లాం వద్ద చంపావతిలో ఆనకట్టపై ఏర్పాటు చేసిన 26 ఫాలింగ్ షట్టర్లకు గాను 10 మరమ్మతులకు గురవడంతో నీరు కిందకు వృథాగా పోతోంది. మదుముల వద్ద ఏర్పాటు చేసిన ఇనుప షట్టర్లు దెబ్బతిన్నాయి. ప్రధాన కాలువ పూడికతో నిండి



అధ్వానంగా తయారైంది. రబీలో చుక్కనీరు అందడం లేదని డెంకాడ, చందకపేట, సింగవరం, నాతవలస, బంటుపల్లి, పేడాడ, భోగాపురం, సుందరపేట, ముక్కాం తదితర గ్రామాల రైతులు వాపోతున్నారు. ఆనకట్ట ఛానల్ కింద 6 కి.మీ మేర తుప్పల తొలగింపునకు రూ.10 లక్షల మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ ఏఈ విద్యాసాగర్ తెలిపారు. మరమ్మతులకు గతంలో ఉపాధి హామీ నిధులు రూ.2.36 కోట్లు మంజూరైనప్పటికీ ప్రాధాన్యత లేమి కింద ఉండడంతో పనులు చేపట్టలేదని అన్నారు.

# అవినీతి విస్తరణకు అడ్డుకట్ట

నంద్యాల : కుందూనది విస్తరణ పేరుతో నిధుల మేతకు కొందరు వేసిన ప్రణాళిక బెడిసికొట్టింది. రూ.కోట్ల విలువైన బిల్లులను కూటమి ప్రభుత్వం తిరస్కరించింది. 2024– 25 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను పంపాలని కొంతకాలం కిందట ప్రభుత్వం ఆదేశించింది. ఇదే అదనుగా కేసీ కెనాల్ అధికారులు కుందూ ఆధునికీకరణ పనులకు సంబంధించిన రెండు బిల్లులను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. నీరు–చెట్టు పనులనే కుందూ ఆధునికీకరణలో భాగంగా చేసినట్లు చూపారని విజిలెన్స్ విచారణలో తేలింది. వాటి వివరాలు, పనుల ప్రగతిని, విజిలెన్స్ నివేదికలను పరిశీలించిన ప్రభుత్వం ఇటీవల తిరస్కరించింది.

**విచారణ సాగుతుండగానే బిల్లులు పెట్టారు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుందూ ఆధునికీకరణ పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. పనులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఓ వైపు విచారణ జరుగుతుండగానే నీటి పారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి బిల్లులు పంపించారు. ఓ గుత్తేదారు సంస్థకు రూ.150 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, మరో సంస్థకు రూ.52 కోట్లు ఇవ్వాల్సి ఉందని బిల్లులు పెట్టారు.నిబంధనల ప్రకారం విజిలెన్స్ కేసులు మూసివేశాక లేదా రద్దు చేశాకే ఆయా పనులకు బిల్లులు చేస్తారు. వీటిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రెండు బిల్లులను తిప్పి పంపింది.

**మరోసారి తనిఖీలు**



కుందూ ఆధునికీకరణ పనులకు సంబంధించి విజిలెన్స్ అధికారులు మరోసారి తనిఖీలు చేశారు. ఐదు రోజుల కిందట నంద్యాల కేసీ కాల్వ ఈఈ కార్యాలయం వేదికగా విజిలెన్స్ బృందం విచారణ నిర్వహించింది. నంద్యాల కేసీ కెనాల్ ఈఈతో పాటు బనగానపల్లి ఎస్సార్బీసీ ఈఈ, ఆళ్లగడ్డ కేసీ కాల్వ ఈఈతో పాటు పలువురు డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బందిని నంద్యాల కేసీ కెనాల్ కార్యాలయానికి పిలిపించి విచారించారు. గతంలో తీసుకెళ్లిన దస్త్రాలతో పాటు మరికొన్నింటిపై విజిలెన్స్ దృష్టిసారించింది. అధికారులను పలు కోణాల్లో విచారించి వివరాలు రాబట్టారు. మరోసారి కుందూనదిలో మరోసారి పరిశీలన చేయనున్నట్లు సమాచారం.

**మన్ను బుక్కేశారు**

'0' కి.మీ నుంచి పాణ్యం మండలం మద్దూరు వరకు నంద్యాల కేసీ కెనాల్ ఈఈకి, మద్దూరు నుంచి కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తి వరకు బనగానపల్లి ఎస్సార్బీసీ ఈఈకి, గుళ్లదుర్తి నుంచి పెన్నానది వరకు ఆళ్లగడ్డ కేసీ కెనాల్ ఈఈకి పనుల పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. పనుల్లో భాగంగా పాములపాడు, వెలుగోడు, బండిఆత్మకూరు, నంద్యాల, పాణ్యం, గోస్పాడు, కోవెలకుంట్ల, బనగానపల్లి, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లో 5 వేల ఎకరాల పట్టా భూములను సేకరించాల్సి ఉండగా సెంటు భూమి సేకరించలేదు. విస్తరణలో భాగంగా తవ్విన మట్టిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. నంద్యాల ప్రథమనంది ఆలయం వెనుక నదిలో జరిగిన పనుల్లో భాగంగా వచ్చిన మట్టిని టిప్పర్ల ద్వారా తరలించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. పాణ్యం మండలం మద్దూరు వద్ద ఇలానే అక్రమాలు జరిగాయి.

**మూడేళ్లలో చేసింది 20 శాతమే**

బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నానది వరకు 189 కి.మీ మేర విస్తరించడానికి గత వైకాపా ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. రూ.1725 కోట్లతో చేపట్టాలనుకొన్న పనులను వైఎస్సార్ జిల్లాకే చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. మూడేళ్ల పాటు పనులు జరిగినా 20 శాతమే చేశారు. ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతంలోనే మొక్కుబడిగా జరిగాయి. వాటికీ అప్పటి వైకాపా ప్రభుత్వం ఒక్కపైసా బిల్లులు చెల్లించలేదు. దీంతో గుత్తేదారులు పనులు నిలిపేశారు.

# వంతెన.. సాకారమయ్యేనా

పి.గన్నవరం : వశిష్ఠ గోదావరి నదీపాయ మధ్యలో ఉన్న ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలవారికి.. గోదావరి వరదల నుంచి శాశ్వత విముక్తి కలిగించేందుకు ఏఐఐబీ(ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) రుణంతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. దీంతో ఆ బ్యాంకు బృందంతో పాటు పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు బుధవారం పరిశీలనకు రానున్నారు. రూ.49.50 కోట్ల అంచనాతో 2023 మార్చి 30న ఇక్కడ వంతెన పనులను గుత్తేదారు సంస్థ మొదలుపెట్టింది. ఈ ఏడాది మార్చి 29 నాటికి పూర్తికావాల్సి ఉంది. ఇంతవరకు రూ.27 కోట్ల విలువైన పనులు పూర్తవగా అసంపూర్తిగా నిలిచిపోయాయి.



**పేరుకుపోయిన బకాయిలు..**

గుత్తేదారుకు ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. భూ సేకరణకు రైతులకు రూ.2.50 కోట్లు చెల్లించాలి. నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. ఏఐఐబీ బృందం కూడా గతంలో వంతెన నిర్మాణం గురించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వివరించింది. బుధవారం ఈ బృందం మరోసారి వస్తున్న నేపథ్యంలో సమస్యలు పరిష్కారం అవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# తాగునీటికి కండలేరు జలాలు



సూళ్లూరుపేట : ఈ వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని తిరుపతితో పాటు ముఖ్య పట్టణాలకు తెలుగుగంగ కాలువ ద్వారా కండలేరు జలాలు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాలోని చెరువులకు సాగునీరు, పశువులు అవసరాలకు కూడా మరికొంత నీటిని అందించేందుకు తెలుగుగంగ ఇంజినీర్లు ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వానికి పంపారు. డిమాండును బట్టి వచ్చేనెల 5 తర్వాత దశల వారీగా నీరు విడుదల చేయనున్నారు.

తిరుపతి, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రాంతాలతోపాటు నెల్లూరు జల్లాలోని రాపూరు, పొదలకూరు ప్రాంతాల్లోని గ్రామాలకు తాగునీటి అవసరాలకు 4.75 టీఎంసీల నీటిని ఇచ్చేలా నిర్ణయించారు. పెళ్లకూరు, నాయుడుపేట, కోట, చిట్టమూరు, వాకాడు ప్రాంతాల్లో విస్తరించిన స్వర్ణముఖి నదికి కూడా రెండు టీఎంసీల కండలేరు జలాలను విడుదల చేయనున్నారు. దీని ద్వారా వాకాడు సమీపాన స్వర్ణముఖి బ్యారేజ్‌లో నీరు నిల్వ ఉండి, భూగర్భ జలాలు పెరుగుతాయి. నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో చెక్‌డ్యామ్‌లో నీరు ఉండి, పంటల సాగుకు వీలుకానుంది.

**1.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు:** తిరుపతి జిల్లాలో 1,24,640 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 35,360 ఎకరాల ఆయకట్టుకు కండలేరు నుంచి 16 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ఈ దఫా వర్షాలు ఆలస్యంగా కురిసినా నారుమడులు సిద్ధం చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా జలాశయంలో 4.95 టీఎంసీ నీటిని నిల్వ ఉంచేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం కండలేరు నుంచి ఇచ్చే నీరు సరిపోనందున ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తోంది.

**పరిశ్రమలకు 1.25 టీఎంసీలు**

మేనకూరు ఆర్థికమండలితో పాటు శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రాంతాల్లోని పరిశ్రమలకు 1.25 టీఎంసీల తెలుగుగంగ నీటిని ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణమూర్తి తెలిపారు.

# సంక్షేమ రుణం సహకార సంక్షోభం



కర్నూలు : ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా తీసుకొన్న విధానాలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)ను నిండా ముంచాయి. రైతులకు రుణాలు ఇవ్వకుండా సంక్షేమ పథకాల పేరుతో ఆ పార్టీ కార్యకర్తలకు సీహెచ్‌సీలు, పీఎం స్వానిధి, జగనన్నతోడు, ఫిష్ ఆంధ్రా పథకాల పేరుతో పెద్దఎత్తున రుణాలు ఇచ్చారు. 25 శాఖల పరిధిలో రూ.64.06 కోట్ల మేర అందజేశారు. 2,330 మంది రూ.6.76 కోట్ల మేర చెల్లించకుండా మొండికేశారు. గత మూడేళుగా కంతులు చెల్లించడం లేదు. వీరి నుంచి వసూలు చేసేందుకు సహకార బ్యాంకు బ్రాంచీల అధికారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీర్ఘకాలిక మొండి బకాయిల వసూళ్లు తలకు మించిన భారంగా మారిందని ఓ అధికారి పేర్కొనడం గమనార్హం.

సహకార నిబంధనల ప్రకారం సాగు భూమి ఉన్నవారికే సహకార సొసైటీలో సభ్యత్వం ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో సెంటు భూమి లేనివారు.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారిని ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులుగా, డీసీసీబీ ఛైర్మన్లుగా ఎంపిక చేశారు. వారి ఆదేశాలమేరకు అధికారులు ఇష్టానుసారంగా రుణాలు పంపిణీ చేశారు. వారందరూ ప్రస్తుతం రుణాలు చెల్లించకుండా మొండికేస్తుండటం గమనార్హం. 2014–19 మధ్య సహకార బ్యాంకుకు రూ.170 కోట్ల మేర నిరర్థక ఆస్తులుండగా. గత ఐదేళ్ల కాలంలో రూ.80 కోట్ల మేర నిరర్థక ఆస్తులు పెరిగిపోయాయి.

**స్వానిధి**

ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.10 వేల చొప్పున పీఎం స్వానిధి పేరుతో చిరు వ్యాపారులకు సహకార బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించారు. ఉమ్మడి జిల్లాలో 10,245 మందికి రూ.12.68 కోట్ల మేర మంజూరు చేశారు. ఇందులో 1,795 మంది లబ్ధిదారులు రూ.1.62 కోట్ల మేర కట్టాల్సి ఉంది. వారిలో 41 మంది కొంతమేర తక్కువ మొత్తంలో చెల్లిస్తుండగా.. మిగిలిన 1,754 మంది రూ.1.56 కోట్ల మేర రుణ చెల్లింపులు చేయడం లేదు.

**అక్రమాల తోడు**

జగనన్న తోడు పథకం కింద 1,274 మందికి రూ.1.30 కోట్ల మేర రుణాలిచ్చారు. గత మార్చి నెలాఖరు నాటికి పరిశీలిస్తే 314 మంది రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉంది. అందులో 124 మందికి సంబంధించి రూ.90 వేల వరకు మొండి బకాయిలున్నాయి. ఇక ఫిష్ ఆంధ్రా పేరుతో 356 మందికి రూ.4.06 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. ఇందులో 17 మంది రూ.20 వేలు చెల్లించాల్సి ఉంది.

**సాగు యంత్రం కుతంత్రం**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో ఒక్కొక్కరికి రూ.15 లక్షలు మంజూరు చేయించారు. ఇందులో రైతు సంఘాల వాటా 10 శాతం కాగా 40 శాతం (రూ.6 లక్షలు) రాయితీపోనూ మిగిలిన రూ.7.50 లక్షలు సహకార బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,162 రైతు సంఘాలకు రూ.46.02 కోట్ల మేర సహకార బ్యాంకు రుణం రూపేనా ఇచ్చింది. ఈ ఏడాది మార్చి నాటికి కేవలం 136 సంఘాలే చెల్లించాయి.మిగిలిన 1026 సంఘాల నుంచి రూ.23.43 కోట్ల మేర వసూలు కావాల్సి ఉండటం గమనార్హం. కొన్ని రైతు సమూహాలు రుణం తీసుకున్న నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించలేదు. ఉమ్మడి జిల్లాలో 435 కేంద్రాలకు సంబంధించి సుమారు రూ.5.04 కోట్ల మేర దీర్ఘకాలిక మొండి బకాయిలున్నాయి. చాలా చోట్ల యంత్ర పరికరాలు కనిపించడం లేదు.

# బోధన కొరవడి.. ఫలితం చతికిలపడి



కదిరి : శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో సాంకేతిక వృత్తి విద్యా బ్రిడ్జి కోర్సుల్లో విద్యార్థుల ఫలితాలు అధఃపాతాళానికి పడిపోవటం విస్మయానికి గురిచేస్తోంది. 40 మంది విద్యార్థులున్న తరగతిలో నలుగురైదుగురు కూడా ఉత్తీర్ణత కాకపోవడం లోపం ఎక్కడుందో ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులకే ఎరుక. జిల్లాలో 20 కళాశాలల్లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, మెకానికల్ ఆటోమొబైల్ టెక్నీషియన్, సివిల్ ఇంజినీరింగ్ వంటి బ్రిడ్జి కోర్సులను నిర్వహిస్తున్నారు. బ్రిడ్జి కోర్సులో ఉత్తీర్ణత సాధిస్తే ఎంసెట్ ద్వారా ఇంజినీరింగ్ చేరేందుకు అవకాశం ఉంది. అదేవిధంగా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం, బీఎస్సీ నర్సింగ్‌లో చేరొచ్చు. అయితే ఇటీవల వెల్లడైన బ్రిడ్జి కోర్సు పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు చతికిలబడ్డారు.

**కుంటుపడిన చదువులు** బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులు బోధించేందుకు కళాశాలల్లో అధ్యాపకులు లేకపోవడంతో విద్యా బోధన కుంటుపడింది. ఒకేషనల్ గ్రూపుల పాఠ్యాంశాలకే విద్యార్థులు పరిమితమయ్యారు. చివరలో ముఖ్యమైన అంశాలను వల్లె వేయించినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం కేవలం పది లోపలే పరిమితమైంది.

జిల్లాలో గుడిబండ ప్రభుత్వ కళాశాలలో మాత్రమే మొదటి సంవత్సరం బ్రిడ్జి కోర్సులో 31కి 13 మంది, ద్వితీయ సంవత్సరంలో 42కు 20 మంది ఉత్తీర్ణత సాధించారు. కొన్ని కళాశాలల్లో ఇద్దరు, ముగ్గురు పాసవగా, చాలా చోట్ల ఫలితాలు సున్నాకే పరిమితమయ్యాయి. పర్యవేక్షణ అధికారులు ప్రారంభం నుంచే శ్రద్ధ చూపిఉంటే బ్రిడ్జికోర్సు ఉత్తీర్ణతతో పాటు పేద విద్యార్థుల ఉన్నత విద్యకు మార్గమయ్యేదని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సబ్జెక్టు అధ్యాపకులదే బోధన బాధ్యత–** రఘునాథరెడ్డి, డీఐఈఓ, పుట్టపర్తివిద్యార్థుల ఎంపికతోనే బ్రిడ్జి కోర్సు ఉంటుంది. వారికి సైన్సు సబ్జెక్టు అధ్యాపకులే బోధిస్తారు. అయితే ఫలితాలు అంతగా సాధించలేకపో యారు. ఈ విషయంపై ఆయా కళాశాలల్లో విచారిస్తాం. ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. బ్రిడ్జి కోర్సులోనే ఎందుకు రాలేదో విచారించి, తగిన చర్యలు తీసుకుంటాం.

# జంతువుల కదిలికపై కన్ను

పోలవరం : జాతీయ పార్కుగా ప్రకటించిన పాపికొండల అభయారణ్యంలో వన్య ప్రాణులను గుర్తించి వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీశాఖ వన్యప్రాణి విభాగం దృష్టి సారించింది. ఈ నెల మొదటి వారంలో జంతువుల గణనకు ఏలూరులో శిక్షణ పొందిన ఆ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అడవుల్లో ట్రాప్ కెమెరాలు ఎక్కడెక్కడ, ఏ కోణంలో ఉంచాలో నివేదిక రూపొందించారు. ఆ సమాచారంతో 10 బీట్‌లలో కెమెరాలు అమర్చే పనుల్లో వారంతా నిమగ్నమయ్యారు.ఎక్కడెక్కడ అంటే.. పోలవరం పరిధిలో అభయారణ్యం 15వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. మెత్తప్పకోట, కొత్తూరు, కోండ్రుకోట, తూటిగుంట, చిలకలూరు, శిరివాక, ఉడతపల్లి, వింజరం, శివగిరి, టేకూరు బీట్‌ల పరిధిలో 70 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

**15 అడుగుల దూరంలో ఉన్నా**

జంతువులు నడిచే బాటల వెంట, నీటి కుంటల వద్ద చెట్లకు దిగువ నుంచి మూడు అడుగుల ఎత్తులో ఎదురెదురుగా రెండు ట్రాప్ కెమెరాలు అమర్చుతారు. కెమెరా పరిధిలో 15 అడుగుల దూరంలోని చిన్న కదలిక సైతం స్వయంచాలితం (ఆటోమెటిక్)గా కెమెరాకు చిక్కుతుంది. వాటి ముందు నుంచి చిన్న చిన్న జంతువులు వెళ్లినా నమోదవుతుంది. ప్రతి ట్రాప్ కెమెరాలో 32 జీబీ చిప్, ఎనిమిది



బ్యాటరీలు ఉంటాయి. వారానికోసారి చిప్‌లను రేంజ్ కార్యాలయానికి తెచ్చి వాటిలో నమోదైన దృశ్యాలను తీసి కంప్యూటర్‌లో భద్రపరుస్తారు. బ్యాటరీలను పదిహేను రోజులకో పర్యాయం మార్చాల్సి ఉంటుంది.

**ప్రత్యేక రక్షణ దళంతో..**

వన్యప్రాణులను వేటాడే వ్యక్తులు కెమెరాలను అపహరించే ప్రమాదం ఉంది. వీటి నిరంతర పరిశీలనకు ప్రత్యేక రక్షణ సహాయకులు ఉంటారు. చిరుత పులులు అభయారణ్యంలో తిరుగుతున్నాయని పోలవరం అటవీశాఖ అధికారి ఎస్‌కే వలీ అన్నారు. గతేడాది ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో అలజడి సృష్టించిన పెద్దపులి జాడ ట్రాప్‌కెమెరాల ద్వారానే గుర్తించినట్లు చెప్పారు. పోలవరంతోపాటు కుక్కునూరు, అమరవరం రేంజి కార్యాలయాల పరిధిలోని పాపికొండల అభయారణ్యంలోను కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

# అంతర్జాలంలో మాయాజాలం

ఏలూరు: ట్రిపుల్ ఐటీల్లో ఇంటర్‌నెట్ కుంభకోణానికి తెర తీశారు. ఓ కంపెనీకి అప్పనంగా భారీ లబ్ధి చేకూర్చేందుకు యాజమాన్యం కథ నడిపించింది. టెండర్లతో పని లేకుండా ఇష్టారాజ్యంగా కాంట్రాక్టులు కట్టబెట్టేశారు. మార్కెట్లో అంతర్జాలం సదుపాయం సమకూర్చే కంపెనీలు బోలెడున్నా అన్నింటినీ పక్కకు తోసి ఆ కంపెనీకే ఇవ్వడం వెనుక భారీ ముడుపుల ముచ్చటే ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

**నిబంధనలకు పాతర**

నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ ప్రాంగణాల్లో విద్యార్థులకు అంతర్జాలం సదుపాయం కల్పించేందుకు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జీవో 258 ప్రకారం రూ.లక్షకు మించి చేపట్టే ఏ పనికైనా ఈ ప్రొక్యూర్మెంట్ విధానం ప్రకారం టెండర్లు ఆహ్వానించాలి. ట్రిపుల్ ఐటీ అధికారులు మాత్రం నిబంధనలతో పని లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్కో ప్రాంగణానికి రూ.కోటికి పైగా విలువ చేసే అంతర్జాల సదుపాయం కల్పించే కాంట్రాక్టులను ఇష్టారాజ్యంగా ఓ కంపెనీకి ఇచ్చేశారు. ఒక్క నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించినందుకే మూడేళ్లకు రూ.2.28 కోట్లు చెల్లించాలని సదరు కంపెనీ ప్రతిపాదనలు పెట్టింది. దీనికి యాజమాన్యం తలాడించడంతో ఇప్పటికే పనులు కూడా మొదలయ్యాయి. ఇదే విధానాన్ని మిగిలిన మూడు ప్రాంగణాల్లోనూ అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అన్ని




ప్రాంగణాల్లో కలిపి రూ.కోట్లలో ఆ కంపెనీకి లబ్ధి చేకూర్చనున్నారు.

**ఆ కంపెనీకే ఎందుకో?**

నిబంధనల ప్రకారం పత్రికా ప్రకటన ఇచ్చి..బహిరంగ టెండర్లు పిలిస్తే ఆసక్తి ఉన్న కంపెనీలు వచ్చి వారు ఎంత మొత్తానికి చేస్తారో నమోదు చేసేవి. ప్రాంగణంలో ఇంటర్‌నెట్ అవసరాలను బట్టి తక్కువ మొత్తాన్ని సౌకర్యం కల్పించే సంస్థకు బాధ్యతలు అప్పగించాలి. ఇదేం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విషయాన్ని గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదించిందంటూ అసలు టెండర్లే లేకుండా ఓ కంపెనీకి అప్పగించేశారు.

**నియంతృత్వ పోకడలా?**

టెండర్లు లేకుండా కాంట్రాక్టు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తే గవర్నింగ్ కౌన్సిల్‌కు ఏదైనా చేసే హక్కు ఉందని వాదిస్తున్నారు. జీవోలను సైతం ధిక్కరించి నిర్ణయాలు తీసుకునే అర్హత తమకు ఉందని చెబుతున్నారు. దీనిపై ట్రిపుల్ ఐటీ వీసీ ఎం విజయకుమార్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కంటితుడుపుగా పోషణ పక్వాడా

అనంతపురం : పోషణ లోపం.. ఆరోగ్య రుగ్మతలు.. తదితర వాటిపై లబ్ధిదారుల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన 'పోషణ పక్వాడా' పక్షోత్సవం తూతూమంత్రంగా నిర్వహించారు. రెండు వారాల పాటు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ప్రచార కార్యక్రమాలన్నీ క్షేత్ర స్థాయిలో కంటితుడుపు సాగించడం విమర్శలకు దారి తీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్నీ నిధులు కేటాయించినా అధికార యంత్రాంగం శ్రద్ధ పెట్టలేదు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో అధ్వానంగా జరగడం గమనార్హం. ఈనెల 8 నుంచి 22 వరకు పోషణ పక్వాడాపై విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉన్నా రెండు జిల్లాల పీడీలు, అత్యధిక శాతం సీడీపీఓలు కనీస దృష్టి సారించలేదు. కొందరు సూపర్‌వైజర్లు తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకొన్నారు. ఇందులో లబ్ధిదారుల హాజరు నామమాత్రమే. శ్రీసత్యసాయి జిల్లాతో పోల్చితే అనంత జిల్లాలో అధ్వానంగా మారింది. అతి తక్కువ మంది సీడీపీఓలు అడపాదడపా వస్తున్నా... జిల్లా అధికారులు హాజరైన దాఖలాలే లేవు. చాలా చోట్లా సూపర్‌వైజర్లే



అన్నీ తానై జరిపారు.

**రూ.10 లక్షలకుపైగా నిధులు**

పోషణ పక్వాడ మాసోత్సవ నిర్వహణకు రెండు జిల్లాలకు కలిపి రూ.10 లక్షలు పైగా కేంద్ర నిధులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 23 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉంటే.. 5126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పాత ప్రాజెక్టుల ఆధారంగా ఒకో ప్రాజెక్టుకు రూ.40వేల నుంచి రూ.50వేలు దాకా ప్రచారానికి కేటాయించినట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయిలో ముగింపు భారీగా జరపాలని నిర్ణయించినా ఎక్కడా కానరాలేదు. పుట్టపర్తిలో ఓ చిన్నసభ పెట్టి ముగించారు. అనంత జిల్లాలో ముగింపు ఉత్సవాలు ఊసేలేవు. ప్రతి ప్రాజెక్టులో రెండు బ్యానర్లు రాయించి.. అన్ని కేంద్రాలకు వాటినే తిప్పారు. లబ్ధిదారుల గైర్హాజరు కాగా. నిర్దేశిత సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీలు హాజరై సమావేశాలు నిర్వహించి మమ అనిపించారు. అనంత గ్రామీణ మండలం రాచానాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ముగింపే నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు కనిపించింది.

# బిందుసేద్యం.. అనంత ఆదర్శం

అనంతపురం: అనంత రైతులు సాగునీటి వినియోగంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. బిందుసేద్యం ద్వారా ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకుని పంటలు సాగు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నుంచి పెద్దఎత్తున ప్రోత్సాహం లభిస్తుండటంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బిందుసేద్యం అమలులో దేశంలోనే అనంతపురం జిల్లా రెండో స్థానంలో నిలిచింది. దీంతోపాటు 17 వేల హెక్టార్లను కొత్తగా బిందు సేద్యం కిందకు తీసుకొచ్చి రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో బిందుసేద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం గతేడాది పెద్దఎత్తున లక్ష్యాలు విధించి బిందుసేద్యం అమలయ్యేలా చర్యలు తీసుకుంది.

వైకాపా ప్రభుత్వంలో రెండున్నరేళ్లు పథకాన్ని అమలు చేయలేదు. మరో రెండున్నరేళ్లు అరకొరగా పరికరాలు అందజేశారు. దీంతోపాటు రాయితీని 90 శాతం నుంచి 70 కుదించారు. మొత్తం 26 కంపెనీలకు కాంట్రాక్టు ఇచ్చారు. రైతులు మెచ్చిన కంపెనీల నుంచి కాకుండా ప్రభుత్వానికి అనుకూలమైన వాటి నుంచే పరికరాలు అందించారు. నాణ్యతగా లేకపోవడంతో చాలామంది రైతుల డీడీలు చెల్లించినా పరికరాలు తీసుకోవడానికి ముందుకు రాలేదు.

కూటమి ప్రభుత్వంలో రైతులు ఏది కోరుకుంటే ఆ కంపెనీ నుంచే పరికరాలు అందిస్తున్నారు.

బకాయిలు సైతం ఎప్పటికప్పుడు చెల్లిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పరికరాల అమరిక వేగవంతంగా సాగుతోంది.

2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి 10 ఎకరాలలోపు రైతులకు 90 శాతం రాయితీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

**2.49 లక్షల హెక్టార్లలో..**

విభజిత అనంతపురం జిల్లాకు సంబంధించి 2003 నుంచి 2024 వరకు 2,07,191 మంది రైతులకు 2.49 లక్షల హెక్టార్లలో బింద్యు సేద్యం అమలు చేశారు. 2024-25 గాను 18,000 హెక్టార్ల లక్ష్యం విధించగా.. 17,642 హెక్టార్లలో సాధించారు. గతేడాది మొత్తం 14,869 మంది రైతులకు సూక్ష్మసేద్యం పరికరాలు మంజూరు చేశారు.

# చేబ్రోలులో డయేరియా లక్షణాలు..

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డయేరియా లక్షణాలతో నాలుగు రోజులుగా సుమారు 60 మంది చికిత్స పొందారు. స్థానిక పీహెచ్‌సీకి 48 మంది రాగా మిగిలినవారు ప్రైవేటు ఆసుపత్రులు, పీఎంపీ, ఆర్ఎంపీల దగ్గర వైద్యం చేయించుకున్నారు. చేబ్రోలులోని రథంబాట, మట్లవారివీధి, కొత్తపేట ప్రాంతాలకు చెందినవారు అధికంగా వైద్యం పొందారు. ఇతర ప్రాంతాలు, స్థానికంగా జరిగిన ఫంక్షన్లలో భోజనాలు చేసినవారు ఎక్కువగా డయేరియా లక్షణాలతో తమ వద్దకు వచ్చినట్లు చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి జగదీష్ తెలిపారు. ఈనెల 19 నుంచి పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చారన్నారు. బాధితులను



పరీక్షించగా డయేరియా లక్షణాలు లేవని, ఆహారంలో మార్పు వల్ల విరేచనాలైనట్లు గుర్తించామన్నారు. విరేచనాలతో ఆరుగురు మాత్రమే వచ్చారన్నారు. స్థానిక మూడు సచివాలయాల పరిధిలో ఆరు తాగునీటి నమూనాలు సేకరించి ప్రయోగశాలలో పరీక్షించినట్లు పంచాయతీ కార్యదర్శి రాజు తెలిపారు. చేబ్రోలులో చేపలు, మాంసాహార విక్రయాలు నిలిపివేశామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్, తహసీల్దారు సత్యనారాయణ చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జడ్పీటీసీ సభ్యుడు నాగలోవరాజు, పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు జయకృష్ణ ఆరా తీశారు.

# స్థలాలు కాజేసి.. జేబులు నింపేసి



కదిరి : రాష్ట్ర ప్రభుత్వం పేద భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను తమ హస్తగతం చేసుకున్న కొందరు భవన నిర్మాణ కార్మిక నాయకులు ఇష్టానుసారంగా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. కార్మికులకు స్థలాలు దక్కకుండా చేశారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్దేశం నీరుగారింది. దీనిపై లబ్ధిదారులు ఆందోళనబాట పట్టడంతో రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. కదిరి - హిందూపురం రహదారి పక్కన 2007లో భవన నిర్మాణ కార్మికులకు సర్వే నం: 1769, 1770లోని 7.95 ఎకరాల భూమిని కేటాయించి 323 మందికి పట్టాలు మంజూరు చేశారు. ఎక్కువ మందికి పట్టాలిచ్చిన ప్రదేశం బండరాళ్లు, గుట్ట ఉండటంతో అప్పట్లో లబ్ధిదారులు చదును చేసుకోవడానికి ముందుకు రాలేదు. రెవెన్యూ అధికారుల నుంచి పట్టాలన్నింటినీ తీసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కొందరు తమవద్దే పెట్టుకున్నారు. ఈ ప్రాంతంలో 2014 - 16 మధ్య కాలంలో ఆర్డీఓ, డీఎస్పీ కార్యాలయాలు నిర్మిం చడంతో భూముల ధరలు పెరిగాయి. ఈ క్రమంలో నాయకులు కొందరు పట్టాలకు ధర కట్టి విక్రయించడం మొదలు పెట్టారు. కార్మికులకు కేటాయించిన స్థలాన్ని కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు ప్రారంభించారు. దీంతో తమకు స్థలాలు చూపాలంటూ కార్మికనాయ కుడిని కార్మికులు నిలదీశారు. ఇళ్ల స్థలాల పట్టాలు పొందడానికి డబ్బులు ఖర్చు పెట్టానని, డబ్బులిస్తేనే పట్టాలు ఇస్తానంటూ సదరు నాయకుడు వాయిదా వేస్తూ వచ్చారు. డబ్బులు ముట్టజెప్పిన వారికి ఆయన స్థలాలు చూపడంతో నిర్మాణాలు చేపట్టారు. 2007 పట్టాలు మంజూరైన 323 మంది లబ్ధిదారులు తహసీల్దారు, ఆర్డీఓ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు జరిగిన అన్యాయాన్ని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. స్పందించిన రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. మూడు వారాలపాటు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు.

**అర్హులు పది శాతంలోపే..?** 2007లో పట్టాలు మంజూరైన లబ్ధిదారుల్లో ప్రస్తుతం 10 శాతం మందికి మాత్రమే స్థలాలు చూపారు. మిగతావన్నీ అనర్హులకు అమ్ముకున్నారని భవన నిర్మాణ కార్మికులు విచారణ అధికారుల ఎదుట వాపోయారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సర్వే నం: 1769, 1770లోని 7.95 ఎకరాలతోపాటు ఆ భూమికి ఆనుకుని ఉన్న కొండను చదును చేసి పట్టాలు విక్రయించేశారు. సమీపంలోని జగనన్న కాలనీకి వెళ్లే మార్గానికి పడమర వైపున ఉన్న కొండను దళారులు కొలతలు వేసి అమ్మేసినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం 323 మందికి పట్టాలు కేటాయిస్తే.. ప్రస్తుతం ఐదు వందలకుపైగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలపై రోజూ ఫిర్యాదులు అందుతున్నా అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**చర్యలు తీసుకుంటాం- వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి**

భవన నిర్మాణ కార్మికులకు మంజూరు చేసిన పట్టాల విషయంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, కార్మికుల ఆందోళనను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ సిబ్బంది చేత విచారణ చేయించాం. విచారణ అధికారులు ఇచ్చిన నివేదిక జిల్లా కలెక్టర్ పంపాం. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశానుసారం బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తప్పవు.

# అనర్హుల ఏరివేత.. అర్హులకు చేయూత



తిరుపతి : పేదలు, అభాగ్యులకు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే పింఛను కోసం పలువురు అర్హులు నిరీక్షిస్తుండగా, అనర్హులు అనేక మంది అప్పనంగా పింఛను తీసుకుంటున్నారు. వైకాపా హయాంలో పార్టీల ముద్ర వేసి పలువురు అర్హులకు పింఛను తొలగించగా, అనర్హులకు మంజూరు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనర్హుల ఏరివేత ప్రారంభించింది. వీరి స్థానంలో అర్హులైన వారు, గతంలో పింఛను తీసుకుంటూ వైకాపా ప్రభుత్వంలో అర్హత ఉన్నా రద్దయిన వారికి పునరుద్ధరించాలని నిర్ణయించింది. జులై నుంచి కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

**పునఃపరిశీలన తరువాత**

గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ తమకు పింఛను కావాలని 61,836 మంది దశల వారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు ఎక్కువగా ఉన్నారు. వీరిలో కొత్తగా అర్హత సాధించిన వారు, సాంకేతిక కారణాలతో పింఛను రద్దయిన వారు, ఉద్దేశ పూర్వకంగా వైకాపా నాయకుల సిఫార్సుతో పింఛను తొలగించిన వారూ ఉన్నారు. దరఖాస్తుల పునఃపరిశీలన తర్వాత అర్హులకు కొత్త పింఛన్లు, రద్దయిన వారికి పింఛను పునరుద్ధరించనున్నారు.

**భారీగా బోగస్ పత్రాలు..**

వైకాపా హయాంలో దివ్యాంగుల కేటగిరీలో బోగస్ సదరం ధ్రువపత్రాలు ఇబ్బడిముబ్బడిగా జారీ అయ్యాయి. కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరుకు ముందే వాటిని రీ అసెస్‌మెంట్ చేయించాలని సదరం శిబిరాలు నిర్వహిస్తోంది.

**రూ.15 వేల పింఛనులో 50 శాతం అనర్హులు**

తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలతో మంచానికే పరిమితమై వారు చిత్తూరు జిల్లాలో 1,932 మంది, తిరుపతి జిల్లాలో 1,180 మంది నెలకు రూ.15 వేలు పింఛను తీసుకుంటున్నారు. వీరిలో చాలామంది లేచి నడవగలుగుతున్నా మంచానికే పరిమితమైనట్లు పింఛను తీసుకుంటున్నారనే ఆరోపణలతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించింది. అందులో 50 శాతం మందికి పైగా అనర్హులుగా విచారణలో గుర్తించారు.

**1,874 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు..**

కుటుంబంలో పింఛను తీసుకుంటున్న భర్త మరణిస్తే ఆయన భార్యకు జాప్యం లేకుండా పింఛను (స్పౌజ్ పింఛను) అందించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. 2023 డిసెంబరు 1 నుంచి స్పౌజ్ కేటగిరీ పింఛను మంజూరు చేయాలని నిర్ణయించింది. మేలో దరఖాస్తులు తీసుకుని జూన్ 1 నుంచి పింఛను ఇవ్వనున్నారు. ఈ కేటగిరీలో చిత్తూరు జిల్లాలో 488 మంది, తిరుపతి జిల్లాలో 1,386 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# వైకాపా నిర్వాకం..అంతా బీడుమయం



తాడిపత్రి : పెద్దపప్పూరు మండలంలోని చాగల్లు జలాశయం నుంచి తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను కలిపే వరద కాలువ నిర్మాణ పనులు ఏళ్లుగా నానుతూనే ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ విధ్వంస పాలనలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. 1.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన చాగల్లు జలాశయం పైప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే చాలు నిండుకుండను తలపిస్తుంది. ఆపైన వచ్చే వరదను ఏటా పెన్నానదికి వదలాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

**50 శాతం పూర్తి చేసినా..**

వరద నీటిని సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలు పెంపొందించడంతో పాటు రైతుల కష్టాలను తీర్చేందుకు 2018లో తెదేపా ప్రభుత్వం కాలువ నిర్మాణం చేపట్టింది. సుమారు 30 వేల ఎకరాలకు నీరు అందించాలన్నది లక్ష్యం.

**ఈనేపథ్యంలో సుమారు**

రూ.22 కోట్లతో చాగల్లు జలాశయం నుంచి పుట్లూరు మండలంలోని కొండాపురం వద్ద ఉన్న తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌ను కలుపుతూ 11 కి.మీ. మేర నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 2019 నాటికి 50 శాతం పనులు పూర్తి చేశారు. అనంతరం వైకాపా అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పొలాలు బీళ్లుగా మారాయి. గతేడాది ఎన్నికల ముందు హడావుడిగా పనులు ప్రారంభించినా గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆగిపోవడం గమనార్హం.

**సాగుతోపాటు తాగునీరు..**

కాలువ నిర్మాణం పూర్తయితే పెద్దపప్పూరు మండలంలోని షేక్‌పల్లి, నామనాంకపల్లి, అమ్మలదిన్నె, జేకొత్తపల్లి, తాడిపత్రి మండలం, పుట్లూరు మండలంలోని పలు గ్రామాల పరిధిలో సాగు, తాగునీటి కష్టాలు

తీరుతాయి.

**మిగిలిన పనులు చేయిస్తాం- హరినాథ్, హెచ్చెల్సీ ఏఈ**

పాత ధరలతో నిర్మాణ పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. సమస్యను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారం అయిన వెంటనే పనులు చేపడతాం.

# రూ.5.. 20 లీటర్ల నీరు

కర్నూలు : పల్లె ప్రజలకు శుద్ధిచేసిన నీటిని అందించే ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం పునరుద్ధరణపై 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించింది. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా పథకాన్ని 'నీరు'గార్చింది. బకాయిలు చెల్లించకపోవడంతో గుత్తేదారుడు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దీనిపై దృష్టి సారించింది. గుత్తేదారులు చెల్లించిన బ్యాంకు గ్యారెంటీ సొమ్ము రూ.32 లక్షలతో పునరుద్ధరించేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే బనగానపల్లి నియోజకవర్గం కొలిమిగుండ్లలో అందుబాటులోకి తీసుకొచ్చారు.



ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మండలంలో 24 చోట్ల శుద్ధి జలాలు అందే ఏర్పాట్లు చేశారు. గత ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో నీరు గారింది. పథకం పని చేసి ఉంటే రూ.5.. 20 లీటర్ల నీరు దొరికేది.. పథకం నీరు గారడంతో వర్కుర్‌లో రూ.30 చెల్లిస్తే తప్ప 20 లీటర్ల నీరు దొరకడం లేదు.

మండలాలు: 8
గ్రామాలు: 211
ప్రజలు: 3,48,896
ఇచ్చే నీరు: 20 లీటర్లు (రూ.5)
ప్రాజెక్టు ఖర్చు: రూ.14.25

ఎనిమిది మండలాల్లో

ఫ్లోరైడ్ ప్రభావిత పల్లెలు, మంచినీటి వనరులు లేని గ్రామాల్లోని ప్రజలకు శుద్ధి చేసిన నీరు ఇవ్వాలని గత తెదేపా హయాంలో నిర్ణయించారు. కోడుమూరు, తుగ్గలి, కృష్ణగిరి, వెల్దుర్తి, కౌతాళం, నందవరం కొలిమిగుండ్ల, నందికొట్కూరు మండలాల్లోని పలు గ్రామాలకు నీరు ఇవ్వాలని కర్నూలు జిల్లాలో 6, నంద్యాలలో రెండు చోట్ల ఆర్వో ప్లాంట్లు నిర్మించారు.

మండల కేంద్రంలోని మదర్ ప్లాంటులో గంటకు పది వేల లీటర్ల నీరు శుద్ధి చేసే యంత్రాలు బిగించారు. అక్కడ శుద్ధి చేసిన నీటిని రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్లకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. ఆర్డీయూల ద్వారా రూ.2కు 20 లీటర్ల శుద్ధ జలం అందించాలి. 2021లో పనులు పూర్తి చేసి ప్రజలకు స్వచ్ఛ జలాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

**పేరు మార్చి 'నీరు'గార్చిన వైకాపా** 2021 జులై నుంచి 2026 జులై వరకు ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత గుత్తేదారుకే సంబంధమంటూ కాంట్రాక్టు ఒప్పందంలో ఉంది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా వైఎస్సార్ సుజల పథకంగా పేరు మార్చిందే తప్ప.. పైసా విడుదల చేయలేదు. గుత్తేదారుకు నగదు చెల్లించలేదు. నిర్వహణదారుడికి వైకాపా బకాయిలు చెల్లించకపో వడం నిర్వహణ భారం పెరగడంతో ఏడాదిన్నర తర్వాత గుత్తేదారు తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. విలువైన పరికరాలు దొంగలెత్తుకుపోయారు..

# నిధులు బొక్కేశారు.. కక్కించేదెప్పుడో..?

సీతానగరం : గత వైకాపా పాలనలో కొన్ని పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరగ్గా, ఆడిట్ నివేదికలు బయటకు రాకుండా ప్రజాప్రతినిధులు అడ్డుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విచారణ వేగవంతం చేసింది. అధికారుల విచారణలో పలుచోట్ల అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.

**అక్రమాలపై విచారణ..**

సీతానగరం మండలం రఘుదేవపురం మేజర్ పంచాయతీలో రూ.1.03 కోట్లు దుర్వినియోగం అయినట్లు జిల్లా ఆడిట్ అధికారులు గుర్తించారు. ఇంటి పన్ను వసూళ్లలో రూ.26 లక్షలు మింగేశారు. ముగ్గురు కార్యదర్శులు, బిల్ కలెక్టర్, సర్పంచి.. ఎవరు ఎంత తినేశారనే లెక్కలతో సహా అధికారులు నివేదిక ఇచ్చారు. ఉద్యోగులను సస్పెండ్ చేశారే తప్ప నయాపైసా రికవరీ చేయలేదు.

కడియపులంక, దుళ్ల పంచాయతీల్లో నిబంధనలు పట్టించుకోకుండా నిధులను ఖర్చు చేయడంతో అప్పటి కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఎంబుక్ ప్రకారం చేసిన పనులు వాస్తవంగా లేవనేది అభియోగం. అచ్యుతాపురం పంచాయతీలో చేసిన పారిశుద్ధ్య పనులకు, పెట్టిన బిల్లులకు పొంతన లేదని విచారణలో గుర్తించారు.

వేమగిరి పంచాయతీలో రూ.లక్షల బిల్లులు పెట్టడంపై రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ విచారణకు ఆదేశించడం గమనార్హం. నిధుల దుర్వినియోగంపై అప్పటి కార్యదర్శిని సరెండర్ చేశారు. కోరుకొండ మండలం బుచ్చింపేటలో చేయని పనులకు వోచర్లు పెట్టారనే దానిపై ఎంబుక్ రికార్డు ప్రకారం విచారణ పూర్తిచేశారు. కడియపులంక పంచాయతీ కార్యదర్శి మద్యం తాగి విధులకు వస్తూ పాలనాపరమైన వ్యవహారాల్లో దురుసుగా ఉంటున్నారని విచారణ చేసి అప్పట్లో విధుల నుంచి తొలగించారు. అప్పటి నేతలు అదే కార్యదర్శికి బిక్కవోలు మండలంలో పోస్టింగు ఇప్పించారు.

**నలుగురు కార్యదర్శుల సస్పెన్షన్**

జిల్లాలో వివిధ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ఇప్పటికే నలుగురు కార్యదర్శులతోపాటు ఒక బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేశాం. రఘుదేవపురం పంచాయతీలో నిధులను రికవరీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. ఆరోపణలు వచ్చిన చోట విచారణ చేస్తూ, ఆయా పంచాయతీల్లో ఈవోపీఆర్డీ, ఎంపీడీవోలు కౌంటర్ సైన్ చేసేలా ఆదేశాలిచ్చాం. శాంతామణి, డీపీవో

# వసతిలో 'కుర్ర'పెత్తనం

కర్నూలు : "వసతి గృహాల్లో 'కుర్ర'కారు పెత్తనం చేస్తోంది. కోడుమూరు సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఓ విద్యార్థిని మరొక విద్యార్థి బెల్టుతో కొట్టిన ఘటన కలకలం సృష్టించింది. పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఏడు, ఎనిమిది తరగతి చదువుతున్న విద్యార్థులను దారుణంగా కొట్టారు."ఇలా వసతి గృహాల్లో 'కుర్ర'కారు పెత్తనం చేస్తోంది. విద్యార్థులను కంటికి రెప్పలా చూడాల్సిన సంక్షేమాధికారులు సంతకాలకే పరిమితమయ్యారు.. ఉదయం వచ్చి ఆ రోజుకు సంబంధించి సరకులిచ్చి సంతకం చేసి వెళ్తున్నారు. నిర్వహణ బాధ్యతలు వంట సిబ్బంది, పెద్ద తరగతి విద్యార్థులకు అప్పగిస్తున్నారు. వారు చిన్న తరగతుల విద్యార్థులను భయపెడుతున్నారు. కోడుమూరు సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో 103 మంది విద్యార్థులున్నారు. రాత్రివేళ ఎవరూ లేకపోవడంతోనే ఘటన జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకొచ్చారు.

వసతి గృహ సంక్షేమాధికారులు ఎల్లవేళలా విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. భోజనం తయారీ మొదలు అన్నీ దగ్గరుండి చూసుకోవాలి. కానీ చాలా మంది జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారు. నిర్వహణ అంతా ఫోన్లో నడిపిస్తున్నారు. రాత్రి వేళ కనీసం సిబ్బంది కూడా ఉండటం లేదు. ఘటన జరిగిన వసతి గృహంలో ఏడాది



కిందట రాత్రి కాపలాదారు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో రాత్రి సమయాల్లో ఎవరూ లేకపోవడంతో విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకునే పరిస్థితి ఉండటం లేదు. ప్రభుత్వం ఇచ్చే డైట్ ఛార్జీలను వార్డెన్లు భారీ ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు.

కర్నూలులోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగిని వసతిగృహంలోని సరకులు బయటకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఆమెను సస్పెండ్ చేశారు. బీసీ సంక్షేమశాఖ కళాశాల బాలుర వసతిగృహంలో విద్యార్థుల సంఖ్యకు పొంతన లేకపోవడం తదితర కారణాలతో వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. పెద్దపాడు బీసీ సంక్షేమశాఖ ప్రీ-మెట్రిక్ వసతిగృహంలో ఉన్నతాధికారులు తనిఖీ చేయగా అక్రమాలు తేలడంతో వార్డెన్‌ను సస్పెండ్ చేశారు.

**విచారణ చేపట్టిన అధికారులు**

ఘటన విషయం తెలుసుకొన్న జిల్లా విద్యాధికారి శామ్యూల్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రంగలక్ష్మీదేవి, సీఐ తబ్రేజ్, ఎస్సై శ్రీనివాసులు వసతి గృహానికెళ్లి విచారణ చేపట్టారు. దాడి ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నాం.. ఏడో తరగతి విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం.. దాడికి దిగిన పదో తరగతి విద్యార్థిని మానసిక వైద్య నిపుణులకు చూపించినట్లు సీఐ తెలిపారు.దాడికి పాల్పడిన విద్యార్థిని ఓ నాయకుడు చెప్పడంతో చేర్చుకొన్నాం.. ఆ నాయకుడు గతంలో రాత్రి కాపలాదారుగా అనధికారికంగా విధులు నిర్వర్తించేవారు.. అప్పట్లో ఉన్న వసతిగృహ రాత్రి కాపలాదారుగా అనధికారికంగా ఆ నాయకుడికి కొంత సొమ్ము ఇచ్చి విధులు చేయించేవారు. తర్వాత వాచ్‌మెన్ బదిలీపై వెళ్లటంతో నాయకుడికి దిక్కుతోచ లేదు. తనను వాచ్‌మెన్‌గా పెట్టుకోవాలని రూ.10 వేలు ఇవ్వాలంటూ తనను డిమాండ్ చేసేవాడని వసతిగృహ అధికారి తెలిపారు.

# పల్లె గుమ్మంలో జల తరంగిణి

నంద్యాల : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో జల సంరక్షణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్లె పుష్కరిణి పేరుతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 చెరువులను ఎంపిక చేయాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో తటాకానికి రూ.5 లక్షలు కేటాయించనున్నారు. ఏప్రిల్ 7వ తేదీలోగా గ్రామ సభల్లో ఆమోదం తెలిపి వెంటనే పనులు ప్రారంభించనున్నారు. జూన్ 30వ తేదీలోగా రెండు జిల్లాల్లో పనులు పూర్తిచేసి చెరువులను వర్షంనీటితో



నింపనున్నారు.

**దిగుడు బావులకు మహర్దశ**

గ్రామాల్లోని పురాతన దిగుడు బావుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. గతంలో తాగునీటి అవసరాలను తీర్చిన ఈ బావులు కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్నాయి. వినియోగంలో లేవు. వీటిని మళ్లీ వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు ఆలయాల్లోని కోనేర్లను కూడా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఉపాధిహామీ పథకం కింద దిగుడు బావులు, కోనేర్లలో పూడిక తీయిస్తారు. దెబ్బతిన్న మెట్లను బాగుచేస్తారు. వీటి చుట్టూ కొబ్బరి మొక్కలు నాటనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో గ్రామాల వారీగా పురాతన బావులు, కోనేర్ల వివరాలు సేకరించాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# ప్రభుత్వ బడికి పీఎంసిరి

చాగలమర్రి : నూతన విద్యా విధానం అమలులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్న బోధన విధానాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిపెట్టాయి. పీఎంశ్రీ పథకం కింద రెండు విడతలుగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసింది. జిల్లాలో 40 పాఠశాలలు ఎంపిక చేశారు.. తొలి విడత రూ.6.54 కోట్లు, రెండో విడత రూ.4.4 కోట్లు మంజూరయ్యాయి. ఎంపికైన పాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఎంపికైన పాఠశాల్లో తొలి విడతలో 4 సైన్స్ ల్యాబ్‌లు రూ.44లక్షలతో చేపట్టారు. 28 పాఠశాలల్లోని మైదానాల్లో రూ.1.15 కోట్లతో క్రీడా కోర్టుల నిర్మాణాలు పూర్తయ్యాయి. తొలి విడతలోని 25 పాఠశాలల్లో ర్యాంపులు నిర్మించారు. సోలార్ ప్యానల్, ఇంకుడు గుంతల పనులు మినహా.. మిగిలిన పనుల నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండో విడతలో ఆర్వో ప్లాంటు, ల్యాబ్ నిర్మాణాలు తదితర పనులు కొనసాగుతున్నాయి.

# ఊపిరి..ఆడట్లేదు



తిరుపతి : చంద్రగిరి మండలానికి చెందిన పూర్ణిమ శ్వాస సమస్యతో రుయా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. వైద్యులు పరీక్షించి సమస్యను గుర్తించారు. నిత్యం పూజగదిలో అగర్‌బత్తీలు వెలిగించడం.. ఆ పొగను పీల్చడంతో శ్వాస సమస్యకు గురైనట్లు గుర్తించారు.

తిరుపతికి చెందిన సంపూర్ణ శ్వాస తీసుకోవడం కష్టంగా మారడంతో వైద్యులను సంప్రదించారు. ఇరుకు వంటగదిలో లీకైన గ్యాస్ తరచూ పీల్చడంతో శ్వాస సమస్య వచ్చినట్లు గుర్తించారు. ప్రస్తుతం మందులు వాడకంతోపాటు కిటికీ తెరుచుకోమని వైద్యులు సలహా ఇచ్చారు.

దుమ్ము, ధూళి, పొగ పీల్చేవారిలో ఊపిరితిత్తుల సమస్యలు సహజం. ఈ వ్యాధుల బారినపడే వారిలో ఎక్కువగా పురుషులే ఉంటారు. కానీ ఇటీవల మహిళలు శ్వాస సమస్యలతో వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రతి పదిమందిలో ఇద్దరు ముగ్గురు ఉంటున్నారు. మహిళలు ఈ వ్యాధుల బారినపడటానికి జన్యుపర సమస్యలుగా మొదట గుర్తించిన వైద్యులు.. రోగుల సంఖ్య పెరగడంతో పలు పరీక్షలు చేసి కారణాలు గుర్తిస్తున్నారు.

**కారణాలిలా..**

గాలి పెద్దగా సోకని పూజగదిలో అగరబత్తీలు, సాంబ్రాని కడ్డీలు వెలిగించి మహిళలు పూజలు చేస్తుంటారు. ధారాళంగా కమ్ముకునే పొగను పీల్చుతూ అలాగే ఉండిపోవడం.. కొంతకాలం కొనసాగించడంతో శ్వాస సమస్యలు వస్తున్నట్లు గుర్తించారు. అలాగే వంటగదిలో లీకైన గ్యాస్‌ను దీర్ఘకాలం పీల్చుతూ ఇబ్బంది పడుతున్నారు.

ఏసీ, కూలర్ల ఫిల్టర్లను తరచూ శుభ్రం చేయకపోవడంతో వాటిని ఆన్ చేయగానే వచ్చే దుమ్ము, ధూళి ముక్కు ద్వారా లోపలికి ప్రవేశించి ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతోంది. గదుల్లో అతిశీతల వాతావరణంతో మరిన్ని సమస్యలు ఎదురవుతున్నాయి.

ఇరుకు గదిలో పరిమితికి మించి నివసించడంతో తగినంత గాలి, వెలుతురు లేకపోవడంతో ఆక్సిజన్ శాతం తగ్గిపోయిన ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు వస్తున్నాయి.

ఐస్‌తో కూడిన జ్యూస్‌లు, చెరకు రసం తాగడంతో మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధి పీడితులు ఇబ్బందులు పడుతుంటారు.

వాహన, పరిశ్రమల కాలుష్యం.. వేస్ట్ డిస్పోజబుల్ కాల్చగా వచ్చే పొగను పీల్చడంతోనూ సమస్యలు ఎదురవుతున్నాయి.

అందుకే పని ప్రదేశాల్లో దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం లేకుండా చూసుకోవాలి. వంట గదిలో నాణ్యమైన పూజాసామగ్రి వినియోగించాలి.

**లక్షణాలు ఇలా..**

నాలుగైదు రోజులు దగ్గు, జ్వరం తగ్గకపోవడం. రక్తంతో గళ్ల పడటం. పక్కటెముకలు ఒకవైపు నొప్పి రావడం. శ్వాస తీసుకోవడానికి కష్టపడటం. మేలుకున్నా పిల్లికూతలు వినిపించడం వంటి లక్షణాలు ఉంటే ఊపిరితిత్తుల వైద్యులను సంప్రదించాలి.

బాధితుల సంఖ్య పెరిగింది తరచూ ఊపిరి ఆడటం లేదని ఆస్పత్రులకు వచ్చే మహిళల సంఖ్య పెరిగింది. పూజ, వంట గదుల్లోకి గాలి వచ్చివెళ్లేలా కిటికీలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు అమర్చుకోవాలి. ఊపిరి సడలని విధంగా పొగను బంధించకూడదు. దుమ్ము, ధూళి, పొగలకు దూరంగా ఉండాలి. వీలైనంతగా వాహన వినియోగం తగ్గించి వాయుకాలుష్యం నియంత్రించడం, నిబంధనలు పాటించి పరిశ్రమల కాలుష్యం తగ్గించడం, జనసంచారం లేని ప్రదేశాల్లో వ్యర్థాలు కాల్చడంతో తీవ్రత తగ్గించవచ్చు.సుబ్బారావు, ఊపిరితిత్తుల విభాగాధిపతి, రుయా ప్రభుత్వ ఆస్పత్రి

# స్టార్టప్‌లకు ఊపిరి



విశాఖపట్నం : సాంకేతికతతో కొత్త సవాళ్లను పరిష్కరించేలా.. స్టార్టప్ స్థాపించాలనుకునేవారికి అవకాశాలు కల్పించేలా.. 'ఇన్నోవేషన్, స్టార్టప్ పాలసీ(4.0)'ని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఈ పాలసీ 2024-2029 వరకు అమలవుతుందన్నారు. స్టార్టప్‌లు ఏర్పాటుకు, ఉన్నవాటిని విస్తరించడానికి అనువైన నగరాల జాబితాలో విశాఖ ఒకటి. సాగరతీరంలో ఐటీ హిల్స్‌లో తెదేపా హయాంలో 50వేల చదరపు అడుగుల్లో స్టార్టప్ విలేజ్ పేరుతో 'ఇన్నోవేషన్ వ్యాలీ' భవనాన్ని నిర్మించారు. అందులో పెద్ద సంఖ్యలో స్టార్టప్స్ అక్కడ ఉండేవి. వైకాపా అధికారంలోకి వచ్చాక దాదాపు అన్నీ మూతపడ్డాయి

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్స్ (ఆర్‌టీఐ) కింద రాష్ట్రంలో ఐదు జోన్లు, ఒక హబ్ ఏర్పాటు చేయనున్నారు. ఇంక్యుబేషన్ కేంద్రాలు, స్టార్టప్‌లకు ఉచిత సీట్లు ఇక్కడ ఇస్తారు. ఈ కేంద్రాల్లో చేరేవారందరికి స్టార్టప్ పాలసీలో ప్రకటించిన అన్ని ప్రోత్సాహకాలకు అర్హులే అవుతారు.

ఈ పాలసీ రాష్ట్రాన్ని భారతదేశపు సిలికాన్ వ్యాలీగా మార్చే దిశగా ఒక సహసోపేతమైన అడుగు. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్లు 20వేల స్టార్టప్‌ల లక్ష్యం బాగున్నాయి. ఈ విధానం ప్రతిభ, మూలధనానికి అయస్కాంతంగా ఉంటుంది. ఏపీని స్టార్టప్ గమ్యస్థానంగా మారుస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఇతర బృందానికి ధన్యవాదాలు.

కొసరాజు శ్రీధర్, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ కన్వీనర్.

దేశంలోనే అద్భుతమైన పాలసీ ఇది. దీనివల్ల చాలా స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయి. గత ఐదేళ్లు ఏ పాలసీ క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఈ పాలసీ ఆచరణలోకి వచ్చి ప్రకటించిన ప్రోత్సాహకాలు సకాలంలో అందిస్తే ఏపీ ప్రగతిపథంలో నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుంది.

ఓ.నరేష్‌కుమార్, రుషికొండ ఐటీ పార్కు ఉపాధ్యక్షులు.

# ఇది నిజం.. ఆక్రమణే ప్రతి గజం



విశాఖపట్నం : చినముషిడివాడలోని శారదాపీఠం అక్రమాలు తవ్వేకొద్దీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటీవల రెవెన్యూ అధికారుల సర్వేలో 22 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. తాజాగా మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు మరికొన్నింటిని నిర్ధారించారు. ఆక్రమణకు కాదేది అనర్హమన్నట్లు రోడ్డును సైతం ఇక్కడ ఆక్రమించేశారు. సామాజిక అవసరాలకు వినియోగించాల్సిన స్థలాలను కబ్జా చేసి కట్టడాలు నిర్మించినట్లు బయటపడింది. వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్‌కు శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి రాజగురువు తరహాలో వ్యవహరించారు. దీంతో పీఠానికి సెక్యూరిటీ మొదలుకొని అన్ని రకాలుగా ప్రభుత్వ ప్రొటోకాల్ సేవలను అనుభవించారు.

**గుర్తించిన ఆక్రమణలు ఇవే..**పీఠం ఆవరణలో 203 చదరపు గజాల్లోని స్వయం జ్యోతి మండపంలో 13 గజాల స్థలం సర్వే సంఖ్య 90లో ఉంది. మిగిలిన స్థలం సర్వే సంఖ్య 91/9లోని వుడా లేఅవుట్కు(ఎల్‌పీ సంఖ్య 17/89) సంబంధించిన ఓపెన్ స్పేస్‌లో ఉంది..

190 చదరపు గజాల్లో నిర్మించిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం సర్వే సంఖ్యలు 91/1, 91/9లోని వుడా (వీఎంఆర్‌డీఏ) ఓపెన్ స్పేస్‌లో ఉంది.122 చదరపు గజాల్లోని గోశాల, 325 చదరపు గజాల్లోని సిబ్బందికి నిర్మించిన గృహాలు వుడా లేఅవుట్‌లోని ఖాళీ స్థలంలో నిర్మించారు. ఈ నిర్మాణాలన్నీ పీఠానికి పడమర వైపున్నాయి.

తూర్పు వైపు సర్వే సంఖ్యలు 90, 91/9లోని వుడా ఓపెన్ స్పేస్ స్థలంలో 743 చదరపు గజాల్లో శారదా చంద్రమౌళీశ్వరుల నిత్య పీఠ పూజ మందిరం ఉంది. అక్కడే ఆడిటోరియాన్ని నిర్మించారు.

సర్వే సంఖ్య 91/3లో 14 చదరపు గజాల్లో బావి, సర్వే సంఖ్య 91/3, 91/9లోని 43 చదరపు గజాల్లో కాలభైరవ స్వామి ఆలయం, సర్వే సంఖ్య 91/1, 91/9లో 80 చదరపు గజాల్లోని యాగశాల, సర్వే సంఖ్య 91/9లో 22చదరపు గజాల్లో దాసాంజనేయ స్వామి ఆలయం ఉన్నాయి.

సర్వే సంఖ్యలు 87/1, 90, 90/1, 91/3, 91/9లో ఓపెన్ స్పేస్‌లో 42 సెంట్లకుపైగా విస్తీర్ణంలో నిర్మాణాలున్నాయి.

# 18 నెలలుగా ఎదురుచూపులే!

గణపవరం : 'కాలువ గట్ల వెంబడి రోజుకు సుమారు 20 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. రబీలో వంతుల వారీ విధానంతో ఇంటికి ఎప్పుడు వెళ్తామో తెలియని పరిస్థితి. పద్దెనిమిది నెలలుగా వేతనాలు అందక ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఇంటి అవసరాలు, ద్విచక్ర వాహనానికి పెట్రోలు కోసమని అప్పులు చేయాల్సి వస్తోంది. రోజులు గడిచే కొద్దీ మార్కెట్లో అప్పులు ఇచ్చేవారూ కనిపించడం లేదు' అని గణపవరం సెక్షన్ లస్కర్ తురంగి సత్తిపండు ఆవేదన వ్యక్తం చేశారు.'ఒక నెల జీతం రాకుంటేనే ఇల్లు గడవదు. అలాంటిది 18 నెలలుగా వేతనాలందక ఇంటాబయటా నరకయాతన అనుభవిస్తున్నాం. ఈ పని మానేసి వేరొకటి చేద్దామంటే రబీ సీజన్ కావడంతో నిర్ణయం తీసుకోలేకపోతున్నాం' అని నిడమర్రు లస్కర్ ఇజ్జరోతు విష్ణుబాబు అన్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో పంట కాలువల నిర్వహణ విధులు నిర్వర్తించే ఒప్పంద లస్కర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జీతాల కోసం 18 నెలలుగా ఎదురుచూడటమే తప్ప వారి సమస్యను పట్టించుకున్న వారు లేరు. వేతనాలు రాక.. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక వారు ఆందోళనకు గురవుతున్నారు. అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదని, తమ పరిస్థితిని ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వారు ఆవేదన



చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో సమస్య పరిష్కారమవుతుందని ఆశపడుతున్నారు.

పని భారం మోస్తున్నా.. 2014కు ముందు రూ.6 వేలుగా ఉన్న లస్కర్ల జీతాలను అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.10,500గా నిర్ణయించి ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి వీరికి అవే వేతనాలు. ఏడాదిలో ఏప్రిల్, మే నెలల్లో జీతాలుండవు. అయినా కాలువలు, షట్టర్ల నిర్వహణ విధులు నిర్వహించాల్సి వస్తోంది. కాలువల్లో తూడు పేరుకున్నా బాగు చేసుకుని నీరు కిందకు వెళ్లేలా చేయాల్సి ఉంటుంది. పలు పోస్టులు ఖాళీలుగా ఉండటంతో ఆ పని భారాన్నీ మోస్తున్నామని వారు వాపోతున్నారు. 'వేతనాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. గత ప్రభుత్వ హయాంలో చేసిన విధులకు ఏ విధంగా ఇవ్వాలనే అంశంపై ఉన్నతస్థాయిలో చర్చ జరుగుతోంది' అని జలవనరుల శాఖ ఉండి డీఈ సత్యనారాయణమూర్తి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

లస్కర్ పోస్టులు: 309

దినసరి కూలీ కింద చేపట్టిన నియామకాలు: 208


పూర్తిస్థాయి లస్కర్లు: 30

ఖాళీ పోస్టులు: 71

# ప్రగతి ఏలూరు కావాలని..

ఏలూరు: సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది జిల్లాల వృద్ధి రేటును పరుగులు పెట్టించేందుకు కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు ఈ అంశంపై కసరత్తు పూర్తి చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ప్రతి రంగంలో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని సీఎంకు కలెక్టర్ నివేదించనున్నారు. దీనిని సాధించడానికి ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం, ఆయా రంగాల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సమగ్ర నివేదిక తయారు చేసి సీఎంకు సమర్పించనున్నారు

15 శాతం వృద్ధి దిశగా.. ఈ ఏడాది 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యానంలో ఆయిల్‌పామ్ విస్తీర్ణం ప్రస్తుతం 1.3 లక్షల ఎకరాలుంటే మరో 20 వేల ఎకరాలు పెంచనున్నారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా కోకో, కొత్త పంటలుగా డ్రాగన్ ఫ్రూట్ వంటివి 10 వేల ఎకరాల్లో అభివృద్ధి చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ప్రస్తుతం ప్రకృతి సాగు 30వేల ఎకరాల్లో ఉండగా ఈ ఏడాది మరో 5 వేల ఎకరాల్లో పెంచుతామని తెలిపారు.



ఔత్సాహికులను ప్రోత్సహించి కొత్త పరిశ్రమల ఏర్పాటు చేయనున్నారు. ఆక్వా, మామిడి, ఆయిల్‌పామ్ పంటలతోపాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఎగుమతుల్లో వృద్ధి సాధించనున్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ద్వారా ఏటా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయనున్నారు.

చేయూత కోరుతూ.. ప్రధానంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యల పరిష్కారం, రీ సర్వే త్వరిత గతిన పూర్తి చేయడం చేయనున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం పంట, మురుగు కాలువల్లో ఇంకా పూడికల తీత, గుర్రపుడెక్క తొలగింపు చేయలేదు. ఫలితంగా శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు. ఈ సమస్య పరిష్కరించాలని నివేదికలో విన్నవించారు. జిల్లాలో భూముల సారాన్ని బట్టి జిప్సం, బోరాన్, జింకు లోపాలు అధికంగా ఉన్నాయి. గతంలో తెదేపా సర్కారు రాయితీపై వీటి సరఫరా చేసేది..వైకాపా సర్కారు ఆ విధానాన్ని గాలికొదిలింది. మళ్లీ రాయితీపై ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు రైతులకు అవకాశం లేక రహదారులపై పోస్తున్నారు. మార్కెట్ యార్డు భూముల్లో ధాన్యం ఆరబెట్టుకునే ప్లాట్‌ఫాంలు ఇవ్వాలని కోరుతున్నారు.

# తగ్గిన నీటి లభ్యత.. పెరిగిన వినియోగం

పెద్దపల్లి : జిల్లాలో జల సిరులు ఉట్టి పడుతున్నాయి. వ్యవసాయం, పరిశ్రమలకు నీటిని తోడేస్తున్నా నీటి లభ్యత కాస్త మెరుగ్గానే ఉంది. జిల్లాలోని భూగర్భ జలాల లభ్యత ఎంత? వినియోగం, భవిష్యత్ తరాలకు ఎంత అవసరం అనే అంశాలపై భూగర్భ జల శాఖ 2023-24 ఏడాదికి సంబంధించి క్షేత్ర స్థాయిలోకి వెళ్లి నివేదిక రూపొందించింది. గతేడాదితో పోల్చితే భూగర్భ జలాల లభ్యత స్వల్పంగా తగ్గగా వినియోగం పెరిగింది. జిల్లాలోని 14 మండలాల్లో మంథనిలో 75 శాతంతో అధికం, ధర్మారంలో 35 శాతంతో అత్యల్పంగా నమోదైంది.

**ఇలా లెక్కిస్తారు**

భూగర్భ జల శాఖ భూగర్భంలోకి వచ్చే నీరు ఎంత? వినియోగం ఎంత అనే విషయాలను సేకరించింది.

14 ఏళ్ల వర్షపాతం, ఆనకట్టలు, చెరువులు, కుంటలు, జలాశయాల్లోని నీటి లభ్యతను లెక్కిస్తారుబోర్లు, బావులు, పరిశ్రమలు, తాగునీటికి ఎంత వాడుతున్నారో నమోదు చేస్తారు

అవసరాలకు ఎంత జలం ఖర్చు, మిగులు జలం ఎంత నిర్ధారిస్తారు



వ్యవసాయానికి అధికంగా వాడకం

జిల్లాలో 44,755 హెక్టా మీటర్లలో భూగర్భ జలాలు లభ్యం కాగా 20,311 హె.మీ నీరు ఖర్చవుతోంది. ఇందులో 17,608 హె.మీ సాగు కోసం వినియోగిస్తున్నారు. మానేరు, గోదావరి, హుస్సేన్‌మియా పరీవాహక ప్రాంతాల్లో బోర్ల సాయంతో నీటిని వాడుతున్నారు. 1,190 హె.మీ గృహ అవసరాలు, 1,512 హె.మీ పరిశ్రమలకు వినియోగిస్తున్నారు. గతేడాది గృహ అవసరాలకు 931 హె.మీ, పరిశ్రమలకు 795 హె.మీ, వ్యవసాయానికి 17,495 హె.మీ అంటే మూడు రంగాల్లో అధికంగా నమోదైంది.

**మంథనిలో సమస్యాత్మకం**

భూగర్భ నీటి లభ్యత ఆధారంగా వందలో 70 శాతంలోపు వాడకం ఉంటే సురక్షితం, 70-90 సమస్యాత్మకం, 90-100 అతి సమస్యాత్మకం, వంద శాతం వినియోగం దాటితే అత్యధిక వినియోగ జాబితాలో ఉంటుంది. జిల్లాలోని మంథని 75 శాతంతో సమస్యాత్మకంగా ఉంది. గోదావరి పరీవాహక ప్రాంతమైన మంథనిలో నీటిని అవసరాలకు మించి తోడేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. సమస్యాత్మక ప్రాంతాల్లో బోర్ల నిషేధం, వాటర్‌షెడ్ వంటి చైతన్య కార్యక్రమాలు చేయడంతో జిల్లాలో భూగర్భ జలాలు వృద్ధిలోకి రావడం ఊరటనిస్తోంది.

# మాడ వీధుల విస్తరణకు వేళాయె..

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం మాడవీధుల విస్తరణకు అడ్డంకులు తొలగాయి. రూ.60.20 కోట్లను మంజూరు చేస్తున్నట్లు కొద్ది నెలల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించటంతో నిర్వాసితులతో అధికారులు పలు దఫాలు చర్చలు జరిపారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సర్వే పూర్తిచేశారు. సుమారు 46 కుటుంబాలకు పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. మాడవీధులకు అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగించి గృహ యజమానులకు పరిహారం ఇచ్చేందుకు లెక్కలు కట్టారు. గరిష్ఠంగా సుమారు రూ.3కోట్లు, కనిష్ఠంగా రూ.కోటి వరకు పరిహారం అందించాల్సి ఉంటుందని సమాచారం. నిర్వాసితులకు బ్రిడ్జి సెంటర్‌లోని ప్రభుత్వ స్థలాన్ని అప్పగించి అందులో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇదే రూ.60.20 కోట్లలోని కొంత మొత్తాన్ని వెచ్చించనున్నారు.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష**

ఇప్పటివరకు కాగితాలకే పరిమితమైన నిధులు త్వరలో అధికారిక



ఖాతాలో జమకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, దేవాదాయశాఖ కొండా సురేఖ సమక్షంలో దేవాదాయశాఖ అధికారులు హైదరాబాద్‌లో ఆదివారం సమావేశమైనప్పుడు ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించి నిధులు ఇచ్చేందుకు అంగీకరించినట్లు తెలిసింది. శ్రీరామనవమికి ముఖ్యమంత్రి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొచ్చి అదేరోజు మాడవీధుల విస్తరణ పనులు ప్రారంభిస్తారని ఇక్కడి అధికారులకు మౌఖికంగా సమాచారం అందింది. నిర్వాసితుల్లో ఇంకెవరికైనా అభ్యంతరాలు ఉంటే వారితో ఆర్డీఓ దామోదర్‌రావు సమావేశమై ప్రభుత్వ ఉద్దేశాన్ని వివరించనున్నారు. మాడవీధుల విస్తరణ పూర్తయితే రామాలయ బృహత్తర ప్రణాళికకు రూ.వందల కోట్ల నిధులను ప్రభుత్వం సమకూర్చనుందని సమాచారం. ఇదే జరిగితే దక్షిణ అయోధ్య భద్రాచలం కూడా యాదగిరిగుట్ట తరహాలో అభివృద్ధి చెందుతుంది.

**హరనాథ్‌బాబా ఆలయానికి రక్షణ గోడలు అవసరం**

మాడవీధులను విస్తరించటం వల్ల సుమారు ఎకరం స్థలం అదనంగా రామాలయానికి స్వాధీనమవుతుంది. మాడవీధులకు ఆనుకుని దేవాదాయశాఖకు చెందిన హరనాథ్‌బాబా ఆలయం ఉంది. 46 ఇళ్లను స్వాధీనం చేసుకునేటప్పుడు యంత్రాలను ఉపయోగించక తప్పదు. ఆ సమయంలో గుట్ట కిందిభాగంలో దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలి. గతేడాది వర్షాలకు ఈ ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం కూలిపోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని హరనాథ్‌బాబా ఆలయం చుట్టూ రక్షణ గోడలు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

# ఏఐ అడుగులు.. బడులకు కంప్యూటర్లు



కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సామర్థ్యాల పెంపుపై కొంతకాలంగా ప్రభుత్వాలు దృష్టి నిలిపాయి. ఇందుకోసం సులభతరమైన అనేక పద్ధతులను అమలుచేస్తున్నా.. ఫలితాలు ఆశించిన మేర రావడంలేదు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లోని బాలలు భాష, గణితంలో సామర్థ్యాలను చాటడంలో వెనుకబడిపోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కృత్రిమ(ఏఐ) బోధనను అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రాథమిక తరగతుల్లో 50 మందికిపైగా విద్యార్థులున్న బడులకు అయిదేసి కంప్యూటర్లను అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. జూన్ 1 నాటికి పాఠశాలల్లో వాటిని ఏర్పాటుచేస్తూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కృత్రిమ బోధన చేపట్టనున్నారు.

**ఫలితమివ్వని తొలిమెట్టు**

జిల్లాలో మొత్తం ప్రాథమిక పాఠశాలలు 427 ఉండగా వాటిలో 11,866 మంది.. ప్రాథమికోన్నత పాఠశాలలు 76 ఉండగా అందులో 2794 మంది విద్యార్థులున్నారు. ప్రాథమిక తరగతుల్లో ఆంగ్లాన్ని చదవడంలో, గణితంలో చతుర్విధ ప్రక్రియలను చేయడంలో వెనుకబడిపోతున్నారు. మూడేళ్లుగా ఈ పరిస్థితిని అధిగమించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నా.. ఆశించిన రీతిలో ఫలితంలేదు. వివిధ సర్వేల్లోనూ 50 శాతానికి మించి సామర్థ్యాలు బాలలు చాటడం లేదనే తేలింది.

**ఉపాధ్యాయులకు శిక్షణ..**ఏఐ బోధనకు కంప్యూటర్లను అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 50 మందికి పైగా విద్యార్థులున్న 69 పాఠశాలలకు ఈ అవకాశం దక్కనుంది. ఇందులో ప్రాథమికోన్నత బడులు 8 ఉండగా, ప్రాథమిక పాఠశాలలు 61 ఉన్నాయి. ఒక్కో బడికి అయిదు కంప్యూటర్లు, అంతర్జాల సౌకర్యాన్ని విద్యాశాఖ అందించనుంది. దీనికి తోడు వచ్చే విద్యా సంవత్సరం నుంచి 1-5 తరగతులకు ఇంటిగ్రేటెడ్ గణితాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు.

**సదుపాయాలు మెరుగైనా..**

ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు మెరుగైనా ప్రవేశాలు పెరగకపోవడంతో ఈ పరిస్థితిని అధిగమించే కార్యాచరణను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఎంపిక చేసిన 18 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐ ద్వారా సామర్థ్యాలను పెంచేందుకు ఏక్ స్టెప్ సంస్థ సహకారంతో బోధన ప్రక్రియను ప్రారంభించారు.

ఈ నెల 15 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియతో బాలలు చదవడం, రాయడం, గణితంలో కొంత సామర్థ్యాలను చాటుకుంటారని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఇప్పటికే కృత్రిమమేధ ఆధారిత టూల్స్‌తో చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియలను చేయడం వంటివి నేర్చుకుంటున్నారు.

# ధాన్య లక్ష్ములు!



సిరిసిల్ల : మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడం.. వారికి ఆసక్తి ఉన్న వ్యాపారంలో ప్రోత్సహించడంతో కొద్ది మందికే ప్రయోజనం జరుగుతుంది. వీరిని మరింత ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ యాసంగిలో సాధ్యమైనన్నీ ఎక్కువ ధాన్యం కొనుగోలు కేంద్రాలను అప్పగించనున్నారు.

**2006లో ప్రారంభం**

ఐకేపీ కొనుగోలు కేంద్రాలు 2006లో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ 283 కొనుగోలు కేంద్రాలున్నాయి. దీనికోసం పౌరసఫరాలశాఖ ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాలన్నింటినీ ఐకేపీకీ బదిలీ చేయనున్నారు. దీంతో ఇప్పటికే సిరిసిల్లలో 133, కరీంనగర్‌లో ఒకటి, పెద్దపల్లిలో 25 కేంద్రాలు పెరగనున్నాయి. జగిత్యాల జిల్లాలో ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. దీని తర్వాత కేంద్రాల్లోని ధాన్యం రైస్ మిల్లులకు కేటాయిస్తారు. ఏప్రిల్ మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

**రెండు నెలలు.. రెండువేల మందికి ఉపాధి**

ఉమ్మడి జిల్లాలో 47,318 మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ యాసంగి నుంచి దాదాపు 442 కొనుగోలు కేంద్రాల్లో వీరు ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ఒక్కో కేంద్రంలో బుక్ కీపర్, సభ్యురాలు, తేమశాతం చూడటం, సీఏ కలిసి మొత్తం ఐదుగురు బాధ్యతలు చూసుకుంటున్నారు. ఇలా 2,210 మంది మహిళలకు రెండు నెలలపాటు ఉపాధి లభించనుంది. ప్రభుత్వం క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్‌ను సంఘాలకు అందిస్తుంది.

**స్థిరాస్తులు కూడబెడుతూ..**రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా మహిళా సమాఖ్య బలోపేతానికి చర్యలు చేపట్టింది. 44 కొనుగోలు కేంద్రాల నుంచి ఈ యాసంగిలో 177కు చేరుతున్నాయి. ఏడేళ్లలో ధాన్యం కొనుగోలు చేసి రూ.9.87 కోట్ల కమీషన్‌ను పొందారు. వీటిలో 90 శాతం గ్రామైక సంఘాలు, 10 శాతం జిల్లా సమాఖ్యలకు జమ చేస్తున్నారు. ఇప్పటికే పదిర, గూడెం, కోనరావుపేట, కొండాపూర్, లింగన్నపేట, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో సొంతంగా కొనుగోలు కేంద్రాలకు స్థలాలు కొనుగోలు చేశారు. మరికొన్ని చోట్ల మార్కెటింగ్‌శాఖ భాగస్వామ్యంతో గోదాములు నిర్మించారు.

# కర్షకుల కన్నీటికి కారకులెవరు?

చొప్పదండి : చొప్పదండి మండలంలోని మెట్ట ప్రాంతాల చెరువులు, కుంటల్లో నీరు అడుగంటిపోతుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని కాట్నపల్లి, సాంబయ్యపల్లి, మల్లన్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాల్లోని చెరువుల్లో నీటిమట్టం తగ్గుముఖం పడుతుంది. దీంతో ఎన్నో ఆశలతో రైతులు వేసుకున్న పంటలు ఎండిపోతుండటంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. కనీసం పెట్టుబడి డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

**పూర్తి కాని కాలువల నిర్మాణాలు**

మండలంలోని ఆయా గ్రామాల మీదుగా ఎస్సారెస్పీ ప్రధాన కాలువ ఉన్నప్పటికి.. ఆయా పల్లెల్లోని చెరువులు, కుంటల్లోకి దశాబ్దకాలంగా సాగు నీరందని పరిస్థితి. గుమ్లాపూర్ గ్రామానికి కూతవేటు దూరంలో లక్ష్మీపూర్ పంపుహౌజ్ ఉన్నప్పటికి నీరు అందడంలేదు. ఇందుకు ప్రత్యామ్నాయంగా మోతే కాలువల నిర్మాణం చేపడుతున్నారు. అయితే ఇంకా తవ్వకం దశలోనే ఉన్నాయి.

రూ.2 లక్షల వరకు నష్టం

నేను మా సోదరుడు కలిసి రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న, ఎకరంన్నరలో వరి సాగు చేశాం. ఇందుకోసం సుమారు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాం. మొక్కజొన్న కంకులు వేసే దశలో నీరు లేక సగం వరకు ఎండిపోయింది. వరి పొట్ట దశలోనే చేతికందకుండా పోయింది. దీంతో చేసేదేమి లేక పంటను వదిలేశాం.



కోలపూరి శ్రీనివాస్, గుమ్లాపూర్

చెరువులు నింపేలా చూడాలి

గుమ్లాపూర్ గ్రామ శివారులో మూడెకరాల్లో పొలం, రెండెకరాల్లో మొక్కజొన్న వేశా. సుమారు రూ.1.80 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. కంకి కాసే దశలో, పొలం నాటువేసిన కొద్ది రోజులకే నీరు సరిపోక పూర్తిగా ఎండిపోయాయి. గ్రామంలోని చెరువులో నీరు లేకపోవడం, బావుల్లో సైతం భూగర్భజలాలు పడిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువులు, కుంటలు నింపేలా చర్యలు తీసుకోవాలి. కచ్చు లింగయ్య, రైతు

# ఇసుక బజారులో.. బేజారు ఉండదిక..!

కొత్తగూడెం : వినియోగదారులకు నాణ్యమైన ఇసుకను అందుబాటు ధరకు అందించి.. రాష్ట్ర ఖజానాకు అధికాదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఇసుక(శాండ్) బజార్లు ఏర్పాటుచేయాలని భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో వీటిని నెలకొల్పగా.. త్వరలోనే జిల్లాల్లోని ప్రధాన పట్టణాల్లో అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇసుక పాలసీ సంస్కరణల్లో భాగంగా ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో అవసరమున్నచోట సబ్ స్టాక్ యార్డులను ఏర్పాటుచేసి తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహించింది. ఖమ్మంలో నెలకొల్పిన సబ్ స్టాక్ యార్డు కొన్నాళ్లకే మూతపడింది. వీటి స్థానంలో ఇసుక బజార్లు వస్తే సామాన్యులకు సైతం ఇసుక అందుబాటులోకి రానుంది.

**దారితప్పుతోందిలా..**



వేసవి నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. అందుకు తగ్గట్టుగానే మార్కెట్‌లో ఇసుకకు డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది.. ఇసుక అక్రమ రవాణాకు తెరలేపుతున్నారు. గోదావరి నదితో పాటు ఇతర ఉపనదుల నుంచి రోజువారీగా కొన్ని వేల టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ఇసుక ధరలకు రెక్కలు రావటంతో వినియోగదారులు గగ్గోలుపెడుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ధనం ఇసుకాసురుల జేబుల్లోకి వెళ్తోంది. భద్రాద్రి జిల్లాలో ఈఏడాది ప్రభుత్వం మూడు క్వారీలను మాత్రమే ఏర్పాటుచేయటం, ఖమ్మంలో నాలుగు రీచ్‌లే ఉండటంతో నదుల్లో నుంచి ఇసుక పెద్దఎత్తున అక్రమంగా తరలిపోతోంది.

**ఇవిగో ఉపయోగాలు**

జిల్లా కేంద్రంలో ఇసుక బజారు ఉండటం వల్ల స్థానిక నిర్మాణ సంస్థలు, గృహనిర్మాణ యజమానులు, చిన్న వ్యాపారులకు ఇసుక సులభంగా దొరుకుతుంది.ప్రభుత్వ ఆధీనంలో ఉండటం ద్వారా అధిక ధరల సమస్య తగ్గుతుంది. అక్రమ తవ్వకాలు, అమ్మకాలు నియంత్రణలోకి రావటంతో ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది.

స్థానికంగా శ్రామికులు, డ్రైవర్లు, లోడింగ్-అన్ లోడింగ్ సిబ్బందికి ఉపాధి లభిస్తుంది.

అక్రమ తవ్వకాలను నియంత్రించడం ద్వారా నదీతీరాలు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం తగ్గుతుంది.

ఇసుక బజార్ల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు. అన్ని జిల్లా కేంద్రాల్లో స్టాక్ యార్డులు ఏర్పాటుచేయటం వల్ల ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇసుక అందుబాటులో ఉంటుంది. ప్రజలు నేరుగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి ఇసుక కొనుగోలు చేయటం వల్ల సర్కారుకూ ఆదాయం పెరుగుతుంది. శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం

# మళ్లీ.. అదే దోపిడీ!

చింతకాని : ఆరుగాలం ఇంటిల్లిపాది శ్రమించి పంట పండించినా.. విక్రయించే సమయానికి ధర అమాంతం తగ్గుముఖం పడుతుండటంతో మొక్కజొన్న రైతులు కుదేలవుతున్నారు. వారం క్రితం బహిరంగ మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్న రూ.2,300-2,400 ఉండగా ప్రస్తుతం రూ.2,050కు చేరుకుంది. జిల్లాలో యాసంగిలో మొక్కజొన్న సాగుకు వాతావరణం అనుకూలించింది. బోర్లు, బావులు, సాగర్ ఆయకట్ట పరిధిలో 65,473 ఎకరాల్లో పంటను వేశారు. పది రోజులుగా దిగుబడి చేతికొస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవటంతో రైతులు బయట వ్యాపారులు, దళారులకు క్వింటా రూ.2,050కే విక్రయిస్తున్నారు. గత వారంతో పోల్చితే రూ.300వరకు నష్టపోతున్నారు. సగటున ఎకరాకు 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా.. జిల్లాలో 23లక్షల క్వింటాళ్ల మొక్కజొన్న ఉత్పత్తి కానుంది. ఇదే ప్రకారం కొనుగోళ్లు జరిగితే జిల్లావ్యాప్తంగా రూ.68.74 కోట్లు నష్టపోవాల్సి వస్తోంది. మార్క్‌ఫెడ్ ద్వారా సర్కారు గతంలో క్వింటా రూ.2,225కు



కొనింది. ఆ లెక్కన కొన్నా రూ.200మేర ఊరట లభిస్తుంది. కేంద్రాల ఏర్పాటు వారం పది రోజులు ఆలస్యమైనా రైతులు భారీగా నష్టపోతారు. ఇంకోపక్క దళారులు గతేడాది పెద్ద మొత్తంలో మొక్కజొన్న కొని డబ్బులు చెల్లించకుండా ఉడాయించిన ఘటనలున్నాయి. మార్క్‌ఫెడ్ డీఎం సునీత మాట్లాడుతూ మొక్కజొన్న రవాణాకు ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. టెండర్లు పూర్తికాగానే ఉన్నతాధికారుల సూచనల మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు చాదరాసిపల్లి ఉపేందర్. చింతకాని మండలం నాగులవంచకు చెందిన ఉపేందర్ యాసంగిలో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశారు. పంటను హార్వెస్టర్ ద్వారా నూర్పి వారం క్రితమే కల్లాల్లో ఆరబెట్టారు. గత వారంతో పోల్చితే క్వింటాకు రూ.300 మేర తగ్గిపోవటంతో ఏం చేయాలో పాలుపోవటం లేదు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినట్టు, మార్క్‌ఫెడ్ కొనుగోలు వెంటనే ప్రారంభించాలని వేడుకుంటున్నారు.

చురకలు



## మృణాల్ అనుకోని అతిథికి హాయ్..!

'సీతారామం' బ్యూటీ మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం అడవి శేష్‌తో కలిసి 'డెకాయిట్' సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. తెలుగులో మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. అయితే హిందీలో మాత్రం ఈమె దాదాపు అర డజను సినిమాలు చేస్తుంది. అందులో కొన్ని షూటింగ్ దశలో ఉంటే కొన్ని చర్చల దశలో ఉన్నాయి. రాబోయే ఏడాది కాలంలో నాలుగు అయిదు సినిమాలతో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకు వచ్చేంత బిజీగా ఉంది. వరుస సినిమాలతో బిజీ బిజీగా ఉన్న మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. మరోసారి తన ఫోటోను షేర్ చేయడం ద్వారా ఈ అమ్మడు వార్తల్లో నిలిచింది. ఈసారి తన క్లోజప్ ఫోటోను షేర్ చేసి ఫేస్ పై ఉన్న మొటిమను చూపించింది. సాధారణంగా హీరోయిన్స్, సెలబ్రిటీలు మొటిమలను దాచేందుకు శథవిధాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అలాంటిది మృణాల్ ఠాకూర్ తన మొటిమను చూపించడంతో పాటు, ఆ మొటిమకు హాయ్




అంటూ ఫన్నీ పోస్ట్‌ను షేర్ చేసింది. హాయ్ పింపుల్, నువ్వు వెళ్లేది ఎప్పుడు..? నాకు త్వరలోనే షూట్ ఉంది అంటూ స్మైల్ ఈమోజీలను షేర్ చేసింది. కనిపించి కనిపించకుండా ఉన్న ఆ మొటిమను గురించి ఆందోళన చెందకుండా చాలా సింపుల్‌గా ఆ మొటిమకు సంబంధించిన విషయాన్ని తీసుకున్న మృణాల్ ఠాకూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. చాలా మంది అమ్మాయిలు ఒక్క మొటిమ రాగానే బాబోయ్ నా ఫేస్ అంతా పాడై పోతుందేమో, నా అందం తగ్గుతుందేమో అని భయపడుతారు. ఇక హీరోయిన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మొటిమలు రాకుండా ముందస్తుగానే చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. మృణాల్ ఠాకూర్ మాత్రం తనకు వచ్చిన అనుకోని అతిథికి స్వాగతం చెప్పడంతో పాటు, ఎప్పుడు వెళ్తావు, వెళ్లిన తర్వాత షూటింగ్‌కి వెళ్లాలి అంటూ ఫన్నీగా స్పందించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మామూలుగానే హీరోయిన్స్ అందంకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. అయితే కొందరు మొటిమలతోనూ చాలా అందంగా కనిపిస్తారు. మృణాల్ కూడా ఆ మొటిమ ఉన్నా చాలా అందంగా ఉందని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. తెలుగులో సీతారామం సినిమాతో ఎంట్రీ ఇచ్చి సూపర్ హిట్ దక్కించుకున్న మృణాల్ ఠాకూర్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్స్ జాబితాలో చేరింది. హాయ్ నాన్న సినిమాలో నానికి జోడీగా నటించి మెప్పించింది. ఆ సినిమా కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఆ సినిమాలో మృణాల్ నటనతో మెప్పించింది. మృణాల్ అందమైన రూపంతో పాటు, నటన ప్రతిభ ఉన్న నటి కావడంతో అన్ని భాషల్లోనూ ఆఫర్లు వస్తున్నాయి. త్వరలోనే ఈమె తమిళ్ మూవీతోనూ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. హిందీలో దశాబ్ద కాలంగా సినిమాలు చేస్తోంది. ఈమధ్య కాలంలో అక్కడ పాపులారిటీని సొంతం చేసుకుంది. ఈమె బుల్లి తెరపై కూడా కెరీర్ ఆరంభంలో కనిపించి సందడి చేసింది.

## తెలుగు లోగిళ్లలో భాగ్యం నాటి నాయికల్లా!

తెలుగు అమ్మాయే అయినా ఓన్ చేసుకోవడానికి మాత్రం ఐశ్వర్యా రాజేష్ విషయంలో చాలా సమయం పట్టింది అన్నది వాస్తవం. భా అంటూ భాగ్యం ఒక్క డైలాగుతో తెలుగు అమ్మాయి పెర్ఫార్మెన్స్ అంటే ఇలా ఉంటుంది? అని నిరూపించింది. సంక్రాంతికి వస్తున్నాం చిత్రంలో విక్టరీ వెంకటేష్ కి భార్య పాత్రలో నటించిన ఐశ్వర్యా రాజేష్ కిప్పుడు తెలుగు ఆడియన్స్ నీరాజనాలు పడుతోన్న సంగతి తెలిసిందే. ఆమెకంటూ ప్రత్యేకమైన అభిమమానులు ఏర్పడ్డారు. ఫ్యామిలీ ఆడియన్స్ లో ఓ ప్రత్యేక నటిగా గొప్ప స్థానాన్ని సంపాదించింది. ఒకప్పుడు ఇలాంటి ఇల్లాలి పాత్రలు పోషించాలంటే? సౌందర్య, ఆమని, రమ్యకృష్ణ లాంటి నటులు మాత్రమే సరితూగేవారు. అప్పట్లో వాళ్ల నటనకు మాత్రమే అలాంటి ఆడియన్స్ ఉండేవారు. మళ్లీ చాలా కాలానికి అలాంటి అభిమానుల్ని ఐశ్వర్యా రాజేష్ ఒక్క సినిమాతో సంపాదించుకుంది. అయితే ఈ సక్సెస్ ఐశ్వర్యకు అంత తేలిగ్గా రాలేదు. తెలుగు అమ్మాయి అయినా ఐశ్వర్యకు తెలుగు వాళ్లు అవకా



లివ్వలేదు. చిన్నప్పుడు రాజేంద్ర ప్రసాద్ నటించిన రాంబంటులో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించింది. కానీ హీరోయిన్ గా మాత్రం కోలీవుడ్ అవకాశిలిచ్చింది. అక్కడ నిరూపించుకున్న తర్వాత టాలీవుడ్ లో ప్రయాణం మొదలు పెట్టింది. ఆరేళ్ల క్రితమే కౌసల్య కృష్ణమూర్తి సినిమాలో నటించింది. ఆ తర్వాత మిస్ మ్యాచ్, వరల్డ్ ఫేమస్ లవర్, రిపబ్లిక్ లాంటి చిత్రాల్లో నటించింది.

ఇవేవి కూడా ఐశ్వర్యని టాలీవుడ్ లో బిజీ నటిగా మార్చలేకపోయాయి. దీంతో కోలీవుడ్ లో కొనసాగుతూనే ఇక్కడ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో దర్శకుడు అనీల్ రావిపూడిలో ఆమె లో కొత్త యాంగిల్ చూసాడు. అలా సంక్రాంతికి వస్తున్నాం లో వెంకీ భార్య పాత్రకు అవకాశం వచ్చింది. ఈ సినిమా సక్సెస్ తో ఐశ్వర్యకు అవకాశాలు క్యూ కడుతున్నాయని సమాచారం.




## 'కల్కి 2' మొదలైతే రెండున్నరేళ్లు సెట్స్ లోనే!




'కల్కి 2' ఎప్పుడు పట్టాలెక్కుతుంది అన్న దానిపై సరైన క్లారిటీ లేదు. అందుకు కారణం ప్రభాస్ బిజీ షెడ్యూల్ ఒకటైతే 'కల్కి 2' భారీ స్పాన్ ఉన్న కథ కావడంతో చిత్రీకరణకు ఎక్కువ సమయంపడుతుం దన్నది మరో కారణం. మరి ఈ సినిమాకు మోక్షం ఎప్పుడు అంటే? ప్రభాస్-నాగ్ అశ్విన్ బలంగా సంక ల్పించినప్పుడే సాధ్యమవుతుంది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అయినా రెండు...మూడు సినిమాలకు సమానంగా ఉంటుందని నాగీ ధీమా వ్యక్తం చేసాడు. అంటే ఒకేసారి రెండు..మూడు సినిమాలు కలిపి సాధిస్తే వచ్చే విజయం కల్కి 2 ఒక్క హిట్ తోనే సాధ్యమన్నది నాగీ ఉద్దేశం. తాజాగా నిర్మాణ వర్గాల నుంచి వినిపిస్తోన్న సమాచారం ఏంటంటే? కల్కి 2 షూటింగ్ రెండున్నరేళ్ల పాటు ఉంటుందంటున్నారు. సెట్స్ కి వెళ్లిన తర్వాత నిర్విరామంగా చిత్రీకరణ చేస్తే అంత సమయం పడుతుందంటున్నారు. మధ్యలో బ్రేక్ లు ఇస్తూ షూట్ చేస్తే అంతకు మించిన సమయం పడుతుందని చెబుతున్నారు. అలాగే ప్రభాస్ కూడా 'కల్కి 2' మొదలైతే గనుక మరో సినిమా షూటింగ్ చేసే సమయం కూడా ఉండదం టున్నారు. పూర్తిగా ఈ సినిమాకు బాండ్ అయిన పనిచేస్తే తప్ప రెండున్నరేళ్లలో పూర్తి చేయడం కష్టమం టున్నారు. రెండు న్నరేళ్లు గాక సీజీ వర్క్ కోసం అదనంగా ఎనిమిది నెలలు సమయం పడుతుందం టున్నారు. అందుకే ఈ చిత్రాన్ని పట్టాలెక్కించడంలో జాప్యం జరుగుతుందంటున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఇప్పటికిప్పుడు పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లు కొన్ని ఉన్నాయి.' పౌజీ' సెట్స్ లో ఉంది. దీని తర్వాత 'స్పిరిట్' మొదలవుతుంది. అనంతరం 'సలార్ 2' పట్టాలెక్కుతుంది. ఇవి పూర్తవ్వడానికే రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. మధ్యలో మళ్లీ డార్లింగ్ కొత్త సినిమాలంటూ ఎలాంటి ట్విస్టులు ఇవ్వకుండా ఉంటే వీటి తర్వాత 'కల్కి 2' మొదలవుతుంది. లేదంటే ఇంకా సమయం పడుతుంది.


## మీడియం రేంజ్ హీరోల విషయంలోనూ నిర్మాతలు తగ్గేదేలే!



ఒకప్పుడు స్టార్ హీరో కోసమే నిర్మాత రిస్క్ తీసుకుని 100 కోట్లు ఖర్చు చేసేవారు. పక్కాగా బిజినెస్ అవుతుం దనే నమ్మకంతోనే అంత భారీ మొత్తంలోపెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చేవారు. ఇక్కడ మరో సినారే కూడా ఉంది. ఒకవేళ సినిమా ఫ్లాప్ అయి నష్టాలు వస్తే గనుక అదే హీరో తన పారితోషికంలో కొంత మిన హాయింపు ఇస్తాడనో..పూర్తిగా వదులుకుంటాడనే భరోసా కూడా నిర్మాతకు ఉండేది. దీంతో నిర్మాత మరో ఆలోచన లేకుండా ముందుకొచ్చే వాడు. అదే మీడియం రేంజ్ హీరోలపై అంత మొత్తం పెట్టాలంటే నిర్మాత చాలా విషయాలు ఆలోచించేవారు. 50 కోట్లు ఖర్చు చేయడమే ఎక్కువగా భావించేవారు. దీంతో దర్శకులు కూడా బడ్జెట్ ఓవర్ ది బోర్డ్ దాట కుండానే పూర్తి చేయాల్సి వచ్చేది. ఇలా కొంత రాజీతో కూడిన నిర్మాణం మీడియం రేంజ్ హీరోల విషయంలో జరిగేది. అయితే ఇప్పుడు మీడియం రేంజ్ హీరోలపై కూడా 100 కోట్లు పెట్టడానికి నిర్మాతలు వెనకడుగు వేయడం లేదు. వస్తే కొండ పోతే పైసా అన్న లెక్కలో ధైర్యంగా నిర్మాణంలోకి దిగిపోతున్నారు. నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల ది ప్యారడైజ్ తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. దసరాతో నాని 100 కోట్ల క్లబ్ లో చేరాడు. దీంతో ప్యారడైజ్ బడ్జెట్ ఏకంగా 120 కోట్లుగా మారింది. అలాగే మెగా మేనల్లుడు సాయితేజ్ హీరోగా రోహిత్ కె. పి సంబరాల ఏటిగట్టు అనే సినిమా రూపొందిస్తున్నాడు. ఈ సినిమా బడ్జెట్ కూడా 125 కోట్లు అంటున్నారు. విరూపాక్షతో సాయితేజ్ కూడా సెంచరీ కొట్టేసిన సంగతి తెలిసిందే. ఇక అక్కినేని వారసుడు ఇటీవలే తండేల్ తో 100 కోట్ల క్లబ్ లో చేరిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కార్తిక్ దండు తో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా బడ్జెట్ కూడా సుమారు 100 కోట్లు అని సమాచారం. తండేల్ రిలీజ్ కు ముందే ఫిక్స్ అయిన బడ్జెట్ ఇది. అలాగే నిఖిల్ స్వయంభూ, యంగ్ హీరో తేజ సజ్జా మిరాయ్ చిత్రాల బడ్జెట్ కూడా సెంచరీకి సమీపంలోనే ఉందని అంటున్నారు.

## సమ్మర్ కంటే ఘాటుగా సుప్రితా గ్లామర్ డోస్


తెలుగు ఇండస్ట్రీలో నటిగా మంచి గుర్తింపు అందుకున్న సురేఖవాని సోషల్ మీడియాలో కూడా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ను సంపాదించుకుంది. ఇక ఆమె కూతురు సుప్రితా ఫ్యాషన్ వరల్డ్ లో డిఫరెంట్ సెలెబ్రిటీగా ఎదిగింది. బిగ్ బాస్ షో ద్వారా గుర్తింపు పొందిన ఈ బ్యూటీ, సోషల్ మీడియా వేదికగా తన అందంతోనే కాదు, ఆత్మవిశ్వాసంతోను విభిన్నంగా నిలుస్తోంది. గ్లామర్ ఫోటో షూట్స్, బోల్డ్ స్టైల్‌తో యూత్‌లో ప్రత్యేకంగా ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇప్పుడు ఆమె లేటెస్ట్ పోస్టులు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. బీచ్ పూల్‌లో విహరిస్తూ, ఒక చేతిలో కాఫీ, మరోచేతిలో కాక్‌టెయిల్‌తో సన్‌బాత్ తీసుకుంటూ కనిపించింది. గ్లామరస్ డ్రెస్సింగ్, కూల్ గాగుల్స్, నాజూకుగా ఉన్న ఆ లుక్ చూస్తే, ఫ్యాషన్ ఫోటోషూట్‌లకు పోటీగా ఉంటుంది. ఆమె స్టైల్, ఎటిట్యూడ్ కలిసి



చూస్తే ఓ సినిమా పోస్టర్‌లా ఫీలవుతుంది. ప్రస్తుతం సుప్రితా షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఓ వైపు బీచ్, మరోవైపు క్లియర్ స్కై బ్యాక్డ్రాప్‌లో ఆమె లుక్ నెట్టింట్లో హీట్ పెంచుతోంది. ట్రెండీ టాప్ ను హైలైట్ చేస్తూ ఫోటో గ్రేస్‌ను పెంచింది. కామెంట్స్‌లో యూత్ పాజిటివ్ గా పొగిడేస్తున్నారు. 'సూపర్ గ్లామర్', 'బోల్డ్ బ్యూటీ' అంటూ కాంప్లిమెంట్లు కురిపిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఫ్యాషన్ ఫోటోషూట్లతో పాటు వెబ్ సిరీస్, స్మాల్ రోల్స్‌లో కనిపిస్తూ తన రేంజ్ పెంచుకుంటూ పోతోంది సుప్రితా. అయితే ఆమె ఫోటో షూట్ మాత్రం ఎప్పుడూ ట్రెండ్‌లో ఉంటుంది. ముఖ్యంగా యూత్‌లో ఆమె ఇమేజ్ గ్లామర్ మాయాజాలంలా మారింది. ఈ మధ్య ఆమె షేర్ చేస్తున్న ప్రతి పోస్టు పెద్ద స్థాయిలో వైరల్ అవుతోంది. ఇక ఈ తాజా బీచ్ ఫోటోషూట్ చూస్తే, ఆమె క్రేజ్ ఎలా పెరిగిందో అర్థమవుతోంది. గ్లామర్, స్టైల్, కంఫిడెన్స్ మిక్స్ చేసిన ఆమె లుక్ అభిమానులను ముగ్ధులను చేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతుండగా, ఆమె వచ్చే ప్రాజెక్ట్స్ పైన కూడా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అవార్డుల్లో హంసలా మెరిసిన కృతి

ప్రతిష్ఠాత్మక ఐఫా డిజిటల్ అవార్డ్స్ -2025 వేడుకలు జైపూర్‌లో కన్నుల పండుగగా సాగాయి. డిజిటల్ స్ట్రీమింగ్ లో ఉత్తమమైన సినిమాలు, సిరీస్ లను పురస్కారాలు వరించాయి. ఉత్తమ నటిగా 'దోపట్టీ' కోసం కృతి సనోన్ ఐఫా పురస్కారాన్ని గెలుచుకుంది. ఈ సినిమాతో కృతి సనోన్ నిర్మాతగాను ఆరంగేట్రం చేసింది. ఆ ఆనందం ఆవర్ణం అయిన వేళ కృతి సనోన్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. కృతి ఈ అవార్డుల కార్యక్రమంలో మెరుపులా కనిపించింది. 'వైట్ అండ్ వైట్'లో రాణీ హంసలా మెరిసిపోయిన కృతి ఫోటోగ్రాఫ్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ గా మారాయి. ముఖ్యంగా కృతి అవార్డ్స్ నైట్‌లో షో స్టాపర్ గా నిలిచింది. అవార్డ్ గెలుచుకున్న సందర్భంగా కృతి తన ఆనందాన్ని అస్సలు దాచుకోలేకపోయింది. నా మొదటి ప్రొడక్షన్ చదోపట్టీకి 'ఐఫా ఫస్ట్ డిజిటల్'లో ఉత్తమ నటిగా మొదటి అవార్డును అందుకున్నానని కృతి



మురిసిపోయింది. దో పట్టీకి రెండు పెద్ద విజయాలు. నా భాగస్వామి కనికాథిల్లాన్ (ఉత్తమ కథారచయిత) కి అభినందనలు !! బెస్ట్ స్టోరి.. బెస్ట్ యాక్టర్ అవార్డులు దక్కాయి! అని కృతి తెలిపింది. ఐఫాకు, ప్రేక్షకులందరి ప్రేమ మద్దతుకు ధన్యవాదాలు! అని ఆనందం వ్యక్తం చేసింది. ఈ గొప్ప క్షణం కోసం తనను వేదికపై ఉత్తమంగా కనిపించేలా చేసినందుకు తన బృందానికి అభినందనలు! తెలిపింది. తన కాస్ట్యూమ్స్- మేకప్ టీమ్ ని మరువకుండా ధన్యవాదాలు తెలిపింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కృతి సనన్ చివరిసారిగా నెట్‌ఫ్లిక్స్ ఫిల్మ్ దో పట్టిలో కనిపించింది. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కాజోల్, షహీర్ షేక్ కూడా కీలక పాత్రల్లో నటించారు. కరీనా, టబులతో కలిసి నటించిన 'క్రూ' చిత్రంతో కమర్షియల్ విజయం అందుకున్న సంగతి తెలిసిందే. మరోవైపు ప్రముఖ బిజినెస్ మేన్ వారసుడితో కృతి షికార్లు చర్చనీయాంశంగా మారాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536